

Karl Marx, Friedrich Engels, Vladimir Lenin, Joseph Stalin, Enver Hoxha

# 5 Classics of Marxism

Comintern (Stalinist-Hoxhaists)

**http://ciml.250x.com**






Georgian Section

**www.joseph-stalin.net**

**SHMG Press** – 2012

Karl Marx Press of the Georgian section of

Comintern (SH) – Stalinist-Hoxhaists Movement of Georgia

కె. మార్క్స్, ఎఫ్. ఎంగెల్స్



# కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

"ఈ గ్రంథం నూతన ప్రపంచ దృక్పథమైనట్టీ సామాజిక జీవన ప్రపంచాన్ని సహా పరిరంభించుమాన్నట్టీ సుసంగతమైన భౌతికవాదాన్నీ, అభివృద్ధియొక్క అత్యంత విస్తారమైన అత్యంత గంభీరమైన సిద్ధాంతముగా గతితార్కికవాదాన్నీ, వర్గపోరాటంయొక్క, శ్రామికవర్గ – నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టికర్త – విశ్వచారిత్రక విప్లవాత్మక పాత్రయొక్క సిద్ధాంతాన్నీ ప్రతిభాసమన్వితమైన స్పష్టతా సముజ్వలతలతో సంక్షిప్తముగా వివరించుతూంది."

లెనిన్

ప్రపంచ కార్మికులారా, ఏకముకండి!

కె. మార్క్స్, ఎఫ్. ఎంగెల్స్

# కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక[1]

విదేశభాషా ప్రచురణాలయం

మాస్కో

అనువాదం: గిడుతూరి సూర్యం

## ప్రకాశకుల సూచన

ఎంగెల్స్‌చే పరిష్కరించబడిన "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" 1888 ఇంగ్లీషు కూర్పు, ఈ తెలుగు అనువాదానికి మాతృక.

1888 ఇంగ్లీషు కూర్పునకూ 1890 జర్మను కూర్పునకూ ఎంగెల్స్ రాసిన వివరణలు ఈ అనువాదంలో ఇవ్వబడ్డాయి.

"ప్రణాళిక"యొక్క వివిధ కూర్పులకు గ్రంథకర్తలు రచించిన పీఠికలు కూడా ఈ అనువాదంలో చేర్చబడ్డాయి.

# విషయసూచిక


1872 జర్మన్ కూర్పుకు పీఠిక . . . . . . . . . . . 7
1882 రష్యన్ కూర్పుకు పీఠిక . . . . . . . . . . . 10
1883 జర్మన్ కూర్పుకు పీఠిక . . . . . . . . . . . 13
1888 ఇంగ్లీషు కూర్పుకు పీఠిక . . . . . . . . . . . 15
1890 జర్మన్ కూర్పుకు పీఠిక . . . . . . . . . . . 22
1892 పోలిష్ కూర్పుకు పీఠిక . . . . . . . . . . . 29
1893 ఇటాలియన్ కూర్పుకు పీఠిక . . . . . . . . . . 31


## కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక


I. బూర్జువాలు, శ్రామికులు . . . . . . . . . . . . 34

II. శ్రామికులు, కమ్యూనిస్టులు . . . . . . . . . . . 50

III. సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం . . . . . . . . . 63

1. అభివృద్ధి నిరోధక సోషలిజం . . . . . . . . . 63

ఎ. ఫ్యూడల్ సోషలిజం. . . . . . . . . . . . 63

బి. పెట్టీబూర్జువా సోషలిజం . . . . . . . . . . 65


సి. జర్మన్ సోషలిజం, లేక "యథార్థమైన" సోషలిజం . . . . 67

2. సంప్రదాయరక్షక, లేక బూర్జువా సోషలిజం. . . . . . . 70

3. విమర్శనాత్మక-ఊహాజనితమైన సోషలిజం, కమ్యూనిజం . . . . 72

IV. వివిధ ప్రతికూల పక్షాలపట్ల కమ్యూనిస్టుల స్థానం . . . . . . 76

వివరణలు . . . . . . . . . . . . . . . . . 79



Karl Marx



F Engels

# 1872 జర్మన్ కూర్పుకు పీఠిక

ఆ రోజుల్లో వున్న పరిస్థితులనుబట్టి సహజంగానే రహస్యంగా పనిచేయవలసి వచ్చిన అంతర్జాతీయ కార్మికసంఘం అయిన "కమ్యూనిస్టు లీగ్"[2] 1847 నవంబరు నెలలో లండన్‌లో జరిగిన కాంగ్రెస్‌లో సైద్ధాంతికమైనట్టి ఆచరణీయమైనట్టి విపులమైన పార్టీ కార్య క్రమాన్ని ప్రచురణార్థం తయారు చేయవలసిందని యీ దిగువ సంతకం చేసినవారిని ఆదేశించింది. ఈవిధంగా యీ దిగువ "ప్రణాళిక" ఉద్భవించింది. ఈ "ప్రణాళిక" వ్రాతప్రతి ముద్రణ కోసమని ఫిబ్రవరి విప్లవానికి* కొన్నివారాలముందు లండన్‌కు పంపబడింది. మొదట జర్మన్‌భాషలో ప్రచురించబడి, తరువాత ఆ భాషలో కనీసం పన్నెండు వివిధ కూర్పులలో జర్మనీ, ఇంగ్లండు అమెరికాలలో ప్రచురించబడింది. ఈ ప్రణాళిక ఇంగ్లీషులో మొట్టమొదటి సారిగా 1850లో లండన్ "Red Republican"** పత్రికలో ప్రచురింపబడింది. ఈ అనువాదాన్ని మిస్ హెలెన్ మెక్‌ఫర్లేన్ చేసింది. 1871లో అమెరికాలో కనీసం మరో మూడు వేర్వేరు ఇంగ్లీషు అనువాదాలు ప్రచురించబడ్డాయి. 1848 జూన్‌లో జరిగిన తిరుగుబాటుకు కొద్దికాలం ముందు ఒక ఫ్రెంచి భాషాంతరం వెలువడింది. ఇటీవలనే న్యూయార్క్ పత్రిక "Le Socialiste"*** లో ఇది ప్రచురింపబడింది. ఒక కొత్త అనువాదం యిప్పుడు తయారు అవుతోంది. జర్మన్‌లో తొలిసారిగా ప్రచురించబడిన కొద్ది రోజుల్లోనే పోలిష్ భాషాంతరం లండన్‌లో వెలువడింది. 1860 దశాబ్దిలో ఒక రష్యన్ అనువాదం జినీవాలో

---

* ఫ్రాన్సులో జరిగిన 1848 ఫిబ్రవరి విప్లవం.—సం.

** "రెడ్ రిపబ్లికన్".—సం.

*** "లె సొసియాలీస్టె".—సం.

ప్రచురించబడింది. ఈ ప్రణాళిక మొదటి సారిగా వెలువడిన కొద్ది రోజుల్లోనే డేనిష్ భాషలో కూడా అనువదించబడింది.

గత పాతిక సంవత్సరాలలో పరిస్థితులు ఎంత మారినప్పటికీ కూడా యీ ప్రణాళికలో సూచించిన మూలసూత్రాలు ఈనాటికీ కూడా మొత్తంమీద వాటి యథార్థతను నిలబెట్టుకున్నాయి. అక్కడక్కడా కొన్ని వివరాలను మాత్రం యింకా మెరుగుపరచవచ్చు. ఈ మూల సూత్రాల ఆచరణ, ఈ ప్రణాళికే పేర్కొన్నట్టు, సర్వత్రా సర్వకాలాలందూ ఉంటూన్నట్టి చారిత్రక పరిస్థితులపై ఆధారపడివుంటుంది. ఆ కారణంవల్లనే రెండవ అధ్యాయం అంత్యంలో ప్రతిపాదింపబడిన విప్లవ చర్యలను ప్రత్యేకంగా నొక్కిచెప్పడం లేదు. ఈనాడు అనేక విషయాలలో గ్రంథంలో ఆ భాగాన్ని వేరే మాటల్లో రాయవలసి వుంటుంది. గత ఇరవై అయిదు సంవత్సరాలలో పెద్ద పరిశ్రమలు బ్రహ్మాండమైన అభివృద్ధిచెందడం దృష్ట్యానూ, దీని అనుగామి అయిన కార్మికవర్గంయొక్క పార్టీ నిర్మాణం అభివృద్ధి చెంది విస్తరించడం దృష్ట్యానూ, మొదట ఫిబ్రవరి విప్లవంలోనూ ఆతర్వాత మరింతగా శ్రామిక వర్గం మొట్టమొదటి సారిగా రాజకీయ శక్తిని పూర్తిగా రెండు నెలలు చలాయించినట్టి పారిస్ కమ్యూన్‌లో ఆచరణసిద్ధమైన అనుభవాన్ని గడించడం దృష్ట్యానూ యీ ప్రణాళికలోని కొన్ని వివరాలు పాతబడి పోయాయి. పారిస్ కమ్యూన్ ముఖ్యంగా ఒక విషయాన్ని రుజువుపరచింది, అదేమిటంటే "శ్రామికవర్గం, తయారైై సిద్ధంగా ఉన్న రాజ్యాంగయంత్రాంగాన్ని స్వాధీనంచేసుకొని తన సొంత ఉపయోగాలకై నడిపించజాలదు" ("ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అనే గ్రంథం, అంతర్జాతీయ కార్మికుల సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశంలో యివ్వబడిన ఉపన్యాసం, లండన్, ట్రూలౌ, 1871 పుట 15, చూడండి. అక్కడ యీ అంశం యింకా ఎక్కువగా విపులీకరించబడింది.*) ఇంకాపైగా, యీనాటికి సంబంధించినంతవరకూ యీ "ప్రణాళిక"లో సోషలిస్టు సారస్వతంపై విమర్శన లోపాలతో కూడుకుని ఉన్నట్టు స్వతస్సిద్ధంగా వ్యక్తమౌతుంది. అందుకు కారణం ఏమంటే 1847కు ముందు ప్రచురింపబడిన సారస్వతానికి మాత్రమే ఆ విమర్శన అన్వయిస్తుంది. వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరిని వివరిస్తూ (అధ్యాయం IV) ఎత్తిచూపిన విశేషాలు సూత్రప్రాయంగా యీనాటికీ సరియైనవే అయినప్పటికీ ఆచరణరీత్యా అవి పాతపడిపోయాయి. ఎందువల్లనంటే నేడు రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాగా చరిత్ర పురోగమనం అందులో

---

* K. Marx and F. Engels, *Selected Works*, Two-vol. ed., Vol. I. Moscow 1958, p. 473 et. seq. —సం.

వరుసగా వివరించి చెప్పబడిన రాజకీయ పార్టీలలో అధిక సంఖ్యను యీ భూప్రపంచం నుండి తుడిచివేసింది.

ఐనా యీ ప్రణాళిక ఒక చారిత్రక పత్రమైపోయింది. దానిని యిక మార్చడానికి మాకు ఏలాంటి హక్కూ లేదు. 1847 నుండి యీనాటివరకూ ఏర్పడ్డ ఖాళీని భర్తీ చేసే ఉపోద్ఘాతంతో దరిమిలా ఒక కూర్పు వెలువడవచ్చు. ఈ పునర్ముద్రణ అనుకోకుండా జరుగుతూండడంచేత అందుకు మాకు వ్యవధి లభించడంలేదు.

కారల్ మార్క్స్. ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, జూన్ 24, 1872

# 1882 రష్యన్ కూర్పుకు పీఠిక

బకూనిన్ అనువదించిన తొలి రష్యన్ ''కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక''ను 1860 దశాబ్దిలో ''కోలొకొల్''[3] పత్రిక ముద్రణాలయం ప్రచురించింది.* అప్పుడు పశ్చిమ దేశాలవారు ఆ గ్రంథాన్ని (అంటే ''కమ్యూనిస్టు ప్రణాళిక'' రష్యన్ కూర్పుని) ఒక సారస్వత సంబంధమైన విచిత్రంగా వీక్షించారు. అట్టి అభిప్రాయం యీనాడు అసంభవం.

ఆనాటికి (డిసెంబరు 1847 నాటికి) యింకా శ్రామికవర్గ ఉద్యమం ఎంత పరిమితమైన క్షేత్రాన్ని ఆక్రమించిందో యీ ప్రణాళిక ఆఖరి అధ్యాయం, అనగా వివిధ దేశాలలోని వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరిని గురించిన అధ్యాయం అత్యంత స్పష్టంగా తెలుపుతూంది. ఇక్కడ రష్యా, యునైటెడ్ స్టేట్సు అసలే అగపడవు. సరిగ్గా ఆ రోజుల్లోనే రష్యా, యూరోపియన్ దేశాలలోకి అభివృద్ధినిరోధకం అంతటియొక్క బ్రహ్మాండమైన ఆఖరి రిజర్వు సైన్యంగా ఏర్పడింది. ఆ రోజుల్లోనే యునైటెడ్ స్టేట్సు యూరప్‌యొక్క అదనపు శ్రామిక శక్తులను వలస రూపేణా తనలోకి ఇమిడ్చేసుకుంది. యీ రెండు దేశాలూ కూడా యూరప్‌కు ముడిసరుకులను అందించేవి; రెండు దేశాలూ కూడా యూరప్‌యొక్క పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకానికి మార్కెట్లుగా ఉండేవి. కాబట్టి ఆ రోజుల్లో యీ రెండు దేశాలూ ఈ విధంగానైతేనేమి ఆ విధంగానైతేనేమి, ఆనాటి యూరోపియన్ వ్యవస్థకు మూలస్తంభాలుగా ఉండేవి.

---

* ఇక్కడ పేర్కొన్న కూర్పు 1869లో వెలువడింది. 1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ రాసిన పీఠికలో కూడా, ప్రణాళికయొక్క యీ రష్యన్ అనువాదం తేదీని తప్పుగా పేర్కొనడం జరిగింది (17 పుటను చూడండి).—సం.

ఆ రోజులకీ యీ రోజులకీ ఎంతో భేదం వుంది! యూరప్‌నుండి వలసపోవడంవల్ల ఉత్తర అమెరికాకు బ్రహ్మాండమైన వ్యవసాయక ఉత్పత్తి శక్తి చేకూరింది. ఈ వ్యవసాయక ఉత్పత్తి పోటీ పెద్ద చిన్న తారతమ్యం లేకుండా యూరోపియన్ భూఆస్తినంతటినీ పునాదులతో సహా కదిపివేస్తోంది. దీనికితోడు యునైటెడ్ స్టేట్సు తన బ్రహ్మాండమైన పారిశ్రామిక ఉత్పత్తి వనరులను, పశ్చిమ యూరపు పారిశ్రామిక గుత్తాధిపత్యాన్ని, ముఖ్యంగా నేటి వరకూ వున్న ఇంగ్లండు గుత్తాధిపత్యాన్ని కొద్దికాలంలోనే బద్దలు చేసేటంతటి శక్తితోనూ, అంతటి స్థాయిలోనూ ఉపయోగించుకునేట్టు ఇది సమర్థతను కలుగజేసింది. ఈ రెండు పరిస్థితులూ విప్లవాత్మక పద్ధతిలో అమెరికాపైనే ప్రతిక్రియను సల్పుతాయి. మొత్తం రాజకీయనిర్మాణానికంతటికీ ప్రాతిపదిక అయిన చిన్న, మధ్యతరగతి రైతుల భూస్వామ్యం క్రమక్రమేణా బ్రహ్మాండమైన కమతాల పోటీకి నిలవలేక క్రుంగిపోతూవుంది; అదే సమయంలో పారిశ్రామిక ప్రాంతాలలో మొట్టమొదటి సారిగా ఒక అశేష ప్రజానీక శ్రామికవర్గమూ, ఒక అపారమైన పెట్టుబడుల కేంద్రీకరణమూ అభివృద్ధి చెందుతూన్నాయి.

ఇక రష్యా విషయం తీసుకుందాం! 1848–49 విప్లవంలో యూరోపియన్ రాజులే కాకుండా యూరోపియన్ బూర్జువావర్గంవారు కూడా అప్పుడే మేల్కొంకొంటూన్న శ్రామిక వర్గంనుండి తప్పించుకోడానికి, ఒక్క రష్యా జోక్యం కలుగజేసుకోవడంలోనే తమకు మోక్షం దక్కుతుందని తెలుసుకున్నారు. జార్‌ప్రభువు యూరోపియన్ అభివృద్ధి నిరోధకానికి నాయకుడని ప్రకటించారు. ఈనాడు అతడు గాత్చినలో విప్లవయుద్ధఖైదీ. యూరప్‌లోని విప్లవాత్మక కార్యాచరణకి రష్యా అగ్రగామిదళంగా ఏర్పడింది.

ఆధునిక బూర్జువావర్గపు ఆస్తి మున్ముందు తప్పనిసరిగా విచ్ఛిన్నమైతీరుతుందని ప్రకటించడమే "కమ్యూనిస్టు ప్రణాళిక" తన లక్ష్యంగా పెట్టుకుంది. కాని రష్యాలో, త్వరిత గతిని అభివృద్ధి చెందుతోన్న పెట్టుబడిదారీ వంచనకూ, బూర్జువావర్గంయొక్క భూఆస్తికీ ముఖాముఖిగా మొత్తం భూమిలో సగంకంటే ఎక్కువ భాగం సమిష్టిగా రైతుల యాజమాన్యంకిందే వుండడం మనం చూస్తున్నాం. ఇప్పుడిక ఉద్భవించే ప్రశ్న ఏమిటంటే: రష్యన్ ఒబ్‌ష్చిన* ఎంత అధికంగా క్షీణించిపోయినప్పటికీ కూడా భూమిపై సమిష్టి యాజమాన్యం అనే ఆదిమరూపమే అయిన రష్యన్ ఒబ్‌ష్చిన కమ్యూనిస్టు సమిష్టి యాజమాన్యం అనే ఉన్నత రూపంలోకి సరాసరి మారగలుగుతుందా? లేక అందుకు విరుద్ధంగా, పశ్చిమ

* ఒబ్‌ష్చిన: గ్రామ సంఘం.—సం.

దేశాలు ఏవిధానంలో చారిత్రక పరిణామాన్ని పొందాయో అట్టి విచ్ఛిన్నవిధానానికే ఇది కూడా మొదట లోనుగావలిసిందేనా?

ఇందుకు యీనాడు ఇవ్వడానికి వీలైన సమాధానం ఒక్కటే: రెండూ ఒక దాని నొకటి పూర్తిచేస్తూ, రష్యన్ విప్లవం గనక పశ్చిమ దేశాలలోని శ్రామిక విప్లవానికి చిహ్నమై నట్లైతే యీ నాడు రష్యాలో వున్న భూమిపై సమిష్టి యాజమాన్యత కమ్యూనిస్టు పరిణామానికి ఆరంభస్థానంగా ఉపయోగపడగలగుతుంది.

కారల్ మార్క్స్. ఎఫ్. ఎంగెల్స్

లండన్, జనవరి 21, 1882

# 1883 జర్మన్ కూర్పుకు పీఠిక

ఈ నేటి కూర్పు పీఠికపై దురదృష్టవశాత్తూ నేను ఒక్కడనే సంతకం చేయవలసి వుంది. యూరప్, అమెరికాలలోని కార్మికవర్గం ఇతరులకంటే మార్క్సుకే ఎంతో ఋణ పడి వుంది. అలాంటి మార్క్స్ నేడు "హైగేట్ శ్మశానం"లో శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయన సమాధిపై అప్పుడే తొలి పచ్చిక మొలుస్తోంది. అతని మర ణానంతరం "ప్రణాళికను" తిరిగి వ్రాయడం, లేదా అనుబంధాన్ని చేర్చడం అనే ఆలోచనకే తావులేదు. అందుచేతనే నేను యిక్కడ మళ్లీ యీకింది విషయాలను చెప్పవలసిన అవసరం ఎంతైనా వుందనుకుంటాను:

ఈ "ప్రణాళిక"లో అంతర్వాహినిగా ఉన్న మూల భావం సంపూర్ణంగానూ ప్రత్యే కంగానూ మార్క్సుది. ఈ సిద్ధాంతం ఏమిటంటే చరిత్ర ప్రతి శకంయొక్క ఆర్థిక ఉత్పత్తీ దానినుండి తప్పనిసరిగా తలయెత్తే సమాజిక నిర్మాణమూ ఆ దశలోని రాజకీయ, మాన సిక చరిత్రకూ పునాదిగా ఉంటాయి; అందువల్ల చరిత్ర అంతా (అంటే భూమిపై సమిష్టి యాజమాన్యం రద్దు అయినప్పటినుండి నేటివరకూ, సామాజికాభివృద్ధియొక్క వివిధ దశలలో) వర్గాలమధ్య, పీడిత వర్గాలకు పీడక వర్గాలకుమధ్య, పాలిత పాలక వర్గాలమధ్య జరిగే పోరాటాల చరిత్రయే; అయినప్పటికీ యీ పోరాటం నేడు ఏదశకు వచ్చిందంటే దోపిడీ చేయబడి అణగదొక్కబడినట్టి వర్గం (శ్రామిక వర్గం) తనను దోచుకొని అణచివేసే వర్గం (బూర్జువావర్గం) నుండి తాను విముక్తి పొందాలంటే అదేసమయంలో మొత్తం

సమాజాన్నంతటినీ దోపిడీనుంచీ, పీడననుంచీ శాశ్వతంగా విముక్తి చేస్తేనేగాని దానికి వీలుపడదు.*

ఈ విషయాన్ని నేను యిదివరకే అనేకసార్లు పేర్కొన్నాను. అది యిప్పుడు అసలు ''ప్రణాళిక'' ఎదుటనే ఉండడం కూడా అవసరం.

ఎఫ్.ఎంగెల్స్

లండన్, జూన్ 28, 1883

---

* ''నా అభిప్రాయంలో, డార్విన్ సిద్ధాంతం జీవశాస్త్రానికి ఎట్టి సేవ చేసిందో అట్టి సేవనే చరిత్రకు విధిగా చేయనున్న ఈ ప్రమేయానికి మేం యిద్దరమూ కూడా 1845కు ముందు కొన్ని సంవత్సరాలనుండీ దగ్గరపడుతూ వచ్చాం. నేను స్వతంత్రంగా దానివైపు ఎంతవరకు పురోగమించానో తెలుసుకోవాలంటే నేను రాసిన ''ఇంగ్లండులో కార్మికవర్గ స్థితి'' అన్న గ్రంథాన్ని చదివితే స్పష్టంగా తెలుస్తుంది. కాని 1845 వసంత ఋతువులో నేను మార్క్సును బ్రస్సెల్స్‌లో మళ్ళీ కలుసుకున్నప్పుడు అతడు అప్పటికే దానిని సమగ్రంగా తయారుచేసి నేను ఆ సిద్ధాంతాన్ని యిక్కడ ఎంత స్పష్టంగా పేర్కొన్నానో అతడు దానిని అంతస్పష్టంగానే నా ముందు వుంచాడు'', అని నేను ఇంగ్లీషు అనువాదానికి పీఠికలో రాశాను''. [1890 జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

# 1888 ఇంగ్లీషు కూర్పుకు పీఠిక

ఈ "ప్రణాళిక," మొట్టమొదట ప్రత్యేకంగా జర్మన్ కార్మికుల సంఘంగా, ఆతర్వాత అంతర్జాతీయ సంస్థగా ఏర్పడి, 1848కి పూర్వం యూరప్‌లోని రాజకీయ పరిస్థితుల కారణంగా అనివార్యంగా ఒక రహస్య సంఘంగా పనిచేయవలసి వచ్చిన "కమ్యూనిస్టు లీగ్" యొక్క వేదికగా ప్రచురింపబడింది. 1847 నవంబరులో లండన్‌లో జరిగిన యీ సమితి యొక్క కాంగ్రెస్‌లో సైద్ధాంతికమైన ఆచరణీయమైన సంపూర్ణ పార్టీ కార్యక్రమాన్ని ప్రచురణకై సిద్ధంచేయవలసిందిగా మార్క్సునూ, ఎంగెల్సునూ ఆదేశించడం జరిగింది. 1848 జనవరిలో యీ పార్టీ కార్యక్రమం జర్మను భాషలో సిద్ధమై, 24వ ఫిబ్రవరి ఫ్రెంచి విప్లవానికి కొద్దివారాలు ముందుగా దీని వ్రాతప్రతి లండన్‌లో వున్న ముద్రాపకునికి పంపబడింది. 1848 జూన్ తిరుగుబాటుకు కొద్దికాలం ముందు ఫ్రెంచి అనువాదం ఒకటి పారిస్‌లో వెలువడింది. మిస్ హెలెన్ మెక్‌ఫర్లెన్ అనువదించిన మొదటి ఇంగ్లీషు అనువాదం, జార్జి జూలియన్ హర్నే నడుపుతున్న "Red Republican" అను లండన్ పత్రికలో 1850లో ప్రచురించబడింది. డేనిష్, పోలిష్ అనువాదాలు కూడా ప్రచురింపబడ్డాయి.

1848 జూన్ పారిస్ తిరుగుబాటు — కార్మిక వర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య జరిగిన మొదటి మహత్తర యుద్ధం — విఫలమవడంవల్ల కొంతకాలంవరకు యూరోపియన్ కార్మికవర్గంయొక్క సాంఘిక రాజకీయ ఆశయాలు పూర్వరంగానికి మళ్ళవలసి వచ్చింది. అప్పటినుండీ ఆధిపత్యస్థానాని కోసం మళ్ళీ జరిగిన పోరాటమంతా కూడా ఫిబ్రవరి విప్లవానికి పూర్వం వలెనే కేవలం ఆస్తులుగల ధనికవర్గంలోని వివిధ భాగాల మధ్య జరిగిన పోరాటమే; కార్మికవర్గం కాసింత సందు మాత్రం సంపాదించుకోడానికే తన రాజకీయ హక్కులకోసం సాగించాల్సిన పోరాటానికీ, మధ్యతరగతికి చెందిన రాడికల్ పార్టీలో ఒక అతి

వాద ముఠాగా మాత్రమే ఉండాల్సిన స్థితికీ దిగజారిపోయింది. ఎక్కడెక్కడైతే స్వతంత్ర శ్రామికోద్యమాలు యింకా బ్రతికి వున్న చిహ్నాలను కనబర్చాయో, ఆయా చోట్ల ఆ ఉద్యమాలు నిర్దాక్షిణ్యంగా వేటాడి అణచివేయబడ్డాయి. ఈవిధంగా ప్రష్యన్ పోలీసులు ఆ రోజుల్లో కొలోన్ పట్టణంలో తన కార్యస్థానాన్ని కలిగివున్న "కమ్యూనిస్టు లీగ్" సెంట్రల్ బోర్డును వేటాడి ఆ బోర్డు సభ్యులందర్నీ అరెస్టు చేశారు. వారంతా పద్దెనిమిది నెలలు ఖైదులో వున్న తర్వాత, 1852 అక్టోబరులో వారిపై విచారణ జరిగింది. ఈ ప్రఖ్యాత "కొలోన్ కమ్యూనిస్టుల విచారణ" అక్టోబరు 4వ తేదీనుండి నవంబరు 12వ తేదీవరకు జరిగింది; ఆ ఖైదీలలో ఏడుగురికి మూడునుండి ఆరు సంవత్సరాలవరకు శిక్ష విధింపబడింది. వారు ఒక కోటలోని ఖైదులో ఆ శిక్షను అనుభవింపవలసి వుంది. శిక్ష చెప్పబడిన వెంటనే యీ "కమ్యూనిస్టు లీగ్" మిగతా సభ్యులు లాంఛనప్రాయంగా రద్దు చేసివేశారు. ఆతర్వాత ఇక "ప్రణాళిక" అంధకారంలోకి పడిపోయినట్లే అయింది.

యూరోపియన్ కార్మికవర్గం పాలకవర్గాలను మరొకసారి ఎదుర్కొనేందుకు మళ్లీ కోలుకొని తగు బలాన్ని పుంజుకొనేటప్పటికి "అంతర్జాతీయ కార్మికుల సంఘం" తల యెత్తింది. కాని యీ సంఘం, యూరప్ అమెరికాలలోని సంఘర్షణా శక్తి సామర్థ్యయుతమైన శ్రామిక వర్గమంతటినీ ఒక సంఘంగా జ్వలనంచేసి ఐక్యపరచాలనే ముఖ్యోద్దేశంతో వుండడం వల్ల యీ "ప్రణాళిక"లోని సూత్రాలని వెనువెంటనే చాటిచెప్ప లేకపోయింది. ఇంగ్లిష్ ట్రేడ్‌యూనియన్లూ, ఫ్రాన్సు, బెల్జియం, ఇటలీ, స్పెయిన్ దేశాలలోని ప్రూడన్ అనుచరులూ, జర్మనీలోని లాసాల్* అనుచరులూ వీర్లందరికీ అంగీకారయోగ్యంగా వుండే విశాలమైన కార్యక్రమం యీ అంతర్జాతీయ సంఘానికి తప్పనిసరిగా అవసరమైంది. అన్ని పార్టీలకు సంతృప్తి కలిగే విధంగా ఆ కార్యక్రమాన్ని తయారు చేసిన మార్క్స్, కార్మిక వర్గం, తన సమిష్టి కార్యాచరణ ఫలితంగానూ పరస్పర చర్చల ఫలితంగానూ, తన మేధా సంపత్తిని తప్పక అభివృద్ధి చేసుకుంటుందని, పూర్తిగా విశ్వసించాడు. పెట్టుబడికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో సంభవించే సంఘటనలూ మార్పులే, విజయాల కంటే ఎక్కువగా వుండే పరాజయాలే, తమకు ప్రీతికరమైన వివిధ చిట్కా ఔషధాలు

---

* లాసాల్ వ్యక్తిగతంగా, తాను మార్క్స్ "శిష్యుడననీ" కాబట్టి "ప్రణాళిక"లోని సిద్ధాంతాలతో ఏకీభవిస్తాననీ ఎల్లప్పుడూ మాతో చెప్పేవాడు. కాని అతడు తన ప్రజాందోళనను కొనసాగిస్తున్నప్పుడు అంటే 1862–64 మధ్య ప్రభుత్వరుణాలపై ఆధారపడే సహకారకార్ఖానాలను మించి యింకేమీ కోరేవాడు కాదు. [ఎంగెల్స్ వివరణ.]

ఏమాత్రమూ సమర్థవంతములు కావని ప్రజల మనసులోకి చొచ్చేటట్టుగా తెలియజెప్పేందుకూ, కార్మిక వర్గవిముక్తికి అవసరమైన వాస్తవపరిస్థితులను మరింత ఎక్కువ సమగ్రంగా తెలుసుకోవడానికీ మార్గాన్ని సుగమం చేసేతీరాయి. మార్క్స్ విశ్వాసం నిజమైంది. అంతర్జాతీయ కార్మిక సంఘం 1874లో విచ్ఛిన్నమైనప్పుడు కార్మికులు 1864లో కంటే భిన్నమైన వ్యక్తులుగా మారిపోయారు. ఫ్రాన్సులోని ప్రూడోనిజం, జర్మనీలోని లాసాలియనిజం అవసానదశలో వున్నాయి, కాగా కన్సర్వేటివ్ ఇంగ్లిష్ ట్రేడ్‌యూనియన్లు అనేకం అంతర్జాతీయ కార్మికసంఘంతో ఉన్న సంబంధాలను ఏనాడో తెగతెంపులు చేసుకున్నప్పటికీ కూడా అవి తమ అధ్యకుడు క్రిందటి సంవత్సరం స్వాన్‌సీలో వాటి తరఫున చెప్పగల్గినట్టుగా "యూరప్‌లోని సోషలిజమంటే మనకు భయం పోయింది", అనే స్థానాభిముఖంగా క్రమక్రమంగా ముందుకు సాగిపోతున్నాయి. వాస్తవానికి "ప్రణాళిక"యొక్క సూత్రాలు అన్నిదేశాల కార్మికులోనూ గణనీయంగా పురోగమించాయి.

ఈవిధంగా "ప్రణాళికే" మళ్లీ ప్రజల ముందుకు వచ్చింది. 1850 తర్వాత జర్మన్ వాచకం స్విట్జర్‌లండ్, ఇంగ్లండు, అమెరికాలలో అనేకసార్లు పునర్ముద్రితమైంది. 1872లో ఇది న్యూయార్క్‌లో ఇంగ్లీషులోకి అనువదింపబడి ఆ అనువాదం "Woodhull and Claflin's Weekly" వారపత్రికలో ప్రచురింపబడింది. ఈ ఇంగ్లీషు భాషాంతరంనుండి న్యూయార్క్‌లోని "Le Socialiste" అను ఫ్రెంచి పత్రిక ఫ్రెంచి అనువాదం తయారుచేసి ప్రచురించింది. ఆతర్వాత కనీసం మరో రెండు ఇంగ్లీషు అనువాదాలు, మూలంలోని కొన్ని భాగాలు యించుమించుగా ఛిన్నాభిన్నమైపోయి, అమెరికాలో ప్రచురింపబడ్డాయి. వాటిలో ఒకటి ఇంగ్లండులో పునర్ముద్రించబడింది. బకూనిన్ అనువదించిన మొదటి రష్యన్ అనువాదం 1863 ప్రాంతంలో జినీవాలో గేర్‌త్సెన్ సంపాదకత్వంలో నడిచిన "కోలొకొల్" కార్యాలయంలో ప్రచురింపబడింది; వీరవనిత వేర జసూలిచ్* అనువదించిన రెండవ రష్యన్ అనువాదం కూడా జినీవాలోనే 1882లో ప్రచురింపబడింది. 1885లో కోపెన్‌హేవెన్‌లోని "Socialdemokratisk Bibliothek"**లో ఒక కొత్త డేనిష్ అనువాదం కనబడుతూంది; ఒక సరికొత్త ఫ్రెంచి అనువాదం 1885లో పారిస్‌లోని "Le Socialiste" అను

---

* కొన్నాళ్ల తర్వాత ఎంగెల్స్ 1894లో బెర్లిన్‌లోని "Internationales aus dem Volkss taat"1871–75లో అచ్చు అయిన "రష్యాలో సామాజిక సంబంధాలు" అన్న వ్యాసానికి తుదిపలుకులో, వాస్తవమైన అనువాదకుడు జి.వి. ప్లెహానొవ్ అని సరిగా పేర్కొన్నాడు.—సం

** సోత్సియాల్ డెమాక్రేటిస్క్ బిబ్లియొథెక్.—సం.

పత్రికలో ప్రచురించబడింది. ఆ తర్వాత యీ ఫ్రెంచి అనువాదం ఆధారంగా స్పానిష్ భాషాంతరం ఒకటి తయారుచేయబడి 1886లో మాడ్రిడ్‌లో ముద్రింపబడింది. జర్మన్ పునర్ముద్రణలను లెక్కించడానికే వీల్లేదు; అవి కనీసం పన్నెండైనా ఉంటాయి. కొద్ది నెలల క్రితం కాన్‌స్టాంటినోపుల్‌లో ప్రచురింపబడవలసివున్న అర్మేనియన్ అనువాదం బైటికి రాలేదు. అందుకు కారణం మార్క్స్ పేరుతో వున్న పుస్తకాన్నే ముద్రించడానికి ప్రచురణ కర్త భయపడినట్టూ, అనువాదకుడు ఆ అనువాదం తనదని అనిపించుకోవడానికి నిరాకరించినట్టూ నాకు చెప్పారు. ఇంకా అనేక యితర భాషలలో కూడా అనువాదాలు ప్రచురింపబడినట్టు విన్నానే గాని వాటిని నేను చూడలేదు. ఈ విధంగా "ప్రణాళిక" చరిత్ర చాలావరకు ఆధునిక కార్మికవర్గ వుద్యమ చరిత్రను ప్రతిబింబిస్తుంది; ఈనాడు యీ "ప్రణాళిక"నే సైబీరియానుండి కాలిఫోర్నియావరకూ లక్షలాది కార్మికులు తమ సమిష్టి వేదికగా అంగీకరించి, సోషలిస్టు సారస్వతమంతటిలోనూ ఇదే విస్తృతవ్యాప్తిగల అంతర్జాతీయ రచన అనడంలోనూ ఏమాత్రం సందేహం లేదు.

ఐనప్పటికీ మేం దానిని వ్రాసినప్పుడు "సోషలిస్టు" ప్రణాళిక అని పిలవడానికి మాకు వీలేలేకపోయింది. 1847లో సోషలిస్టులంటే, ఒకవైపున, ఇంగ్లండులోని ఓవెన్ అనుచరులూ ఫ్రాన్సులో ఫోరియర్ అనుచరులూ వీళ్ళంతా కూడా యీపాటికే కేవలం చిన్నచిన్న ముఠాలుగా క్షీణించిపోయివున్నట్టి అనేక ఊహాజనిత విధానాల అనుచరులనీ, మరోవైపున పెట్టుబడికిగానీ, లాభాలకుగానీ ఏవిధమైన అపాయమూ కలుగకుండా, అన్నిరకాల సామాజిక కష్టనిష్ఠురాలనూ ఏదోవిధంగా రకరకాల తాసికమాసికలువేసి మాయంచేస్తామనే బహుళాతిబహుళ రూపాలలోవున్న సామాజిక చిట్కావైద్యులు అనీ ఈ రెండు సందర్భాలలోనూ కార్మికవర్గ ఉద్యమానికి వెలుపలవుండి, తమను సమర్థించేందుకు చాలావరకు "విద్యావంతులైన" వర్గాలవారి సహాయంకోసమే చూస్తూనట్టి వారనీ అందరూ అర్థంచేసుకునేవారు. కేవలం రాజకీయవిప్లవాలు మాత్రమే చాలవని విశ్వసించి మొత్తం సామాజిక మార్పు అవసరమని చాటిచెప్పినట్టి కార్మికవర్గంలోని కొంతమంది ఆ రోజుల్లో కమ్యూనిస్టులమని చెప్పుకొనేవారు. మోటు అయినట్టీ, నునుపుచేయని రాతిబండ ఆకారంలో వున్నట్టీ స్వచ్ఛమైన సహజజ్ఞాన సంపన్నమైనట్టీ ఒక తరహా కమ్యూనిజం అది; ఐనా, అది ప్రధానమైన అంశాన్ని తడవి, కార్మికవర్గంలో ఫ్రాన్స్‌లో కాబెట్, జర్మనీలో వైట్లింగ్ యీ వూహాజనితమైన కమ్యూనిజంను పుట్టించగల్గేటంతటి శక్తి కలిగినదై ఉండగలిగింది. ఈవిధంగా 1847లో సోషలిజం ఒక మధ్యతరగతి ఉద్యమంగానూ, కమ్యూనిజం ఒక కార్మిక ఉద్యమంగానూ ఉంటూవచ్చింది. కనీసం యూరప్ భూభాగంలో యీ సోషలిజం

పూర్తిగా "మర్యాదచేయదగినది"గా పరిగణించబడేది; కాని కమ్యూనిజం కేవలం అందుకు పూర్తిగా విరుద్ధమైనదిగా పరిగణించబడేది. కాగా మేం మొట్టమొదటినుండీ "కార్మిక వర్గంయొక్క విముక్తి కార్మికవర్గయొక్క కృత్యమే అయి తీరాలి" అని విశ్వసించడంచేత, పై రెండు పేర్లలో ఏపేరును మేం గ్రహించాలో నిస్సందేహమే. అంతేకాకుండా పై పెచ్చు, ఆనాటినుండి నేటివరకూ ఎన్నడూ ఆ పేరును వదలుకుందామనే తలంపే మాకు కలగలేదు కూడా.

"ప్రణాళిక" మా ఇద్దరి సమిష్టి రచన అయినప్పటికీ, దానికి కేంద్రకంగా ఏర్పడుతూన్న మౌలికప్రమేయం మార్క్సుదని మాత్రం స్పష్టంచేయడం నా విధాయకమని నేను భావించుతున్నాను. ఆ ప్రమేయం ఏమిటంటే: చరిత్రయొక్క ప్రతి శకమందూ ఆ కాలంలోని ఆర్థిక ఉత్పత్తి, మారకపు రీతి, దీనినుండి ఆవశ్యకంగా ఉద్భవించిన సామాజిక అంగనిర్మాణమూ ఆ శకానికంతకూ ప్రాతిపదికగా ఉంటుంది; ఈ ప్రాతిపదికపైనే, కేవలం దానివల్ల మాత్రమే వివరించడానికి వీలైనట్టి ఆ శకంయొక్క రాజకీయ, మానసిక చరిత్ర ఆధారపడి వుంటుంది. తత్ఫలితంగా మానవ చరిత్ర అంతా (భూమిపై సమిష్టి యాజమాన్యాన్ని కలిగివుండిన ఆదిమ తెగనిర్మాణాన్ని కలిగిన సమాజం నిర్మూలమైపోయిన తర్వాతనుండీ) వర్గపోరాటాల చరిత్రే, పీడకవర్గాలకూ పీడితవర్గాలకూ మధ్య, పాలకవర్గాలకూ పాలితవర్గాలకూ మధ్య వుండే పోరాటాల చరిత్రే; ఈ వర్గపోరాటాలు మొట్టమొదటినుంచీ పరిణామాణాల పరంపరను సూచించుతూ యీనాడు ఏదశకు వచ్చిచేరుకున్నాయంటే దోపిడీ చేయబడిన వర్గం, అణచివేయబడిన వర్గం — అంటే శ్రామికవర్గం — దోపిడీచేసే వర్గం, పాలకవర్గంనుండి — అంటే బూర్జువావర్గంనుండి — విముక్తి పొందాలంటే మొత్తం సమాజం అంతటినీ మొత్తం దోపిడీనుంచీ, పీడననుంచీ వర్గ భేదాలనుండీ, వర్గపోరాటాలనుండీ ఇక ఇది కడపటి తడవుగా విముక్తి చేస్తేనేకాని తాను విముక్తి పొందలేదు.

డార్విన్ సిద్ధాంతం జీవశాస్త్రానికి ఎట్టి సేవచేసిందో అట్టి సేవనే చరిత్రకు విధిగా చేసితీరుతుందని నేను అభిప్రాయపడుతూన్న ఈ ప్రమేయానికి మేమిద్దరం 1845కు ముందు కొన్ని సంవత్సరాలుగా క్రమేణా దగ్గరపడుతూ వచ్చాం. దీనికి అభిముఖంగా నేను స్వతంత్రంగా ఎంతవరకు పురోగమించినదీ, నేను రాసిన "ఇంగ్లండులో కార్మికవర్గం స్థితి"*

* "The Condition of the Working Class in England in 1844" By Frederick Engels. Translated by Florence K. Wischnewetzky, New York, Lovell-London, W. Reeves, 1888. [ఎంగెల్స్ వివరణ.] ["1844లో ఇంగ్లండులో కార్మికవర్గం స్థితి," ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచన. ఫ్లారెన్స్ కె. విష్నెవెత్స్కీ, అనువాదం, న్యూయార్క్. లోవెల్—లండన్, డబ్ల్యు. రీవ్స్ 1888]

అన్న గ్రంథం స్పష్టంగా తెలియజేస్తుంది. 1845 వసంతంలో నేను మార్క్సును మళ్లీ బ్రస్సెల్స్‌లో కలుసుకున్నప్పుడు దీనినప్పటికే అభివృద్ధిపరచి సిద్ధంచేసుకొని నేను పైన ఎంత స్పష్టంగా పేర్కొన్నానో అంత స్పష్టంగానూ అతడు నా ముందు వుంచాడు.

1872లో జర్మన్ కూర్పుకు మేమిద్దరం కలసి రాసిన పీఠికనుండి కొంత భాగాన్ని ఈ దిగువ ఉల్లేఖిస్తున్నాను: —

"గత పాతిక సంవత్సరాలలో పరిస్థితులు ఎంత మారినప్పటికీ కూడా యీ ప్రణాళికలో సూచించిన మూలసూత్రాలు ఈనాటికీ కూడా మొత్తంమీద వాటి యథార్థతను నిలబెట్టుకున్నాయి. అక్కడక్కడా కొన్ని వివరాలను మాత్రం యింకా మెరుగు పరచవచ్చు ఈ మూలసూత్రాల ఆచరణ ఈ ప్రణాళికే పేర్కొనట్లు, సర్వత్రా సర్వకాలాలందూ ఉంటూన్నట్టి చారిత్రక పరిస్థితులపై ఆధారపడివుంటుంది. ఆ కారణంవల్లనే రెండవ అధ్యాయం అంత్యంలో ప్రతిపాదింపబడిన విప్లవ చర్యలను ప్రత్యేకంగా నొక్కిచెప్పడం లేదు. ఈనాడు అనేక విషయాలలో గ్రంథంలో ఆ భాగాన్ని వేరే మాటల్లో రాయవలసి వుంటుంది. 1848నుండీ ఆధునిక పరిశ్రమలు బ్రహ్మాండమైన అభివృద్ధిచెందడం దృష్ట్యానూ, దీని అనుగామి అయిన కార్మికవర్గం* యొక్క పార్టీ నిర్మాణం అభివృద్ధి చెంది విస్తరించడం దృష్ట్యానూ మొదట ఫిబ్రవరి విప్లవంలోనూ ఆతర్వాత మరింతగా శ్రామికవర్గం మొట్టమొదటి సారిగా రాజకీయ శక్తిని పూర్తిగా రెండు నెలలు చలాయించినట్టి పారిస్ కమ్యూన్‌లో ఆచరణ సిద్ధమైన అనుభవాన్ని గడించడం దృష్ట్యానూ, యీ ప్రణాళికలోని కొన్ని వివరాలు పాతబడి పోయాయి. పారిస్ కమ్యూన్ ముఖ్యంగా ఒక విషయాన్ని రుజువుపరచింది, అదేమిటంటే "శ్రామికవర్గం, తయారై సిద్ధంగా ఉన్న రాజ్యాంగయంత్రాంగాన్ని స్వాధీనంచేసుకొని తన సొంత ఉపయోగాలకై నడిపించజాలదు. ("The Civil War in France; Address of the General Council of International Working Men's Association", London, Truelove, 1871, p. 15 చూడండి**. అక్కడ యీ అంశం యింకా

---

* 1872లోని జర్మన్ కూర్పులో యీ వాక్యభాగాన్ని కొంచం భిన్నంగా వేరే మాటలలో చెప్పడం జరిగింది: చూ. ఈ కూర్పు పుట 8.—సం.

** K. Marx and F. Engels, *Selected Works*, Two-vol. ed., Vol. I. Moscow 1958, p. 473—సం. ["ఫ్రాన్సులోని అంతర్యుద్ధం" అనే గ్రంథం, అంతర్జాతీయ కార్మికసంస్థ జనరల్ కౌన్సిల్ సమావేశంలో యివ్వబడిన ఉపన్యాసం, లండన్, ట్రూలౌ, 1871 పుట 15.]

ఎక్కువగా విపులీకరించబడింది.) ఇంకాపైగా, యీ నాటికి సంబంధించినంతవరకూ యీ "ప్రణాళికలో" సోషలిస్టు సారస్వతంపై విమర్శన లోపాలతో కూడుకుని ఉన్నట్టు స్వతస్సిద్ధంగా వ్యక్తమౌతుంది. అందుకు కారణం ఏమంటే 1847కు ముందు ప్రచురింపబడిన సారస్వతానికి మాత్రమే ఆ విమర్శన అన్వయిస్తుంది. వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరిని వివరిస్తూ (అధ్యాయం IV) ఎత్తిచూపిన విశేషాలు సూత్రప్రాయంగా యీనాటి సరియైనవే అయినప్పటికీ ఆచరణరీత్యా అవి పాత పడిపోయాయి. ఎందువల్లనంటే నేడు రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాగా చరిత్ర పురోగమనం అందులో వరుసగా వివరించి చెప్పబడిన రాజకీయ పార్టీలలో అధికసంఖ్యను యీ భూప్రపంచంనుండి తుడిచి వేసింది.

"ఐనా యీ ప్రణాళిక ఒక చారిత్రక పత్రమైపోయింది. దానిని యిక మార్చడానికి మాకు ఏలాంటి హక్కూ లేదు."

ఈ ప్రస్తుత అనువాదం, మార్క్స్ రాసిన "పెట్టుబడి" గ్రంథంలోని అధిక భాగాన్ని అనువదించిన మిస్టర్ శామ్యూల్ మూర్ అనువాదం చేసినటువంటిది. దీనిని మేం యిద్దరం కలసి సరిచేశాం. చారిత్రక ఉదాహృతాలను విశదపరచే కొన్ని వివరణలను నేను చేర్చాను.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, 30వ జనవరి 1888

# 1890 జర్మన్ కూర్పుకు పీఠిక

పై పీఠిక* రాసిన తర్వాత "ప్రణాళిక"యొక్క కొత్త జర్మన్ కూర్పు మళ్ళీ అవసరమైంది, కాగా "ప్రణాళిక" విషయమై ఇక్కడ గ్రంథస్థం చేయవలసినట్టిది చాలా చరిత్ర జరిగింది.

రెండవ రష్యన్ అనువాదం — వేర జసూలిచ్ అనువాదం — 1882లో జినీవాలో వెలువడింది; దీనికి మార్క్సు నేనూ కలసి పీఠిక రాశాం. దురదృష్టవశాత్తూ దాని అసలు జర్మన్ వ్రాతప్రతి ఎక్కడో పోయింది. కాబట్టి నేను రష్యన్ అనువాదంనుండి మళ్ళీ అనువదింపవలసి వుంది. ఇందువల్ల మూలం** ఏమీ మెరుగుపడదు. అందులో యిలా ఉంది:

"బకూనిన్ అనువదించిన తొలి రష్యన్ "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"ను 1860 దశాబ్దిలో "కోలొకొల్" పత్రిక ముద్రణాలయం ప్రచురించింది. అప్పుడు పశ్చిమ దేశాల వారు ఆ గ్రంథాన్ని (అంటే "కమ్యూనిస్టు ప్రణాళిక" రష్యన్ కూర్పుని) ఒక సారస్వత సంబంధమైన విచిత్రంగా వీక్షించారు. అట్టి అభిప్రాయం యీనాడు అసంభవం.

"ఆనాటికి (డిసెంబరు 1847 నాటికి) యింకా శ్రామిక వర్గ ఉద్యమం ఎంత పరిమితమైన క్షేత్రాన్ని ఆక్రమించిందో యీ ప్రణాళిక ఆఖరి అధ్యాయం, అనగా వివిధ

---

* ఎంగెల్స్ 1883 జర్మన్ కూర్పుకు తాను రాసిన పీఠికను గురించి యిక్కడ చెబుతున్నాడు.—సం.

** పోయిందనుకున్నట్టి, "ప్రణాళిక" రష్యన్ కూర్పుకు మార్క్స్, ఎంగెల్స్ కలిసి రాసిన అసలు జర్మన్ పీఠిక వ్రాతప్రతి మళ్ళీ దొరికింది. దానిని మాస్కోలోని మార్క్సిజం-లెనినిజం ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రాచీన వస్తుభాండారంలో ఉంచారు. ఈ పీఠికయొక్క ప్రస్తుత యింగ్లీషు అనువాదం ఆ అసలు జర్మన్ పీఠికనుంచి అనువదించిందే.—సం.

దేశాలలోని వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల, కమ్యూనిస్టుల వైఖరిని గురించిన అధ్యాయం అత్యంత స్పష్టంగా తెలుపుతూంది. ఇక్కడ రష్యా, యునైటెడ్ స్టేట్సు అసలే అగపడవు. సరిగ్గా ఆ రోజుల్లోనే రష్యా, యూరోపియన్ దేశాలలోని అభివృద్ధినిరోధకం అంతటియొక్క బ్రహ్మాండమైన ఆఖరి రిజర్వు సైన్యంగా ఏర్పడింది. ఆ రోజుల్లోనే యునైటెడ్ స్టేట్సు యూరప్‌యొక్క అదనపు కార్మికు శక్తులను వలస రూపేణా తనలోకి ఇమిడ్చేసు కుంది. యీ రెండు దేశాలూ కూడా యూరప్‌కు ముడిసరుకులను అందించేవి; రెండు దేశాలూ కూడా యూరప్‌యొక్క పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకానికి మార్కెట్లుగా ఉండేవి. కాబట్టి ఆ రోజుల్లో యీ రెండు దేశాలూ ఈవిధంగానైతేనేమి ఆ విధంగానైతేనేమి, ఆ నాటి యూరోపియన్ వ్యవస్థకు మూలస్తంభాలుగా ఉండేవి.

"ఆ రోజులకీ యీ రోజులకీ ఎంతో భేదం వుంది! యూరప్‌నుండి వలసపోవడం వల్ల ఉత్తర అమెరికాకు బ్రహ్మాండమైన వ్యవసాయక ఉత్పత్తి శక్తి చేకూరింది. ఈ వ్యవసాయక ఉత్పత్తి పోటీ పెద్ద చిన్న తారతమ్యం లేకుండా యూరోపియన్ భూఆస్తినంతటినీ పునాదులతో సహా కదిపివేస్తోంది. దీనికి తోడు యునైటెడ్ స్టేట్సు తన బ్రహ్మాండమైన పారిశ్రామిక ఉత్పత్తి వనరులను, పశ్చిమ యూరపు పారిశ్రామిక గుత్తాధిపత్యాన్ని, ముఖ్యంగా నేటివరకూ వున్న ఇంగ్లండు గుత్తాధిపత్యాన్ని కొద్దికాలంలోనే బద్దలు చేసేటంతటి శక్తితోనూ, అంతటి స్థాయిలోనూ ఉపయోగించుకునేట్టు ఇది సమర్థతను కలుగజేసింది. ఈ రెండు పరిస్థితులూ విప్లవాత్మక పద్ధతిలో అమెరికాపైనే ప్రతిక్రియను సల్పుతాయి. మొత్తం రాజకీయనిర్మాణానికంతటికీ ప్రాతిపదిక అయిన చిన్న, మధ్యతరగతి రైతుల భూస్వామ్యం క్రమక్రమేణా బ్రహ్మాండమైన కమతాల పోటీకి నిలవలేక క్రుంగిపోతూవుంది; అదే సమయంలో పారిశ్రామిక ప్రాంతాలలో మొట్టమొదటిసారిగా ఒక అశేష ప్రజానీక శ్రామిక వర్గమూ, ఒక అపారమైన పెట్టుబడుల కేంద్రీకరణమూ అభివృద్ధి చెందుతూన్నాయి.

"ఇక రష్యా విషయం తీసుకుందాం! 1848–49 విప్లవంలో యూరోపియన్ రాజు లేకాకుండా యూరోపియన్ బూర్జువావర్గంవారు కూడా అప్పుడే మేల్కొంకొంటూన్న శ్రామిక వర్గంనుండి తప్పించుకోడానికి, ఒక రష్యా జోక్యం కలుగజేసుకోవడంలోనే తమకు మోక్షం దక్కుతుందని తెలుసుకున్నారు. జార్‌ప్రభువు యూరోపియన్ అభివృద్ధినిరోధకానికి నాయకుడని ప్రకటించారు. ఈనాడు అతడు గాత్చినలో విప్లవయుద్ధఖైదీ. యూరప్‌లోని విప్లవాత్మక కార్యాచరణకి రష్యా అగ్రగామిదళంగా ఏర్పడింది.

ఆధునిక బూర్జువావర్గపు ఆస్తి ముమ్ముందు తప్పనిసరిగా విచ్ఛిన్నమైతీరుతందని ప్రకటించడమే "కమ్యూనిస్టు ప్రణాళిక" తన లక్ష్యంగా పెట్టుకుంది. కాని రష్యాలో,

త్వరితగతిని అభివృద్ధి చెందుతోన్న పెట్టుబడిదారీ వంచనకూ, బూర్జువావర్గంయొక్క భూఆస్తికీ ముఖాముఖిగా మొత్తం భూమిలో సగంకంటే ఎక్కువ భాగం సమిష్టిగా రైతుల యాజమాన్యంకిందే వుండడం మనం చూస్తున్నాం. ఇప్పుడిక ఉద్భవించే ప్రశ్న ఏమిటంటే: రష్యన్ ఒబ్‌ష్చీన ఎంత అధికంగా క్షీణించిపోయినప్పటికీ కూడా భూమిపై సమిష్టి యాజమాన్యం అనే ఆదిమ రూపం అయిన రష్యన్ ఒబ్‌ష్చీన కమ్యూనిస్టు సమిష్టి యాజమాన్యం అనే ఉన్నత రూపంలోకి సరాసరి మారగలుగుతుందా? లేక అందుకు విరుద్ధంగా, పశ్చిమ దేశాలు ఏవిధానంలో చారిత్రక పరిణామాన్ని పొందాయో అట్టి విచ్ఛిన్నవిధానానికే ఇది కూడా మొదట లోనుగావలిసిందేనా?

"ఇందుకు యీనాడు ఇవ్వడానికి వీలైన సమాధానం ఒక్కటే: రెండూ ఒక దాని నొకటి పూర్తిచేస్తూ, రష్యన్ విప్లవం గనక పశ్చిమ దేశాలలోని శ్రామిక విప్లవానికి చిహ్నమైనట్లైతే యీనాడు రష్యాలో వున్న భూమిపై సమిష్టి యాజమాన్యత కమ్యూనిస్టు పరిణామానికి ఆరంభస్థానంగా ఉపయోగపడగలగుతుంది.

కారల్ మార్క్స్. ఎఫ్. ఎంగెల్స్

లండన్, జనవరి 21, 1882".

అదే తేదీన జినీవాలో ఒక కొత్త పోలిష్ కూర్పు వెలువడింది: "Manifest Komunistyczny."*

అంతేకాకుండా ఒక కొత్త డేనిష్ అనువాదం 1885లో కోపెన్‌హావెన్ పట్టణం లోని "Socialdemokratisk Bibliothek, Kjöbenhavn, 1885" అను పత్రికలో వెలువడింది. దురదృష్టవశాత్తూ ఆ ప్రచురణ అసంపూర్ణంగా ఉంది; అనువాదకునికి కష్టంగా అగుపడినట్టు తోచిన కొన్ని ప్రధానమైన భాగాలు వదలి వేయబడ్డాయి; దీనికితోడు అక్కడక్కడా కొంత అశ్రద్ధ చిహ్నాలు అగపడుతున్నాయి. ఎందువల్లనంటే అనువాదకుడు గనక యింక కాస్త కష్టపడి వున్నట్లైతే అతడు తన పనిని చక్కగా చేసి వుండే వాడు కాబట్టే ఇవి మరింత స్ఫుటంగానూ అసహ్యంగానూ ఉన్నాయి.

1885లో పారిస్‌లోని "Le Socialiste" పత్రికలో కొత్త ఫ్రెంచి భాషాంతరం వెలువడింది; ఇంతవరకు ఇదే అన్నిటికంటే ఉత్తమమైనది.

అదే సంవత్సరంలో పై ఫ్రెంచి అనువాదంనుండి స్పానిష్ అనువాదం మొదట

* మానిఫెస్ట్ కమ్యూనిస్టిచ్నీ (కమ్యూనిస్టు ప్రణాళిక). — సం.

మ్యాడ్రిడ్‌లోని "El Socialista"*లో ప్రచురింపబడి, ఆ తర్వాత "*Manifesto del Partido Comunista*" por Carlos Marx y F. Engels, Madrid, Administracion de "*El Socialista*", Hernan Cortés8 ,** అనే పేరుతో ఒక చిన్న పుస్తకం రూపంలో పునర్ముద్రింపబడింది.

1887లో కాన్‌స్టాంటినోపుల్‌లోని ఒక ప్రచురణకర్తకు అర్మేనియన్ అనువాదంను యివ్వ చూపగా ఆ మహనుభావునికి దానిని మార్క్స్ పేరుతో ముద్రించడానికి ధైర్యం చాలక గ్రంథకర్తగా అనువాదకుడు తన పేరే ఉపయోగించవచ్చునని అతనితో సూచించగా, అనువాదకుడు అందుకు అంగీకరించలేదన్న సంగతిని అబ్బురమైన విషయంగా నేనిక్కడ పేర్కొనవచ్చునేమో కూడా.

ఇంతో అంతో తప్పులతోనే ఉన్న అమెరికన్ అనువాదాలు ఇంగ్లండులో పదేపదే పునర్ముద్రింపబడిన తర్వాత చివరికి ప్రామాణికమైన భాషాంతరం ఒకటి 1888లో బయటికి వచ్చింది. దీనిని నా స్నేహితుడు శామ్యూల్ మూర్ అనువదించాడు. దీనిని ముద్రణాలయానికి యిచ్చేముందు మేమిద్దరం కలిసి మరొక సారి చూశాం. దీనికి యీ క్రింది విధంగా శీర్షిక వుంది: — "Manifesto of the Communist Party, by Karl Marx and Frederick Engels. Authorized English Translation, edited and annotated by Frederick Engels. 1888. London, William Reeves, 185 Fleet st. E.C."*** ఆ కూర్పులో రాసిన కొన్ని వివరణలను యీ కూర్పుకు చేర్చాను.

ఈ "ప్రణాళిక"కు ఒక సొంత చరిత్రే వుంది. అప్పట్లో శాస్త్రీయ సోషలిజంకు బహుకొద్ది సంఖ్యలో అగ్రగాములుగా వున్న వాళ్లందరిచే (మొదటి పీఠికలో పేర్కొన్న అనువాదాలు రుజువు పరిచినట్లు) ఈ "ప్రణాళిక" వెలువడడంతోటే దీనికి ఉత్సాహంతో అభివందనాలర్పించబడి, 1848 జూన్‌లో పారిస్ కార్మికులు ఓటమితో ప్రారంభమైన అభివృద్ధినిరోధకంవల్ల ఇది పూర్వరంగానికి నెట్టివేయబడి, చివరికి, 1852లో కొలోన్ కమ్యూనిస్టులపై నేరస్థాపనతో, యీ "ప్రణాళిక" "చట్టసమ్మతంగా" బహిష్కరింపబడింది. ఫ్రెబ

---

* ఎల్ సాస్పియలిస్టా. — సం.

** "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" కారల్ మార్క్స్, ఎఫ్. ఎంగెల్స్ విరచితము. మ్యాడ్రిడ్, 'ఎల్ సాస్పియలిస్టా' కార్యాలయం, హెర్నన్ కొర్టెస్ 8. — సం.

*** "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ విరచితము. ఫ్రెడరిక్ ఎంగెల్స్‌చే సవరించి సంక్షిప్త వ్యాఖ్యలు రాయబడిన ప్రామాణికమైన ఇంగ్లీషు అనువాదం. 1888 లండన్, విలియం రీవ్స్, 185 ఫ్లీట్ వీధి., ఇ.సి.". — సం.

వరి విప్లవంతో ప్రారంభమైన కార్మికోద్యమం ప్రజాజీవిత రంగంనుండి అదృశ్యమైపోవడంతో పాటే యీ "ప్రణాళిక" కూడా పూర్వరంగానికి వెళ్లిపోయింది.

పాలక వర్గాల శక్తిపై మరొక కొత్త దాడిచేసేందుకు యూరప్‌లోని కార్మికవర్గం మళ్లీ చాలినంత బలాన్ని ప్రోగుచేసుకోవడంతో "అంతర్జాతీయ కార్మికుల సంఘం" ప్రాదుర్భవించింది. యూరప్ అమెరికాలలోని సమరశీలమైన కార్మికవర్గాన్నంతటినీ ఒక బ్రహ్మాండమైన సైన్యంగా జ్వలనంచేసి ఐక్యపరచడమే దాని లక్ష్యం: అందువల్లనే "ప్రణాళిక"లో నిర్వచించిన సూత్రాలనుండి పురోగమించ లేకపోయింది. ఇంగ్లిష్ ట్రేడ్ యూనియన్లూ, ఫ్రాన్స్, బెల్జియం, ఇటలీ, స్పెయిన్ దేశాలలోని ప్రూడన్ అనుచరులూ, జర్మనీలోని లాసాల్* అనుచరులూ వీళ్లందరికీ ప్రవేశంవుండే కార్యక్రమం దీనికి విధిగా అవసరమైంది. ఈ కార్యక్రమాన్ని — ఇంటర్నేషనల్ నిబంధనల ప్రస్తావనను** — మార్క్స్ అందెవేసిన చేతితో ఆఖరికి బకూనిన్, తదితర అరాచక వాదులు సహితమూ అంగీకరించేట్టుగా, తయారు చేశాడు. "ప్రణాళిక"లో పేర్కొన్న భావాలయొక్క అంతిమ విజయం కోసమై, సమిష్టి కార్యాచరణ, పరస్పరచర్చలనుండే విధిగా సంభవించవలసినట్టి కార్మిక వర్గంయొక్క మేధాశక్తి అభివృద్ధిపైనే మార్క్స్ కేవలంగా, సంపూర్ణంగా ఆధారపడ్డాడు. పెట్టుబడికి వ్యతిరేకంగా కార్మికవర్గం జరిపే పోరాటంలో సంభవించే సంఘటనలూ, విపర్యయములూ, ముఖ్యంగా విజయాలకంటేనూ పరాజయాలూ, ఇంతవరకూ వారు సార్వజనిక సర్వరోగ నివారిణులకున్న అసమర్థతను సమరాన్ని సాగించేవారికి రుజువు చేసేటట్టు వారి ఎదుట ప్రదర్శించి, కార్మికుల విముక్తికై అవసరమగు యథార్థ పరిస్థితులను అర్థంచేసుకోవడానికి వారి మనస్సులను మరింత పరిపక్వమొనరించేటట్టు విధిగా చేసితీరాయి. మార్క్స్

---

* లాసాల్ వ్యక్తిగతంగా, తాను మార్క్స్ "శిష్యుడననీ," ఎల్లప్పుడూ మాతో చెప్పేవాడు; కాగా ఆ హేతువును "ప్రణాళిక" పక్షాన్నే అతడు సహజంగా అవలంబించుతూండేవాడు. కాని, అతని అనుచరుల కొందరి ప్రవర్తన మాత్రం అన్యంగా ఉండేది. వీరు ప్రభుత్వ రుణాలపై ఆధారపడే సహకార వర్క్‌షాపులను మించి వేరే ఏమీ కోరేవారు కారు. వీరు కార్మికులను ప్రభుత్వం ఇచ్చే అప్పులసహాయాన్ని సమర్థించేవారుగానూ, స్వయంసహాయాన్ని సమర్థించే వారుగాను విభజించారు. [ఎంగెల్స్ వివరణ.]

** See K. Marx, *The General Rules of the International Working Men's Association*. K.Marx and F.Engels, *Selected Works*, Two-vol. ed. Vol. I, Moscow 1958, pp. 386—387. — సం.

అనుకున్నదే నిజమైంది. 1864లో ఇంటర్నేషనల్ స్థాపింపబడినప్పటి కార్మికవర్గంకంటే 1874లో ఇంటర్నేషనల్ విచ్ఛిన్నమైనప్పటి కార్మికవర్గం పూర్తిగా భిన్నంగా ఉంది. లాటిన్ దేశాలలోని ప్రూడనిజం జర్మనీలో ప్రత్యేకమైన లాసాలియనిజం, యివి రెండూ నమసి పోతూన్న సమయంలో ఆఖరికి ఆనాటి అపరసనాతనపు ఇంగ్లిష్ ట్రేడ్ యూనియన్లు కూడా 1887లో స్వాన్‌సీ కాంగ్రెస్‌లో తమపేరట మాట్లాడుతూ తమ అధ్యక్షుడు చెప్పగలిగి నట్టు "యూరప్‌లోని సోషలిజం అంటే మనకు భయమేమీ లేదు" అని తమ అధ్యక్షుడు చెప్పిన అంశంవైపుకు క్రమక్రమేణా పురోగమించాయి. ఐనా 1887 కల్లా యూరప్ భూభా గంలోని సోషలిజం కేవలం "ప్రణాళిక"లో ప్రకటించిన సిద్ధాంతంగానే పరిణమించింది.

ఈవిధంగా "ప్రణాళిక" చరిత్ర చాలావరకు ఆధునిక కార్మికవర్గ వుద్యమ చరిత్రను ప్రతిబింబిస్తుంది; ఈనాడు ఈ "ప్రణాళికే" సైబీరియానుండి కాలిఫోర్నియావరకూ లక్ష లాది కార్మికులు తమ సమిష్టికార్యక్రమంగా అంగీకరించి, సోషలిస్టు సారస్వతమంతటిలోనూ విస్తృత వ్యాప్తిగల అంతర్జాతీయ రచన అనడంలోనూ ఏమాత్రం సందేహం లేదు.

ఐనప్పటికీ అది వెలువడినప్పుడు దానిని మేమొక సోషలిస్టు "ప్రణాళిక" అని పిలవ డానికి మాకు వీలు కలిగేదేకాదు. 1847లో సోషలిస్టులు రెండు రకాలుగా ఉండేవారు. ఒకవైపున ఇంగ్లండులోని ఓవెన్ అనుచరులూ, ఫ్రాన్సులోని ఫోరియర్ అనుచరులు, వీళ్లంతా కూడా యిపాటికే చిన్నచిన్న ముఠాలుగా క్షీణించిపోయి అంతరించిపోతున్నట్టి అనేక ఊహాజనిత విధానాలను అవలంబించేవారుగా వుండేవారు. మరోవైపున పెట్టుబడికీ లాభాలకూ లేశమూ హానికలుగకుండా, తమ సార్వజనిక సర్వరోగ నివారణులవల్లనూ, అన్ని రకాల అతుకుల బొంత తాసికమాసికలవల్లనూ సామాజిక దురాచారాలను తొలగించకోరే నానా రకాల సామాజిక చిట్కావైద్యులు వుండేవారు. ఈ రెండు సందర్భాలలోనూ యీ కార్మి కోద్యమానికి వెలుపల వుండి, తమను సమర్థించేందుకు "విద్యావంతులైన" వర్గాలవారి వంకే చూసే మనుష్యులు వీరు. కేవలం రాజకీయ విప్లవాలు మాత్రమే చాలవని నమ్మి, సమాజం ఆమూలాగ్రంగా మారాలని కోరే కార్మికవర్గంలోని ఒక భాగం ఆ రోజుల్లో కమ్యూ నిస్టునని చెప్పకొంటూండేది. అంతవరకూ బండగా కొట్టిన శిలవలెనే ఉంది. కేవలం సహజజ్ఞానసంపన్నమై, తరుచు మోటురకమైన కమ్యూనిజమది. ఐనా అది రెండు ఊహాజనిత కమ్యూనిజం విధానాలను ఉద్భవింపజేయగలిగిన శక్తిని కలిగివుంది — ఫ్రాన్స్‌లో కాబెట్‌యొక్క "ఇకేరియన్" కమ్యూనిజమూ, జర్మనీలో వైట్లింగ్‌యొక్క కమ్యూనిజమూ. 1847లో సోషలిజం బూర్జువా ఉద్యమాన్నీ, కమ్యూనిజం కార్మికవర్గ ఉద్యమాన్నీ తెలియ చేశాయి. కనీసం యూరప్ భూభాగంలో ఈ సోషలిజం "మర్యాదచేయదగినదిగా" పరిగ

ణించబడి ఉండగా, కమ్యూనిజం కేవలం అందుకు పూర్తిగా విరుద్ధమైనది. కాగా "కార్మికవర్గంయొక్క విముక్తి కార్మికవర్గంయొక్క కృత్యమే అయితీరాలి" అని మేము దృఢమైన అభిప్రాయాన్ని కలిగినవారమవడంచేత, ఈ రెండు పేర్లలో దేనిని ఎంచుకోవాలి అన్న విషయంలో మాకు ఎట్టి సంకోచమూ కలగలేదు. దానిని మార్చుకొనే ఉద్దేశం కూడా మాకెన్నడూ కలుగలేదు.

"ప్రపంచ కార్మికులారా, ఏకముకండి!" నలభై రెండు సంవత్సరాలక్రితం కార్మికులు తమ సొంత హక్కులనే కోరుతూ బహిరంగంగా జరిపిన మొదటి పారిస్ విప్లవం సందర్భంలో మేం యీ మాటలను ప్రకటించినప్పుడు కొంతమంది మాత్రమే మమ్మల్ని సమర్థించారు. ఐనప్పటికీ 1864 సెప్టెంబర్ 28వ తేదీన అనేక పశ్చిమ యూరప్‌దేశాలలోని శ్రామికులు దివ్యస్మృతిదాయకమైన "అంతర్జాతీయ కార్మికుల సంఘంలో" చేరి చేతులు కలిపారు. ఇంటర్నేషనల్ తొమ్మిది సంవత్సరాలు మాత్రమే జీవించిందన్న విషయం వాస్తవమే. ఐనా ఇది సృష్టించినట్టి అన్నిదేశాల శ్రామికుల శాశ్వత ఐక్యత యింకా సజీవంగానే వుంది. ఇది వరకటికంటే యింకా ఎక్కువ శక్తితో జీవిస్తుందనడానికి ఈనాడు దీనికంటే మరి గట్టినిదర్శనం అవసరంలేదు. ఎందువల్లనంటే యీనాడు, నేను యీ పంక్తులు రాస్తున్నప్పుడు, మొట్టమొదటి సారిగా ఒకే సైన్యంకింద ఒకే జెండాకింద ఒకే తక్షణ లక్ష్యంకొరకు "అంతర్జాతీయ కార్మికుల సంఘం" 1886లో తన జినీవా కాంగ్రెస్‌లో ప్రకటించినట్టి, 1889లో పారిస్ కార్మికుల కాంగ్రెస్ పునఃప్రకటించినట్టి ప్రామాణికమైన ఎనిమిది గంటల పని దినంకొరకు సమీకరింపబడిన తమ యుద్ధబలాలను యూరప్, అమెరికా శ్రామిక వర్గాలు సమీక్షించుకుంటున్నాయి: కాగా ఈనాటి దృశ్యం అన్నిదేశాలలోని పెట్టుబడిదారులకూ, భూస్వాములకూ కనువిప్పు కలిగించి అన్నిదేశాలకార్మికులూ నిజంగానే యీనాడు ఐక్యమయ్యారన్న వాస్తవాంశాన్ని వారి కళ్లముందు నిలబెట్టుతుంది.

ఈనాడు మార్క్స్ గనక సజీవియై నాతో కూడా దీనిని తన కళ్లారా వీక్షించినట్టయితే ఎంత బాగుండేదో కదా!

ఎఫ్. ఎంగెల్స్

లండన్, మే 1, 1890

# 1892 పోలిష్ కూర్పుకు పీఠిక*

పోలిష్ భాషలో "కమ్యూనిస్టు ప్రణాళిక"యొక్క ఒక కొత్త కూర్పు అవసరమైందన్న విషయం వివిధ ఆలోచనలకు తావిస్తూంది.

మొట్టమొదట యీ "ప్రణాళిక" యిటీవల యూరప్ భూభాగంలోని పెద్దస్థాయి పరిశ్రమాభివృద్ధికి కొలతసూచిగా ఏర్పడిందనడం గమనించదగ్గ విషయం. ఎదైనా ఒక దేశంలో పెద్దస్థాయి పరిశ్రమ అభివృద్ధిచెందిన నిష్పత్తిలో ఆ దేశంలోని కార్మికులకు కల వారి వర్గాలతో పోల్చిచూడగా కార్మికవర్గంగా తమ స్థితి గురించి స్పష్టంగా తెలుసుకునే వాంఛ ప్రబలుతుంది, వారిలో సోషలిస్టు ఉద్యమం విస్తరిల్లుతుంది, "ప్రణాళిక" కావాలనే కోర్కె హెచ్చుతుంది. ఈవిధంగా ప్రతి దేశంలోనూ ఆ దేశభాషలో ప్రచురితమైన "ప్రణాళిక" ప్రతుల సంఖ్య, ఆ దేశంలోని కార్మికోద్యమ స్థితినే కాకుండా అక్కడి పెద్దస్థాయి పరిశ్రమలు అభివృద్ధి చెందిన అంతస్తును ఇంచుమించు యథార్థంగానే తెలియజేస్తుంది.

ఆ ప్రకారంగా, పోలిష్ భాషలోని కొత్త కూర్పు పోలిష్ పరిశ్రమలో నిష్కర్షయైన అభివృద్ధిని సూచిస్తూంది. కాగా పది సంవత్సరాల క్రితం ప్రచురింపబడిన వెనకటి కూర్పు అనంతరం వచ్చిన అభివృద్ధి వాస్తవంగా జరిగిందనడంలో ఏమ్మాత్రం సందేహం లేదు. రష్యన్ పోలెండు, కాంగ్రెస్ పోలెండు,** రష్యన్ సామ్రాజ్యంలోకల్లా పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారైంది. కాగా రష్యన్ పెద్దస్థాయి పరిశ్రమలు ఒక్కటొక్కటిగా అక్కడక్కడా చెదరి ఉన్నాయి — ఒక భాగం ఫిన్‌లాండ్ సింధుశాఖ చుట్టూ, మరొకటి కేంద్రంలోనూ (మాస్కో, వ్లదీమిర్‌లలో), మూడవ భాగం నల్ల సముద్రం అజోవ్ సముద్రం తీరాల్లోనూ, ఇంకా కొన్ని

---

*ఇక్కడ పొందుపరుస్తూన్న పోలిషె కూర్పుకు రాసిన పీఠిక జర్మన్ మాతృకనుండి అనువదింపబడింది.— సం.

** 1814–1815లో జరిగిన వియన్నా కాంగ్రెస్ నిర్ణయాల ప్రకారం ఏర్పడిన పోలెండు భాగానికి ఇది వర్తిస్తూంది. — సం.

యితర ప్రదేశాలలోనూ ఉంటూండగా, పోలిష్ పరిశ్రమ సాపేక్షంగా చిన్న ప్రదేశంలో క్రిక్కిరిసి వుండి, ఆవిధంగా అట్టి కేంద్రీకరణవల్ల లాభ నష్టాలు రెండింటినీ కూడా అనుభవిస్తూంది. పోలిష్ ప్రజలను రష్యన్లక్రింద మార్చాలని తామెంత వాంఛించినప్పటికీ కూడా, పోటీ చేస్తోన్న రష్యన్ ఫ్యాక్టరీ సరుకుల ఉత్పత్తిదారులు పోలెండ్‌కు వ్యతిరేకంగా రక్షణ సుంకాలను కోరినప్పుడు పోలిష్ పరిశ్రమ లాభాలను అనుభవిస్తూన్నట్లు అంగీకరించారు. నష్టాలు — పోలిష్ ఉత్పత్తిదారులకూ రష్యన్ ప్రభుత్వానికీ కలిగే నష్టాలు — పోలిష్ కార్మికులలో సోషలిస్టు భావాలు త్వరితగతిని వ్యాపిస్తూండడంలోనూ, "ప్రణాళిక" కావాలనే కోరిక ప్రబలుతూండడంలోనూ ప్రత్యక్షమౌతున్నాయి.

రష్యన్ పరిశ్రమను మించిపోతూ త్వరత్వరగా అభివృద్ధిచెందుతోన్న పోలిష్ పరిశ్రమ దానివంతుకది పోలిష్ ప్రజలయొక్క అక్షయజీవశక్తికి ఒక నూతన నిదర్శనమూ రానున్న జాతీయ పునఃస్థాపనకు ఒక కొత్త హామీ. కాగా బలీయమైన స్వతంత్ర పోలెండ్ పునఃస్థాపనమనేది ఒక్క పోలిష్ ప్రజలకేకాకుండా మనకందరికీ సంబంధించిన విషయం. యూరోపియన్ జాతులలో ప్రతి ఒక్క జాతీ తన సొంత యింట్లో సంపూర్ణంగా స్వపరిపాలనను కలిగి వున్నప్పుడు మాత్రమే ఈ యూరోపియన్ జాతుల మధ్య హృదయపూర్వకమైన అంతర్జాతీయ పరస్పర సహాయం సాధ్యమౌతుంది. ఎంతైనప్పటికీ శ్రామికవర్గ పతాకంకింద జరిగిన 1848 నాటి విప్లవం, బూర్జువా వర్గం పనిని శ్రామికవర్గ యోధులచే చేయించి, తన మరణశాసన రీత్యా తన ఆస్తికి ధర్మకర్తలైన లూయీ బోనపార్ట్, బిస్మార్కులద్వారా ఇటలీ, జర్మనీ, హంగరీ దేశాలకు స్వాతంత్ర్యం కూడా సంపాదించి పెట్టింది; కాని 1792 నుండీ విప్లవంకొరకు యీ మూడు దేశాలకంటే ఎక్కువ పాటుపడిన పోలెండ్, 1863లో తనకంటే పదిరెట్లు ఎక్కువ శక్తిగల రష్యాకు లొంగిపోయినప్పుడు తన స్వశక్తిపైనే ఆధారపడవలసి వచ్చింది. ప్రభువర్గంవారు పోలిష్ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోనూ లేకపోయారు, స్వాతంత్ర్యాన్ని మళ్లీ సంపాదించుకోనూ లేకపోయారు; ఈనాడు ఎంత తక్కువచేసి చెప్పినప్పటికీ బూర్జువా వర్గం యీ స్వాతంత్ర్యం విషయమై ఏమీ పట్టించుకోనే పట్టించుకోవడం లేదు. ఐనప్పటికీ యూరోపియన్ జాతులన్నీ ఐకమత్యంతో పరస్పరసహాయానికి ఇది ఎంతైనా అవసరం. అది యీ యువపోలిష్ శ్రామికవర్గం వల్లనే సంపాదించడానికి సాధ్యమౌతుంది. కాగా ఈ శ్రామికవర్గం చేతుల్లో ఇది భద్రంగా ఉంటుంది. ఎందుచేతంటే పోలిష్ కార్మికులకి తమ దేశానికి స్వాతంత్ర్యం ఎంత అవసరమో మిగతా యావత్ యూరప్ దేశాలలోని కార్మికులకీ పోలెండ్ స్వాతంత్ర్యం అంత అవసరమే.

ఎఫ్. ఎంగెల్స్

లండన్, ఫిబ్రవరి 10, 1892

# 1893 ఇటాలియన్ కూర్పుకు పీఠిక

## ఇటాలియన్ పాఠకునికి

కేంద్రంలోవున్న రెండు జాతుల విప్లవాలు, చీలికలవల్లా, అంతర్గత సంఘర్షణ వల్లా ఈవిధంగా పరరాజ్యాధీనమైన రెండు జాతులు కూడా దుర్బలమైపోయి — ఒకటి యూరప్ భూభాగం నడిబొడ్డున రెండవది మిడిటరేనియన్‌తీరాన — ఏరోజునైతే సాయుధ విప్లవాలు బెర్లిన్‌లోనూ, మిలాన్‌లోనూ తలయెత్తాయో ఆ 1848 మార్చి 18వ తేదీన "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" అచ్చు అయిందని చెప్పవచ్చు. ఇటలీ దేశం ఆస్ట్రియా చక్రవర్తి పరిపాలన కిందికి వెళ్లిపోగా, జర్మనీ దేశం సర్వరష్యనుల చక్రవర్తి అయిన జార్‌యొక్క, మరింత పరోక్షంగానే అయినప్పటికీ అంతకంటె ఏమాత్రమూ తక్కువ భరింప శక్యముకానట్టి, కాడిని మోయాల్సి వచ్చింది. 1848 మార్చి 18వ తేదీన జరిగిన విప్లవాల ఫలితాలు ఇటలీ జర్మనీ దేశాలను యీ అవమానాన్నుండి విముక్తిచేశాయి. 1848 నుండీ 1871 వరకు యీ రెండు బృహత్తర జాతులూ పునర్నితములై తమ కాళ్లమీద తాము నిలబడి గలిగినట్టు చేయబడినవంటే, అందుకు కారణం, కారల్ మార్క్స్ అన్నట్టు, 1848 విప్లవాన్ని అణచివేసిన వ్యక్తులే, ఏమైతేనేమి, వాళ్లకు ఇష్టంలేకపోయినప్పటికీ, దాని మరణశాసనానుసారం దాని ఆస్తికి ధర్మకర్తలవడమే.

ప్రతిచోటా కూడా ఆ విప్లవం కార్మికవర్గంయొక్క కృషివల్లనే జరిగింది. కాట్రగడలను నిర్మించి తన ప్రాణాధారమైన రక్తాన్ని ధారబోసినది యీ వర్గమే. ప్రభుత్వాన్ని పడగొట్టుతున్నామూ అంటే బూర్జువావర్గ పాలనను పడగొట్టుతున్నామనే నిర్దిష్టమైన అభిప్రాయంకేవలం పారిస్ కార్మికులకు మాత్రమే వుంది. తమ సొంత వర్గానికీ, బూర్జువా వర్గానికీ మధ్య ప్రాణాంతకమైన వైషమ్యం వున్న సంగతి ఎరిగి వున్నప్పటికీ కూడా దేశం యొక్క ఆర్థిక పురోగమనంగానీ ఫ్రెంచి కార్మికులలో అశేష ప్రజానీకంయొక్క వైజ్ఞానికాభివృద్ధిగానీ సాంఘిక పునర్నిర్మాణాన్ని సాధ్యం చేయగల దశకు యింకా రాలేదు, కాబట్టి తుది పరిశీలనలో విప్లవంయొక్క సత్ఫలితాలను పెట్టుబడిదారీ వర్గమే అనుభవించింది. ఇతర

దేశాలలో, ఇటలీ, జర్మనీ, ఆస్ట్రియా దేశాలలో, కార్మికులు మొదటనుండీ కూడా బూర్జువా వర్గాన్ని అధికారంలోకి తేవడంతప్ప వేరే ఏమీ చేయలేదు. కాని ఏదేశంలోనైనా సరే జాతీయ స్వాతంత్ర్యం లేకుండా బూర్జువా పాలన అసంభవం. కాబట్టి 1848 విప్లవానికి ఆ రోజువరకూ లోపించి వున్న జాతులయొక్క, ఇటలీ, జర్మనీ, హంగరీలయొక్క ఐక్యతనూ, స్వపరిపాలననూ తనవెంట తీసుకు రాక తప్పింది కాదు. పోలెండ్ కూడా యీ దేశాల వెంట వుంటుంది.

ఈవిధంగా 1848 విప్లవం సోషలిస్టు విప్లవం కానప్పటికీ కూడా అది సోషలిస్టు విప్లవానికి దారి ఏర్పరచింది. మార్గాన్ని సుకరంచేసింది. అన్నిదేశాలలోనూ పెద్దస్థాయి పరిశ్రమలను త్వరితగతిని నెలకొల్పడంద్వారా బూర్జువా హాయాం గత నలభైఅయిదు సంవత్సరాలకాలంలోనూ ప్రతిచోటా కూడా అసంఖ్యాకమైనట్టీ, కేంద్రీకృతమైనట్టీ, శక్తివంతమైనట్టీ శ్రామికవర్గాన్ని సృష్టించింది. ఈవిధంగా బూర్జువా హాయాం, "ప్రణాళిక" భాషలో చెప్పాలంటే, తనను పాతిపెట్టే వాళ్ల సంఖ్యను తానే కనిపెంచిందన్నమాట. ప్రతి జాతికీ స్వపరిపాలననూ, ఐక్యతనూ పునఃస్థాపితం చేయకుండా శ్రామికవర్గంయొక్క అంతర్జాతీయ ఐక్యతనూ సమాన లక్ష్యాల అభిముఖ్యంగా యీ జాతుల మధ్య శాంతియుతమైన, వివేకవంతమైన సహకారాన్నీ సాధించడం అసంభవం. లక్ష్యాల అభిముఖంగా 1848కి ముందున్న రాజకీయ పరిస్థితులలో ఇటాలియన్, హంగేరియన్, జర్మన్, పోలిష్, రష్యన్ కార్మికుల అంతర్జాతీయ కార్యాచరణను ఒకసారి ఊహించండి!

కాబట్టి 1848లో పోరాడిన యుద్ధాలు వృధాకాలేదు. ఆ విప్లవశకానికీ మనకూ ఉన్న నలభైఅయిదు సంవత్సరాలూ వృధాగా గడచిపోలేదు. వాటి ఫలాలు పరిపక్వమౌతున్నాయి. మాతృకయొక్క ప్రచురణ ఏవిధంగా అంతర్జాతీయ విప్లవానికి శుభశకునమైందో ఆవిధంగానే యీ ఇటాలియన్ అనువాదం కూడా ఇటాలియన్ శ్రామికవర్గంయొక్క విజయానికి శుభశకునంకాగలదనే నేను అభిలషిస్తున్నాను.

గతంలో పెట్టుబడిదారీ విధానం వహించిన విప్లవకర పాత్రకు యీ "ప్రణాళిక" పూర్తిగా న్యాయంచేసింది. మొట్టమొదటి పెట్టుబడిదారీ దేశం ఇటలీ. ఫ్యూడల్ మధ్యయుగాల అంత్యం, ఆధునిక పెట్టుబడిదారీ యుగం ఆరంభం యీ రెండు కాలాలకీ బ్రహ్మాండమైన చిహ్నంగా ఒక ఇటాలియన్ వ్యక్తి వెలిశాడు. అతడే డాంటే. మధ్యయుగాలకు ఆఖరికవీ, ఆధునిక కాలానికి తొలి కవీ అతడే. ఈనాడు, 1300 సంవత్సరంలో వలెనే, ఒక కొత్త చారిత్రక యుగం ఆసన్నమౌతోంది. యీ నూతనశ్రామిక యుగోదయముహూర్తానికి వుండే చిహ్నంగా ఒక కొత్త డాంటేను ఇటలీ మనికిస్తుందా?

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, ఫిబ్రవరి 1, 1893

# Manifest

der

# Kommunistischen Partei.

Veröffentlicht im Februar 1848.

Proletarier aller Länder vereinigt euch.

**London.**

Gedruckt in der Office der „Bildungs-Gesellschaft für Arbeiter"
von J. E. Burghard
46, Liverpool Street, Bishopsgate

కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక మొదటి కూర్పుపైపటం.

యూరప్ ఖండాన్ని ఒక పిశాచం — కమ్యూనిజం అనే పిశాచం — ఆవహించింది. ఈ పిశాచాన్ని వదలగొట్టేందుకని పాత యూరప్‌లోని శక్తులన్నీ — పోప్ మఠాధిపతీ జార్ చక్రవర్తీ, మెటర్నిఖ్ గిజోలూ, ఫ్రెంచి రాడికల్సూ జర్మన్ పోలీసు గూఢచార్లూ — కలిసి ఒక పవిత్ర మిత్రకూటముగా ఏర్పడ్డాయి.

ప్రభుత్వాధికారంలో ఉన్న తన శత్రువులచే కమ్యూనిస్టు భావాలు కలిగిన పార్టీ అని దూషింపబడకుండా ఉన్న ప్రతిపక్ష పార్టీ ఎక్కడుంది? తనకంటె ఎక్కువగా పురోగమించిన ప్రతిపక్ష పార్టీలపైనేగాకుండా, తన అభివృద్ధి నిరోధక ప్రత్యర్థులపైన సహితమూ కమ్యూనిస్టు అని తనపై మోపబడిన దూషణనే తిరిగి విసరికొట్టని ప్రతిపక్షపు పార్టీ ఎక్కడుంది?

ఈ వాస్తవాంశాలనుండి రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి:

I. యూరప్‌లోని శక్తులన్నీ కమ్యూనిజాన్ని ఒక శక్తిగా యిదివరకే గుర్తించాయి.

II. కమ్యూనిస్టులు తమ దృక్పథాలను, ఆశయాలను, తమ ధోరణులను యావత్ ప్రపంచం యెదుట బహిరంగంగా ప్రచురించి, కమ్యూనిస్టు పిశాచమనే కట్టుకథను తమ పార్టీయొక్క ప్రణాళికతోనే ఎదుర్కొనడం ఎంతైనా అవసరం.

ఈ లక్ష్యంతో వివిధ జాతులకు చెందిన కమ్యూనిస్టులు లండన్‌లో సమావేశమై ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, ఫ్లెమిష్, డేనిష్ భాషలలో ప్రచురించడానికై ఈ క్రింది ప్రణాళికను స్థూలంగా రూపొందించారు.

# I. బూర్జువాలు, శ్రామికులు*

ఇంతవరకూ మనుతూన్న సమాజం**యొక్క చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర అనే చెప్పాలి.

---

* బూర్జువాజీ అంటే సామాజిక ఉత్పత్తి సాధనాలకు సొంతదార్లు అయి, కూలి శ్రమను నియమించి పనిచేయించుకొనే, ఆధునిక పెట్టుబడిదారుల వర్గం అని అర్థం. శ్రామిక వర్గం అంటే సొంత ఉత్పత్తి సాధనాలులేని కారణాన బ్రతుకు తెరువు కోసమని తమ శ్రమశక్తిని అమ్ముకొనే స్థితికి దిగజారిపోయినట్టి ఆధునిక శ్రామికులవర్గం అని అర్థం. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ.]

** అంటే దీనర్థం లిఖితపూర్వకమైన చరిత్ర అంతా అన్నమాట. సమాజంయొక్క పూర్వచరిత్ర గురించిగానీ, లిఖితపూర్వకంగా వున్న చరిత్ర పూర్వముండిన సామాజిక నిర్మాణం గురించిగానీ 1847 నాటికి ఇంచుమించు తెలియేతెలియదన్నమాటే. రష్యాలో భూమి సమిష్టియాజమాన్యంకింద వుండేదని హక్స్టహౌసెన్ ఆవిష్కరించాడు. చరిత్రలో ఆరంభమైన ట్యూటానిక్ జాతులన్నిటి ఉద్భవానికీ ఇదే సామాజిక పునాదిగా ఏర్పడిందని మౌరర్ రుజువు చేశాడు; ఇండియానుండి ఐర్లెండ్‌వరకు ప్రతిచోటా కూడా గ్రామ సంఘాలు ఆదిమ సమాజ రూపంగా ఉంటూండేవని, లేదా ఉంటూన్నట్టుగా అగపడిందని, క్రమక్రమంగా తెలిసింది. జెన్స్‌గణంయొక్క యథార్థ స్వభావాన్నీ, యీ జెన్స్‌కూ ఆదిమ తెగకూ వున్న సంబంధాన్నీ మోర్గన్ తలమానికంగా ఆవిష్కరించడంతో సజాతీయ రూపంలో, యీ ఆదిమ కమ్యూనిస్టు విధానపు సమాజంయొక్క అంతర్ వ్యవస్థ తేటతెల్లమై పోయింది. ఈ ఆదిమ సంఘాలు విచ్ఛిన్నంకావడంతో సమాజం మొదట వేర్వేరుగానూ, చివరికి పరస్పరశత్రువులుగానూ విభిన్నములైనట్టి వర్గాలుగా మారడం ఆరంభించింది.

స్వతంత్రుడూ బానిసా, కులీనుడూ సామాన్యుడూ, ప్రభువూ భూదాసుడూ (serf), శ్రేణిపౌరుడూ* చేతిపనివాడూ, ఒక ముక్కలో చెప్పాలంటే పీడకుడూ పీడితుడూ నిరంతరం ఒకరికొకరు ప్రత్యర్థిగా నిలబడి, ఎడతెగకుండా ఒకప్పుడు ప్రచ్ఛన్నంగానూ మరొకప్పుడు బహిరంగంగానూ, ప్రతిసారీ కూడా మొత్తం సమాజంయొక్క విప్లవకరమైన పునర్నిర్మాణంతోనో లేదా, యీ కలహవర్గాల సమిష్టి నాశనంతోనో పరిసమాప్తమొందే పోరాటాన్ని సాగిస్తూవచ్చారు.

చరిత్ర ఆరంభపు శకాలలో ఇంచుమించు సర్వత్రా కూడా సమాజం భిన్నభిన్న అంతస్తులతో, సాంఘిక హోదాలో అనేక స్థాయిలుగల క్లిష్టమైన ఏర్పాటును కలిగి ఉండేది. పూర్వకాలపు రోమ్‌లో కులీనులూ, యోధులు, సామాన్యులు, బానిసలు, ఉండేవారు; మధ్యయుగాలలో ఫ్యూడల్ ప్రభువులు, సామంతులు, శ్రేణిపౌరులు, చేతిపనివారు, ఉమేజువారీలు, భూదాసులు ఉండేవారు; ఇంచుమించు యీ అన్నివర్గాలలోనూ మళ్లీ కింది అంతస్తులు ఉండేవి.

ఫ్యూడల్ సమాజపు శిథిలాలనుండి మొలకెత్తిన ఆధునిక బూర్జువా సమాజం వర్గ వైషమ్యాలని అంతమొందించలేదు. పైగా పాత వాటి స్థానే కొత్త వర్గాలనీ, కొత్త హింస పరిస్థితులను పోరాటంయొక్క కొత్త రూపులనూ స్థాపించింది.

ఐనప్పటికీ మన శకానికి, అంటే మన బూర్జువా శకానికి యీ కింది విశిష్ట లక్షణం వుంది: అది వర్గవైషమ్యాలను సరళంచేసింది. మొత్తం సమాజం రెండు మహత్తరశత్రు శిబిరాలుగా, సూటిగా ఒకదాని అభిముఖంగా మరొకటి నిలిచివున్న రెండు గొప్ప వర్గాలుగా అంతకంతకు మరింతగా చీలిపోతూవుంది. ఆ వర్గాలే బూర్జువావర్గం, శ్రామికవర్గం.

మధ్యయుగాలలోని భూదాసులనుండి పూర్వం కొత్తగా ఏర్పడ్డ నగరాల్లోని శాసన రక్షితపౌరులు ఉద్భవించారు. ఈ నగర పౌరులనుండే బూర్జువావర్గపు తొలి అంశాలు అభివృద్ధిపొందాయి.

---

ఈ విచ్ఛిత్తి విధానాన్ని తిరిగి చూపడానికి యీకింది గ్రంథంలో ప్రయత్నించాను: "Der Ursprung der Familie, des Privateigentums und des Staats", 2. Aufl., Stuttgart 1886. ("కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాంగయంత్రం పుట్టు పూర్వోత్తరాలు," రెండవ కూర్పు, స్టుట్‌గార్ట్ 1886.) [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.][4]

* శ్రేణిపౌరుడు అంటే శ్రేణిలో సంపూర్ణ సభ్యుడు. శ్రేణిలో పనితెలిసినవాడే, యజమాని మాత్రం కాదు. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

అమెరికాను కనిపెట్టడంతోనూ, ఆఫ్రికాఖండం దక్షిణ అగ్రాన్ని చుట్టి రావడం తోనూ బూర్జువావర్గం వర్ధిల్లడానికి కొత్తకొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. ఈస్ట్ ఇండియా చైనా దేశాలలోని మార్కెట్లు, అమెరికాకి వలస వెళ్లడం, వలసదేశాలతో వర్తకం, మార్పిడి సాధనాలూ సాధారణంగా సరకులూ అధికంకావడం, యివన్నీ కూడా వాణిజ్యానికీ, నౌకా యానానికీ, పరిశ్రమకీ యిదివరకెన్నడూ ఎరుగనంతటి ప్రేరేపణనూ, తద్వారా కూలిపోవ డానికి సిద్ధంగా ఊగుతూ తూగుతూ వున్న ఫ్యూడల్ సమాజంలోని విప్లవాంశానికీ త్వరితగతిని అభివృద్ధి కలుగజేశాయి.

దేనికిందైతే పారిశ్రామికోత్పత్తిపై సభ్యులకే పరిమితంచేయబడిన శ్రేణులకు గుత్తాధి పత్యం లభించిందో అట్టి పారిశ్రామిక ఫ్యూడల్ విధానం నానాటికీ పెరిగిపోతోన్న కొత్త మార్కెట్ల అవసరాలను తీర్చడానికి యిక ఏమాత్రం చాలలేదు. దాని స్థానాన్ని కార్ఖానా ఉత్పత్తి విధానం తీసుకుంది. కార్ఖానాల స్వంతదారులైన మధ్యతరగతి శ్రేణిసభ్యులను ఒక పక్కకు నెట్టివేసింది. ప్రతి ఒక్క కార్ఖానాలోని శ్రమ విభజన ఎదుట అదివరకు వేర్వేరు శాసనరక్షిత సంఘాలుగా ఏర్పడ్డ శ్రేణులమధ్య ఏర్పడిన శ్రమ విభజన అంతర్ధానమైపోయింది.

ఈలోగా మార్కెట్లు నిత్యం పెరిగిపోతూ గిరాకీ నిత్యం పెరిగిపోతూ వచ్చింది. కార్ఖానాల ఉత్పత్తి కూడా యిక చాలలేదు. అందువల్ల ఆవిరి, యంత్రాలు పారిశ్రామిక ఉత్పత్తి విధానంలో విప్లవాన్ని తెచ్చాయి. కార్ఖానా ఉత్పత్తి విధానం స్థానాన్ని బ్రహ్మాండ మైన ఆధునిక యంత్ర పరిశ్రమ ఆక్రమించుకుంది. పారిశ్రామిక మధ్య తరగతి స్థానంలో పారిశ్రామిక అక్షౌహిణుల నాయకులూ, పారిశ్రామిక కోటీశ్వరులూ అయిన ఆధునిక బూర్జువా వర్గంవారు ప్రవేశించారు.

ఆధునిక పరిశ్రమ ప్రపంచ మార్కెట్టును స్థాపించింది. అమెరికాను కనిపెట్ట డంతో దీనికి దారిసుగమమైంది. ఈ ప్రపంచ మార్కెట్టు వాణిజ్యంకు, నౌకాయా నంకు, భూమార్గపు రాకపోకలకు అపారమైన అభివృద్ధిని కలుగచేసింది. ఈ అభివృద్ధివల్ల పరిశ్రమలు విస్తరిల్లాయి. ఈ పరిశ్రమల విస్తరణ నిష్పత్తిలో వాణిజ్యం నౌకాయానం రైల్వేలు విస్తరిల్లి, అదే నిష్పత్తిలో బూర్జువావర్గం కూడా అభివృద్ధిచెంది, తన పెట్టు బడిని అధికం చేసుకుని, మధ్యయుగాలనుండీ వంశపారంపర్యంగా వస్తూన్న ప్రతి వర్గమూ పూర్వరంగానికి నెట్టి వేయబడింది.

కాబట్టి స్వయంగా ఆధునిక బూర్జువావర్గమే దీర్ఘ కాలాభివృద్ధియొక్క, ఉత్పత్తి, మారకపు విధానాలలో వచ్చిన విప్లవ పరంపరయొక్క ఫలితమని మనకు తెలుస్తోంది.

బూర్జువావర్గపు అభివృద్ధి క్రమంలో ప్రతి అడుగుకూ, అందుకు సరైన ఆ వర్గం యొక్క రాజకీయ పురోగమనం అనుగామి అయింది. ఫ్యూడల్ ప్రభువంశంచే అణగదొక్కబడి ఆ వంశం పాలనకింద వున్న వర్గం, మధ్యయుగపు కమ్యూన్‌లలో* ఏర్పడిన, సాయుధమైన, స్వపరిపాలనాధికారంగల సంఘం; ఒక చోట స్వతంత్ర నగర రిపబ్లిక్కుగానూ (ఇటలీ జర్మనీ దేశాలలోవలె), మరొక చోట పన్నులు చెల్లించే రాచరిక వ్యవస్థయొక్క "మూడవ ఎస్టేటు" గానూ (ఫ్రాన్సులోవలె), ఆతర్వాత అచ్చంగా కార్ఖానాల కాలంలో ప్రభువంశీకులకు వ్యతిరేకంగా అర్ధ ఫ్యూడల్ రాచరికానికీ లేదా నిరంకుశ రాచరికానికీ ప్రతిభారంగా ఉపయోగపడి, వాస్తవానికి గొప్పగొప్ప రాచరికపు ప్రభుత్వాలకు మూలస్తంభంగా వుంటూ వచ్చినట్టి యీ బూర్జువావర్గం చివరికి ఆధునిక పరిశ్రమా ప్రపంచ మార్కెట్టూ ఏర్పడినప్పటినుండీ, ఆధునిక ప్రాతినిధ్యపు రాజ్యాంగయంత్రంలో ఇతరులను మినహాయించి తానొక్కదానికే ప్రత్యేకంగా ఉండేటట్టి రాజకీయ పరిపాలనను గెలుచుకుంది. మొత్తం బూర్జువావర్గంయొక్క ఉమ్మడి వ్యవహారాలను చక్కబెట్టేందుకు ఒక సమితే ఆధునిక రాజ్యాంగయంత్రం యొక్క కార్యనిర్వాహకవర్గం.

చారిత్రకంగా బూర్జువావర్గం అత్యంత విప్లవకరమైన పాత్రనే నిర్వహించింది.

ఎక్కడెక్కడైతే బూర్జువావర్గందే పైచేయి అయిందో ఆయా చోట్ల అది ఫ్యూడల్, పితృస్వామిక, గ్రామీణవ్యవస్థ సంబంధాలను అంతమొందించింది. మానవుణ్ణి తన "స్వభావ సిద్ధమైన అధికుల"కు బంధించివేసిన నానారకాల ఫ్యూడల్ బంధాలను యీ బూర్జువా వర్గం నిర్దాక్షిణ్యంగా ఛేదించివేసి, మనిషికీ మనిషికీ మధ్య, కేవలం నగ్నంగా అగుపించే స్వార్థంనూ నీచమైన "నగదు చెల్లింపు"నీ తప్ప వేరే ఏవిధమైన సంబంధాన్నీ మిగల్చలేదు.

---

* ఫ్రాన్సులో ఆరంభదశలో వున్న నగరాలు స్థానిక స్వపరిపాలన, "మూడవ ఎస్టేటు" అని అనిపించుకుని రాజకీయ హక్కులను తమ ఫ్యూడల్ ప్రభువులనుండీ యజమాన్లనుండీ గెలుచుకోక పూర్వమే అవి "కమ్యూన్"లనే పేరును పెట్టుకున్నాయి. సాధారణంగా చెప్పాలంటే బూర్జువావర్గంయొక్క ఆర్థికాభివృద్ధికి వర్గ ఉదాహరణగా ఇంగ్లండు దేశాన్నీ, రాజకీయ అభివృద్ధికి ఫ్రాన్సు దేశాన్నీ ఇక్కడ పేర్కొనడం జరిగింది. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

ఇటలీ, ఫ్రాన్సుదేశాలలోని నగరవాసులు స్వపరిపాలనాధికారపు ప్రారంభ హక్కులని తమ ఫ్యూడల్ ప్రభువులనుండి కొన్నతర్వాతనే, లేదా పోరాడి గుంజుకున్న తర్వాతనే తమ నగర సంఘాలను యీ పేరుతో వ్యవహరించేవారు. [1890 జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

ఈ బూర్జువావర్గం స్వర్గసంబంధమైన మతైక పరవశతనూ, ఔదార్య సాహసోపేత మైన ఉత్సాహాన్నీ, సంస్కృతి రహితమైన భావోద్రేకతా బలహీనతనూ అహంభావ సహితమైన డబ్బులెక్కకట్టడమనే మంచునీటిలో ముంచివేసింది. వ్యక్తిగతమైన విలు వను మారకపు విలువగా మార్చివేసి, నష్టపరచ వీలులేని శాసన పూర్వకంగా స్థాపితములైన అసంఖ్యాకములైన స్వేచ్ఛల స్థానే ఒకేఒక అంతఃకరణరహితమైన స్వేచ్ఛను — స్వేచ్ఛా వ్యాపారాన్ని నెలకొల్పింది. ఒక్క మాటలో చెప్పాలంటే మత, రాజకీయ భ్రమలనే ముసు గుతో కప్పిన దోపిడీ స్థానే నగ్నమైన, సిగ్గుశరాలు లేని, ప్రత్యక్షమైన, అమానుషమైన దోపిడీని ప్రత్యామ్నాయంగా వుంచింది.

ఇంతవరకు గౌరవనీయంగానూ భక్తి పూర్వకమైన భయంతోనూ పరిగణించిన ప్రతి వృత్తి పరివేషమునూ యీ బూర్జువావర్గం పీకిపారేసింది. వైద్యుడినీ, న్యాయవాదినీ, మతగురువునీ, కవినీ, శాస్త్రవేత్తనీ డబ్బుతీసుకొని తనకి ఊడిగంచేసే కిరాయి కూలీలుగా మార్చివేసింది.

బూర్జువావర్గం కుటుంబంనుండి దాని రాగబంధురమైన ముసుగును చింపిపార వేసి, కుటుంబ సంబంధాన్ని కేవలం డబ్బుతో కూడిన సంబంధంకిందకి దిగజార్చేసింది.

అభివృద్ధి నిరోధకులు అధికంగా ప్రశంసించిన మధ్య యుగాలనాటి పశుబల ప్రద ర్శనం, విపరీతంగా బద్ధకం బలసిపోయిన సోమరితనంతో ఎలా పూర్తిచెందిందో బూర్జువా వర్గం బయటపెట్టింది. ఈ వర్గం మానవుని కార్యశీలత ఏలాంటి పనులను సాధించగలదో మొట్టమొదటి సారిగా తెలియచేసింది. ఈజిప్టు పిరమిడ్లు, రోమన్ కాలవలు, గాథిక్ దేవా లయాలూ వీటన్నిటినీ ఎంతో అధిగమించిపోయిన అద్భుతాలను సాధించింది; పూర్వకాలం లోని జాతుల బహుజన ప్రస్థానాలనూ మత యుద్ధాలనూ మరపించే మహా యాత్రలను నడి పించింది.

బూర్జువావర్గం నిత్యం ఉత్పత్తి సాధనాలలోనూ, తద్వారా ఉత్పత్తి సంబంధాల లోనూ, వీటితోపాటు మొత్తం సామాజిక సంబంధాలలోనూ విప్లవకరమైన మార్పులు తేనిదే జీవించలేదు. ఇందుకు భిన్నంగా పాత ఉత్పత్తి విధానాలలో ఏవిధమైన మార్పులు లేకుండా వాటిని రక్షించుకోవడమే పూర్వపు పారిశ్రామిక వర్గాల ఉనికికి మొదటి షరతై ఉండేది. ఉత్పత్తి విధానాలలో నిరంతరమూ విప్లవం తేవడం, సమస్త సామాజిక స్థితులను ఎడతెగ కుండా కలతపెట్టడం, నిత్యమైన అనిశ్చితత్వం, ఆందోళనలు కలిగివుండడమే బూర్జువా శకాన్ని అంతకు ముందుండిన అన్ని శకాలనుండీ ప్రత్యేకించుతున్నాయి. గడ్డకట్టుకుని, తుప్పుపట్టిపోయిన సంబంధాలు వాటి పరివారమైన, సనాతనమైన, పూజ్యనీయంగా ఎంచ

బడే దురభిమానాలతోపాటు తుడుచుపెట్టుకు పోతాయి; కొత్తగా ఏర్పడిన సంబంధాలన్నీ గట్టిపడక ముందే పాత పడిపోతాయి, ఘనీభవించిన ప్రతిదీ కరిగి గాలిలో బాష్పమైపోతుంది, పావనమైన ప్రతిదీ అపవిత్రమైపోతుంది, ఇక మానవుడు చివరికి తన వాస్తవిక జీవిత స్థితులనూ తోటి మానవులతో తనకున్న సంబంధాలనూ స్థిర బుద్ధితో ఎదుర్కొనక తప్పింది కాదు.

తాను తయారుచేసే సరుకులకు నిర్విరామంగా విస్తరిల్లే మార్కెట్టుయొక్క అవసరం బూర్జువావర్గాన్ని మొత్తం ప్రపంచం నలుమూలలకూ తరుముతుంది. ప్రతిచోటా గూళ్ళు కట్టుకొని, ప్రతిచోటా స్థిరనివాసాలు ఏర్పరచుకొని, ప్రతి దేశంతోనూ సంబంధాలు స్థిరపరచుకొని తీరితేగాని దానికి వీల్లేదు.

బూర్జువావర్గం ప్రపంచ మార్కెట్టును దోపిడీచేయడం ద్వారా ప్రతి దేశంలోని ఉత్పత్తికీ వినిమయానికీ జాతిభేదరహిత స్వభావాన్నొసగింది. అభివృద్ధి నిరోధకులకు కోపం కలిగేటట్టు పరిశ్రమ స్థిరంగా నెలకొన్న చోట దాని అడుగున వున్న జాతీయ పునాదుల్ని ఇది పెకలించి వేసింది: పూర్వం స్థాపించబడిన జాతీయ పరిశ్రమలన్నీ నాశనం కావించబడ్డాయి, లేదా ప్రతిరోజూ నాశనం కాబడుతూనే వున్నాయి. వాటి స్థానాన్ని కొత్త పరిశ్రమలు ఆక్రమిస్తున్నాయి; ఈ పరిశ్రమలు దేశీయమైన ముడి పదార్థాలతో సరుకులను ఉత్పత్తి చేయడం యిక మానివేసి, ఎక్కడో మారుమూలల్లో వున్న ప్రదేశాలనుండి ముడి పదార్థాలను తెప్పించుకొని వస్తువులను ఉత్పత్తి చేయడంవల్ల వీటి ప్రవేశం నాగరిక జాతులన్నిటికీ జీవన్మరణ సమస్యగా ఏర్పడింది; ఈ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకులను స్వదేశంలోనే కాకుండా ప్రపంచం నాలుగు మూలలందూ వినియోగమౌతున్నాయి. స్వదేశంలో ఉత్పత్తి అవుతోన్న సరుకులతోనే సంతృప్తి చెందే పాత అవసరాల స్థానే దూరదేశాలలోనూ వివిధ శీతోష్ణ స్థితులలోనూ ఉత్పత్తి అయ్యే సరుకులు అవసరమయ్యే కొత్త అవసరాలు మనకు అగపడుతున్నాయి. పూర్వపు స్థానిక జాతీయ ఏకాంత జీవితం, స్వయం పోషకత్వం స్థానే నాలుగువైపులా అన్యోన్య సంసర్గమూ, జాతుల సార్వజనీన పరస్పరాధారమూ ఎదురౌతోంది. భౌతిక ఉత్పత్తి పరిస్థితే వైజ్ఞానిక ఉత్పత్తిలో కూడా ఏర్పడింది. వ్యక్తిగత దేశాలయొక్క వైజ్ఞానికోత్పన్నములు ప్రపంచంయొక్క ఉమ్మడి ఆస్తికింద మారిపోతున్నాయి. జాతీయ పక్షపాతం, జాతీయ సంకుచితత్వం అంతకంతకు మరీ అసంభవమైపోతున్నాయి, అసంఖ్యాక జాతీయ, స్థానిక సాహిత్యాలనుండి విశ్వసాహిత్యం ఆవిర్భవిస్తోంది.

ఉత్పత్తి సాధనాలన్నీ త్వరితగతిని అభివృద్ధి కావడం ద్వారానూ, అపారమైన సౌకర్యాలను కలిగించుతూన్న రవాణా విధానాలద్వారానూ జాతులన్నిటినీ, ఆఖరికి అన్నిటికంటెనూ అత్యంతమైన అనాగరికమైన జాతులను సహితమూ, బూర్జువావర్గం నాగరికతవైపుకు

లాక్కు పోతోంది. ఇది ఉత్పత్తి చేసే సరకుల చౌక ధరలు చైనా గోడలన్నిటినీ నేలకూల్చ గలిగే భారమైన ఫిరంగుల వంటివి, వీటిని ఉపయోగించే పరదేశీయులయెడల అనాగరికులకు ఉండే విపరీతమైన మొండి ద్వేషాన్ని కూడా దాసోహమనేటట్టు చేస్తాయి. బూర్జువావిధాన ఉత్పత్తిని అనుసరించని యెడల జాతి అంతరించిపోవడమనే శిక్ష తమకు తప్పదనే భయాన్ని కలిగించి యితర జాతులన్నీ బూర్జువా ఉత్పత్తి విధానాన్నే తప్పనిసరిగా అనుసరించేట్టు ఇది బలవంతపెడుతుంది. జాతులన్నీ కూడా తమ మధ్య నాగరికతను ప్రవేశపెట్టేట్టు, అంటే స్వయంగా బూర్జువాలుగా తయారయ్యేట్టు బలవంతపెడుతుంది. ఒక్క మాటలో చెప్పా లంటే తన ప్రతిబింబాన్ని పోలిన ప్రపంచాన్నే అది సృష్టిస్తుంది.

పట్టణాల పాలనకింద పల్లెలు వుండేట్టు చేసింది బూర్జువావర్గం. బ్రహ్మాండమైన పట్టణాలని సృష్టించింది, గ్రామీణ జనాభాతో సరిపోల్చిచూస్తే పట్టణ జనాభాను ఎంతో అధికంగా వృద్ధిచేసింది, కాగా ఈవిధంగా జనాభాలోని గణనీయమైన భాగాన్ని గ్రామీణ జీవితంయొక్క మూఢత్వంనుండి కాపాడింది. పల్లెలు పట్టణాలపై ఏవిధంగా ఆధారపడేట్టు చేసిందో ఆవిధంగానే అనాగరిక, అర్ధ-అనాగరిక దేశాలను నాగరిక దేశాలపైనా, కర్షక జాతు లను బూర్జువా జాతులపైనా, ప్రాచ్యం పశ్చిమంపైనా ఆధారపడేట్టు చేసింది.

అంతకంతకు మరింతగా జనాభా, ఉత్పత్తి సాధనాలూ, ఆస్తీ చెల్లా చెదరుగా వుండే స్థితిని బూర్జువా వర్గం తొలగించివేస్తూంది. జనాభాను ఒక దగ్గరికి చేర్చింది; ఉత్పత్తి సాధా నాలను సాంద్రీకృతమొనర్చింది; ఆస్తిని కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించింది. దీని ఆవశ్యక మైన ఫలితం ఏమిటంటే రాజకీయ కేంద్రీకరణ ఏర్పడడమే. వేర్వేరు ప్రయోజనాలు, చట్టాలు, ప్రభుత్వాలూ పన్నుల విధానాలూగల స్వతంత్ర రాష్ట్రాలు, లేదా పరస్పరంగా అంత గట్టి సంబంధాలులేని రాష్ట్రాలు ఒకే ప్రభుత్వం, ఒకే శాసనస్మృతి, ఒకే జాతీయ వర్గప్రయోజనం, ఒకే సరిహద్దు, ఒకే సుంకాల పద్ధతి కలిగిన ఒకే జాతిగా కలగాపులంగా కలిపివేయబడ్డాయి.

ఇంకా నూరేళ్లైనా పూర్తిగానిండని తన పరిపాలనలోనే బూర్జువావర్గం అంతకు పూర్వ ముండిన తరాలన్నీ కలసి సృష్టించిన ఉత్పత్తి శక్తులకంటే ఎంతో బృహత్తర మైన, ఎంతో బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తులను సృష్టించింది. మానవునికి ప్రకృతి శక్తులు బానిసకావడం, యంత్రాలనూ, రసాయనిక శాస్త్రాన్నీ పరిశ్రమలకూ వ్యవసాయా నికీ వినియుక్తం చేయడం, నౌకాయానం, ఆవిరి శక్తి రైళ్ళు, విద్యుత్ తంతివార్తలు, మొత్తం భూఖండాలలోని అడవులను నరకి భూమిని సాగుకిందకు తేవడం, నౌకాయానానికై నదులకు కాల్వలు తవ్వడం, నేల ఈనినట్టుగా జనాభాలకు జనాభాలనే మంత్రించి సృష్టిం

చడం — యిలాంటి ఉత్పత్తి శక్తులు సామాజిక శ్రమ ఒడిలో కునుకు తీస్తున్నాయని ఏ గత శతాబ్ది అయినా సరే ఏ మాత్రం లీలగానైనా ముందుగా అనుకోగలిగిందా?

దీనినిబట్టి మనకు ఏం తెలుస్తుందంటే, ఏ ఉత్పత్తి, మారకపు సాధనాల పునాదులపై బూర్జువావర్గం తనను తాను నిర్మించుకుందో ఆ సాధనాలు ఫ్యూడల్ సమాజంలోనే ఉద్భవించబడ్డాయి. ఈ ఉత్పత్తి, మారకపు సాధనాల అభివృద్ధిలోని ఒకానొక నిర్దిష్ట దశలో, ఏ పరిస్థితుల కిందైతే ఫ్యూడల్ సమాజం వస్తూత్పత్తి చేసి మార్పిడి సాగించిందో ఆ పరిస్థితులు, ఫ్యూడల్ వ్యవసాయ కార్ఖానా పరిశ్రమ, ఒక్క మాటలో చెప్పాలంటే ఫ్యూడల్ ఆస్తి సంబంధాలకు, అప్పటికే అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులతో ఇకమీదట యేమాత్రమూ పొత్తుపొసగిందికాదు. అవన్నీ సంకెళ్ళుగా తయారయ్యాయి. ఈ సంకెళ్లను బద్దలు కొట్ట వలసి వచ్చింది, వాటిని బద్దలుకొట్టడమూ జరిగింది.

వాటి స్థానంలో స్వేచ్ఛాయుతమైన పోటీ, దానికి అనుగుణమైన సామాజిక, రాజకీయ రాజ్యాంగనిర్మాణమూ, బూర్జువావర్గంయొక్క ఆర్థిక రాజకీయ పరిపాలనా అనుగాములుగా కలిగి అడుగుపెట్టింది.

ఇలాంటి చలనమే యీనాడు అచ్చు మనకళ్ల ముందే జరుగుతోంది. తన సొంత ఉత్పత్తి, సొంత మార్పిడి, సొంత ఆస్తి సంబంధాలు కలిగిన ఆధునిక బూర్జువా సమాజం, అలాంటి బ్రహ్మాండమైన ఉత్పత్తి, మారకపు సాధనాలను తన మంత్రబలంచే సృష్టించినట్టి సమాజం, అధోలోక శక్తులను తన మంత్రోచ్చాటనతో పైకి రప్పించి తానిక అదుపులోకి తేలేకపోయినట్టి ఐంద్రజాలకునివలె ఉంది. అనేక దశాబ్దాలుగా జరిగిపోయిన పరిశ్రమ, వాణిజ్యాల చరిత్ర ఆధునిక ఉత్పత్తి పరిస్థితులకు ప్రతికూలంగానూ, బూర్జువావర్గంయొక్క, దాని పరిపాలనయొక్క అస్థిత్వానికి అవసర పరిస్థితులైనట్టి ఆస్తి సంబంధాలకు ప్రతికూలంగానూ జరిగిన ఆధునిక ఉత్పాదక శక్తుల విప్లవ చరిత్రే తప్ప మరొకటేమీ కాదు. కొంతకాలానికొకసారి విడవకుండా వస్తూ, వచ్చిన ప్రతిసారీ మొత్తం బూర్జువావర్గం అస్తిత్వానికే మరింత భీతావహంగా ప్రమాదం కలిగిస్తూన్నట్టి వాణిజ్య సంక్షోభాలను పేర్కొంటేనేచాలు. ఈ సంక్షోభాలలో అప్పటికే తయారై వున్న వస్తువులలోని అధిక భాగమే కాకుండా అంతకు పూర్వం సృష్టి అయిన ఉత్పాదక శక్తులలోని అధిక భాగం కూడా కొంతకాలానికొకసారి నాశనం చేయబడుతూంటుంది. ఈ సంక్షోభాలలో అంతకు పూర్వపు యీగాలలో అసంగతంగా అగుపించివుండిన మహామారి — అధికోత్పత్తి అనే మహామారి ఆకస్మికంగా పుట్టుకొస్తుంది. ఈ సంక్షోభాలు కలిగినప్పడల్లా తాను క్షణమాత్రపుకాలం అనాగరిక దశలోకి అకస్మాత్తుగా వెనక్కినెట్టి వేయబడినట్టు సమాజానికే అనిపిస్తుంది; క్షామంగానీ,

సర్వవినాశకరమైన ప్రపంచవ్యాప్త యుద్ధంగానీ వచ్చి, జీవితావసరమైన ప్రతి వస్తువు సరఫరాను ఛేదించివేసినట్లగుపిస్తుంది; పరిశ్రమా, వాణిజ్యమూ నాశనమైపోయినట్లగుపిస్తుంది; కాగా కారణం? కారణం, నాగరికత విపరీతంగా పెరిగిపోవడమే, జీవనోపాధిసాధనాలు అపరిమితంగా ఉండడమే, పరిశ్రమ మరీ ఎక్కువగా ఉండడమే, వాణిజ్యం మరీ అధికంగా అభివృద్ధి కావడమే. సమాజం అధీనంలో వున్న ఉత్పాదక శక్తులు బూర్జువా ఆస్తి పరిస్థితులను యిక పెంపొందచేసే స్థితిలో లేవు; అందుకు వ్యతిరేకంగా, వాటిని బంధించుతూన్న పరిస్థితులకంటె ఆ ఉత్పాదక శక్తులే మరీ శక్తివంతంగా తయారై, అవి యీ బంధనాలను తెంచుకున్న వెనువెంటనే మొత్తం బూర్జువా సమాజంలో అరాచకాన్ని ప్రవేశపెట్టి, బూర్జువా ఆస్తి ఉనికికే ముప్పుతెస్తాయి. బూర్జువా సమాజం పరిస్థితులు ఎంత యిరుకుగా ఉన్నాయంటే ఆ సమాజం సృష్టించిన సంపదంతా వాటిలో యిమడ వీలులేకుండా ఉంది. బూర్జువావర్గం యీ సంక్షోభాలనుండి ఏవిధంగా బయట పడుతుంది? ఇటు ఉత్పాదక శక్తులలో కొంతరాశిని బలవంతాన నాశనం చేయిస్తుంది. అటు కొత్త మార్కెట్లను జయించి, పాతవాటిని మరింత క్షుణ్ణంగా దోపిడీ చేస్తుంది. దీనర్థం ఏమిటంటే మరీ విస్తృతమూ, మరీ వినాశకరమూ అయిన సంక్షోభాలు సంభవించడానికే మార్గాన్ని సుగమం చేసి, సంక్షోభాన్ని నిరోధించే మార్గాలను తగ్గించివేస్తుంది.

బూర్జువావర్గం ఏ ఆయుధాలతో ఫ్యూడలిజంను నేలకూల్చిందో ఆ ఆయుధాలే యిప్పుడు బూర్జువావర్గానికి ఎదురుతిరిగాయి.

కాని బూర్జువావర్గం తనచావు తెచ్చుకొనే ఆయుధాలను తానే తయారుచేయడమే కాకుండా, ఆ ఆయుధాలను ఉపయోగించే మనుషులను, — ఆధునిక కార్మిక వర్గాన్ని — శ్రామికులని పుట్టించింది.

బూర్జువావర్గం, అంటే పెట్టుబడి, ఏ నిష్పత్తిలో అభివృద్ధి చెందుతుందో అదే నిష్పత్తిలో శ్రామికవర్గం అనగా ఆధునిక కార్మిక వర్గం అభివృద్ధి చెందింది. పని దొరికినంత కాలం మాత్రమే జీవించేటట్టీ, వారి శ్రమ పెట్టుబడిని వృద్ధిచేయునంత కాలం వరకు మాత్రమే వారికి పనిదొరికేటట్టీ, తమకు తాము వేరువేరుగా, వాణిజ్యంలోని ప్రతి యితర వస్తువువలె అమ్ముడు పోయే వర్తకపు సరకులాంటి వారే యీ శ్రామికులు; కాబట్టి యీ శ్రామికులు పోటీలలోని మార్పులన్నిటికీ, మార్కెట్టులోని హెచ్చుతగ్గులన్నిటికీ గురికావలసినవారవుతున్నారు.

యంత్రాలను విస్తారంగా ఉపయోగించడం వల్లనూ, శ్రమ విభజనవల్లనూ శ్రామికులు చేసే పనిలో వ్యక్తిత్వపు స్వభావమంతా అంతరించిపోయింది; తత్ఫలితంగా పనివానికి

తన పనియెడల వుండే మోజంతా నశించిపోయింది. అతడు యంత్రంయొక్క అనుబంధంగా మాత్రమే తయారై, అత్యంత సరళమైనట్టీ, అతివిసుగు పుట్టించే, అత్యంత సుళువుగా అలవరచుకోగలిగిన నేర్పును మాత్రమే అతడు చూపవలసివస్తోంది. కాబట్టి పనివాని ఉత్పత్తి ఖర్చు, తనను తాను పోషించుకొనేందుకై తనకు అవసరమయే జీవనోపాధి సాధనాలకూ, తన వంశాన్ని వృద్ధి చేసుకునేందుకూ వలసిన ఖర్చుకే దాదాపు పూర్తిగా కుదించి వుంటుంది. కాని సరకు ఖరీదు దాని ఉత్పత్తి ఖర్చుకు సమానం. కాబట్టి శ్రమ ఖరీదు[6] కూడా పనివాని ఉత్పత్తి ఖర్చుకు సమానం. కాబట్టి పనిమీద అసహ్యత ఎంత ఎక్కువైతే కూలి కూడా అదే నిష్పత్తిలో అంత తగ్గిపోతుంది. ఇంతే కాదు పైపెచ్చు యంత్రాల ఉపయోగం, పని విభజన ఎంత ఎక్కువగా ఉంటే పనిగంటలను పొడిగించడంవల్లనైతేనేమి, నియమిత కాలంలో గుంజే పనిని ఎక్కువ చేయడంవల్లనైతేనేమి, లేదా యంత్రాల వేగాన్ని హెచ్చించడం, వగైరాలవల్లనైతేనేమి కార్మికుని శ్రమభారం కూడా అదేనిష్పత్తిలో ఎక్కువౌతుంది.

ఆధునిక పరిశ్రమ పితృస్వామిక యజమాని చిన్న కార్ఖానాని పారిశ్రామిక పెట్టుబడిదారుని బ్రహ్మాండమైన ఫ్యాక్టరీగా మార్చివేసింది. ఫ్యాక్టరీలలో కుప్పతిప్పలుగా క్రుక్కబడిన కార్మికులను సైనికులలాగున నిర్మాణయుతంగా సంఘటిత పరుపబడుతున్నారు. పారిశ్రామిక సైన్యంలోని సామాన్యసైనికులైన వీరు పరిపూర్ణాను భవంగల సార్జెంట్ల ఆఫీసర్లయొక్క పరిణతిచెందిన ఆచార్యాధిపత్య స్వాధీనంలో ఉంచబడుతున్నారు. వీరు బూర్జువా వర్గానికే కాకుండా బూర్జువా రాజ్యాంగయంత్రానికే బానిసలు, అంతేకాకుండా వీరు ప్రతి రోజూ, ప్రతిగంటా యంత్రంవల్లనూ, తమపైన అజమాయిషీ చేసే మేస్త్రీ వల్లనూ అందరి కంటే ఎక్కువగా అసలు వ్యక్తిగత బూర్జువా ఫ్యాక్టరీ యజమానివల్లనూ బానిసలుగా చేయబడ్డారు. లాభమే తన జీవితాశాయ లక్ష్యమని ఈ నిరంకుశత్వం ఎంత బహిరంగంగా ప్రకటించుకుంటూంటే అది అంత నీచమైందిగానూ అంత అసహ్యమైందిగానూ, అంత దుఃఖభాజనంగానూ పరిణమించుతూంది.

శరీర శ్రమలో నిపుణత్వం, బలం ఎంత తక్కువగా అవసరమౌతే, వేరేమాటల్లో చెప్పాలంటే, ఆధునిక పరిశ్రమలు ఎంత ఎక్కువగా వృద్ధిచెందితే మగకార్మికుల శ్రమస్థానాన్ని స్త్రీకార్మికుల శ్రమ అంత ఎక్కువగా ఆక్రమించుకుంటుంది. వయసు, ఆడమగ తేడాలకుండే విశిష్ట సామాజిక విలువ కార్మిక వర్గానికి ఇకమీద రద్దు అయిపోతుంది. వాళ్లంతా కూడా వయసునుబట్టీ స్త్రీ పురుష భేదాన్నిబట్టీ ఉపయోగంలో హెచ్చు విలువ తక్కువ విలువ గలిగిన శ్రమ పరికరాలే.

ఫ్యాక్టరీ యజమానిచే కార్మికుని దోపిడీ ఏ రోజుకారోజు పూర్తి అయిపోయి కార్మికునికి నగదురూపేణా కూలీ ముట్టుతుందో ఆ వెనువెంటనే బూర్జువావర్గంలో ఇతర భాగాలైన ఇంటి యజమాని, దుకాణదారు, తాకట్టు బాకీదారుడూ మొదలైన యితరులు ఆ కార్మికుని ఎదుర్కొంటారు.

మధ్యతరగతిలోని కింది(శేణివారు — అంటే చిన్న వ్యాపారస్థులు, దుకాణదారులు, సాధారణంగా వ్యాపారం చాలించుకొని యింటివద్ద కూర్చున్నవారు, చేతిపనివాళ్ళు, రైతులు — వీళ్ళంతా కూడా పరి(శమను నడిపించేటంతటి స్థాయిలో కొనసాగించడానికి వారివద్ద వున్న కొద్దిపాటి పెట్టుబడి చాలక బడాపెట్టుబడిదారులతో పోటీలో నిలువలేక కొట్టుకొని పోవడమనే పాక్షిక కారణంగానూ, కొత్త వుత్పత్తి విధానాలవల్ల తమ (ప్రత్యేకమైన నిపుణత్వం చిల్లిగవ్వకి కూడా కొరకాకుండా పోవడమనే పాక్షిక కారణంగానూ, (కమ(కమేణా (శామిక వర్గంలోకి దిగజారిపోతున్నారు. ఈవిధంగా జనాభాలోని అన్ని వర్గాలనుండీ (పజలు (శామిక వర్గంలోకి కొత్తగా చేరుతారు.

(శామిక వర్గం అనేక దశలుగా అభివృద్ధి చెందుతుంది. పుట్టుకతోనే అది బూర్జువా వర్గంతో పోరాటం మొదలు పెడుతుంది. మొట్టమొదట యీ పోరాటం కార్మికులచే వ్యక్తిగతంగా సాగుతుంది, తర్వాత ఫ్యాక్టరీలోని పనివారందరిచేతా ఆతర్వాత ఒకే వృత్తిలో, ఒకే (పదేశంలో పనిచేసేవారిచే తమను (పత్యక్షంగా దోపిడీ చేసే వ్యక్తిగత బూర్జువాకు (పతికూలంగానూ సాగుతుంది. వారు బూర్జువావర్గంయొక్క ఉత్పత్తి పరిస్థితులకు వ్యతిరేకంగా కాకుండా ఉత్పత్తి పరికరాలకే (పతికూలంగా తమ దాడులను సాగిస్తారు; తమ (శమతో పోటీ చేసే విదేశాలనుండి దిగుమతి చేయబడిన సరకులను నాశనం చేస్తారు, యం(తాలను ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేస్తారు, ఫ్యాక్టరీలను తగల పెట్టేస్తారు, అదృశ్యమైపోయిన మధ్యయుగాలనాటి పనివాని హోదాను బల(పయోగంవల్ల పునఃస్థాపించడానికి యత్నిస్తారు.

ఈ దశలో కార్మికులు మొత్తం దేశం అంతటా చెల్లా చెదరై యింకా పరస్పర సంబంధంలేని రాశివలె ఏర్పడి తమలో తమకున్న పరస్పర పోటీ కారణంగా విడిపోయివుంటారు. వారు ఒకవేళ ఎక్కడైనా ఎక్కువ దృఢమైన జట్లుగా ఏర్పడేందుకై ఐక్యమైనట్లైతే ఆ ఐక్యత ఇంకా వారి సొంత (కియాశీలత ఫలితంగా సిద్ధించింది కాక, తన రాజకీయ ఆశయసిద్ధి కోసమని మొత్తం (శామికవర్గాన్ని చలనంలో ఉంచక విధిలేకపోయినట్టి, కాగా కొంత కాలం వరకు ఆవిధంగానే చేయగలిగేటట్టి బూర్జువావర్గంయొక్క ఐక్యతవల్లనే కేవలం సాధ్య పడింది. కాబట్టి ఈ దశలో (శామికులు తమ శ(తువులతో పోరాడక శ(తువులకు శ(తువులైన,

నిరంకుశ రాచరికంయొక్క అవశేషాలతోనూ భూస్వాములతోనూ, పారిశ్రామికేతర బూర్జు వాలతోనూ, పెట్టీబూర్జువాలతోనూ పోరాడుతారు. ఆవిధంగా మొత్తం చారిత్రక చలనం అంతా బూర్జువావర్గం చేతుల్లో సాంద్రీకృతమౌతుంది. ఆవిధంగా పొందిన ప్రతి విజయమూ బూర్జువా వర్గ విజయమే అవుతుంది.

కాని పరిశ్రమ అభివృద్ధితోపాటే శ్రామిక వర్గం సంఖ్యలో పెరగడమేకాకుండా అధిక రాసులలో సాంద్రీకృతమౌతుంది, దాని బలం పెరుగుతుంది, తన బలాన్ని తానే అధికంగా గుర్తించుకుంటుంది. శ్రమలోని వ్యత్యాసాలన్నిటినీ యంత్రం ఏ నిష్పత్తిలో తుడిచి పెట్టేస్తుందో, అదే నిష్పత్తిలో శ్రామిక వర్గపు శ్రేణులలోని వివిధ ప్రయోజనాలూ జీవిత పరిస్థితులూ అంతకంతకు సమానస్థాయిని అందుకునేటట్లు చేయబడతాయి, కాగా దాదాపు ప్రతి చోటా కూడా మజూరీలు ఒకే నీచస్థాయికి దింపివేయబడతాయి. బూర్జువావర్గ సభ్యుల మధ్య రోజురోజూ పెరిగిపోతున్న పోటీలు, తత్ఫలితంగా ఏర్పడ్డ వాణిజ్య సంక్షోభాలూ కార్మికుల మజూరీలను ఎక్కడా మరింతగా నిలకడలేకుండా చేసివేస్తాయి. యంత్రాభివృద్ధి నిరంతరాయంగా సాగుతూ వుండడం వల్లనూ, అది ఎంతో వేగంతో పెంపొందుతూండడంవల్లనూ కార్మికుల బ్రతుకు తెరువు అంతకంతకు అనిశ్చయమైపోతుంది; వ్యక్తిగత కార్మికులకూ వ్యక్తిగత బూర్జువాలకూ మధ్య జరిగే సంఘట్టనలు యీ రెండు వర్గాల మధ్య జరిగే సంఘట్టనలుగా మారుతాయి. అటుపైన కార్మికులు బూర్జువాలకు ప్రతికూలంగా సంఘాలు (ట్రేడ్‌యూనియన్లు) ఏర్పరచుకుంటారు; తమ కూలిరేట్లను నిలబెట్టుకోడానికి కలుస్తారు; అప్పుడప్పుడు జరిగే ఇలాంటి తిరుగుబాట్లకై ముందుగానే ఏర్పాట్లు చేసుకొనేందుకు శాశ్వత సంఘాలను స్థాపించుకుంటారు. ఈ పోరాటం అక్కడక్కడా దొమ్మీలుగా పరిణమిస్తుంది.

అప్పుడప్పుడు కార్మికులు విజయాన్ని చేపట్టుతారు, కాని అది తాత్కాలికమే. వారి యుద్ధాల యథార్థఫలం తక్షణఫలితంలో కాకుండా, నిత్యం విస్తరించే కార్మికుల ఐక్యతలో వుంటుంది. ఆధునిక పరిశ్రమచే సృష్టింపబడి అభివృద్ధి చెందినట్టీ, భిన్నభిన్న ప్రదేశాలలోని కార్మికులమధ్య ఒకరితో ఒకరికి సంబంధం కల్గించేటట్టి రాకపోకల మార్గాలు యీ ఐక్యతకు తోడ్పడతాయి. ఇలాంటి సంబంధమే అన్నీ ఒకే స్వభావం కలిగిన అనేక స్థానిక పోరాటాలను వర్గాలమధ్య ఒకే జాతీయ వర్గపోరాటంగా కేంద్రీకృతమొనర్చేందుకు సరిగ్గా ఇదొక్కటే అవసరమైంది. ఐతే ప్రతి వర్గపోరాటమూ ఒక రాజకీయ పోరాటమే. కాగా మధ్యయుగాలలోని రాజమార్గాలు అధ్వాన్న స్థితిలో ఉండడంవల్ల ఆ రోజుల్లోని నగర పౌరులు సాధించడానికి శతాబ్దాలు పట్టివుండేటట్టి ఐక్యతను రైల్వేల ధర్మమా అంటూ, ఆధునిక శ్రామికులు కొద్ది సంవత్సరాలలోనే సాధించగలుగుతున్నారు.

శ్రామికులు ఒక వర్గంగా యిలా సంఘటితమవడం, తత్ఫలితంగా వారు ఒక రాజకీయ పార్టీగా ఏర్పడడం వారిలో వారికే పోటీవల్ల వారి ఐక్యత తిరిగి తల్లకిందులౌతూనే వుంటుంది. ఐనా ఆ ఐక్యత మళ్లీ, ఇదివరకటికంటే ఎక్కువ బలంగానూ, ఎక్కువ దృఢంగానూ శక్తివంతంగానూ పైకిలేస్తుంది. బూర్జువావర్గంలోనే ఉన్న చీలికలను ఉపయోగించుకుని కార్మికుల ప్రత్యేక హక్కులను శాసన పూర్వకంగా గుర్తించేట్టు ఇది నిర్బంధించుతుంది. ఇంగ్లండులో ఈవిధంగానే పదిగంటలచట్టం జయంపొందింది.

మొత్తంమీద పాతసమాజంయొక్క వర్గాలమధ్య జరిగే సంఘట్టనలు శ్రామిక వర్గంయొక్క అభివృద్ధి గమనానికి అనేక విధాలుగా తోడ్పడతాయి. నిరంతరయుద్ధంలో తాను చిక్కుకొని వున్నట్టు బూర్జువావర్గం తెలుసుకుంటుంది: మొట్టమొదట ప్రభువర్గంతోనూ; ఆతర్వాత పరిశ్రమ ప్రగతికి ప్రతికూలంగా వుండేటట్టి తనవర్గంలోనే వున్న కొన్ని భాగాలతోనూ; నిత్యం విదేశాలలోని బూర్జువావర్గంతోనూ. బూర్జువావర్గం యీ యుద్ధాలన్నిటియందూ శ్రామిక వర్గ సహాయాన్ని అర్థించేటట్టు నిర్బంధింపబడి, ఈవిధంగా దానిని రాజకీయరంగంలోకి లాగుతుంది. కాబట్టి అసలు బూర్జువావర్గమే శ్రామిక వర్గానికి అది అభ్యసించిన రాజకీయ సాధారణ విద్య అంశాలను స్వయంగా అందిస్తుంది; వేరే మాటల్లో చెప్పాలంటే, బూర్జువా వర్గం తనతో పోరాడేందుకు వలసిన ఆయుధాలను శ్రామిక వర్గానికి స్వయంగా అమర్చిపెడుతుంది.

అంతే కాకుండా, మనం యిదివరకే గమనించినట్టు, పాలక వర్గాలలోని పూర్తి భాగాలే కొన్ని పరిశ్రమల పురోగమనంవల్ల శ్రామిక వర్గంలోకి అవక్షిప్తమవడమో, లేదా అధమ పక్షం వాటి అస్తిత్వ పరిస్థితులకు ప్రమాదమైనా ఏర్పడడమో జరుగుతుంది. ఇవి కూడా శ్రామిక వర్గానికి నూతన జ్ఞానాన్నీ అభ్యుదయకరమైన అంశాలనూ అందిస్తాయి.

చిట్టచివరికి వర్గపోరాటం అటో యిటో కచ్చితంగా తేలిపోయే గడియ సమీపించినప్పుడు పాలకవర్గంలో, అంతేకాదు వాస్తవానికి పాత సమాజం అంతటియొక్క పరిధి అంతటిలోనూ సాగుతూ వున్న విచ్ఛిత్తి విధానం ఎలాంటి తీవ్రమైన, సుస్పష్టమైన స్వభావాన్ని దాల్చుతుందంటే, పాలకవర్గంలోని ఒక చిన్న భాగం ఆ వర్గంనుండి అన్ని బంధానలను తెంచుకొని చీలిపోయి విప్లవ వర్గంతో, భవిష్యత్తును చేపట్టిన వర్గంతో చేతులు కలుపుతుంది. కాబట్టి పూర్వకాలంలో ప్రభువర్గంలోని ఒక భాగం బూర్జువావర్గం వైపుకు ఏవిధంగా వెళ్లిందో అదేవిధంగా యిప్పుడు బూర్జువావర్గంలోని ఒక భాగం అందులోనూ ప్రత్యేకించి సిద్ధాంతరీత్యా చరిత్రగమనాన్ని మొత్తంగా అవగాహన చేసుకొనే స్థాయిని అందుకోగలిగినట్టుగా కృషిచేసినట్టి కొంతమంది బూర్జువా సిద్ధాంతకర్తలలో ఒక భాగం శ్రామిక వర్గంవైపుకు వెళ్తుంది.

ఈనాడు బూర్జువావర్గాన్ని ముఖాముఖీ ఎదిరించి నిలబడే వర్గాలన్నిటిలోనూ ఒక్క శ్రామిక వర్గం మాత్రమే అసలైన విప్లవ వర్గం. ఇతర వర్గాలు ఆధునిక పరిశ్రమ సమక్షంలో క్షీణించిపోయి చిట్టచివరికి అదృశ్యమైపోతాయి; దానియొక్క ప్రత్యేకమైనట్టీ ముఖ్యమైనట్టీ ఉత్పన్నము శ్రామిక వర్గమే.

మధ్యతరగతిలోని క్రిందిశ్రేణులు, చిన్న కార్ఖానా ఉత్పత్తిదారుడు, దుకాణదారుడు, చేతిపనివాడు, రైతు, ఈ శ్రేణులన్నీ మధ్యతరగతిలో చిన్న భాగాలుగా తమ అస్తిత్వం అంతరించిపోకుండా కాపాడుకొనేందుకు బూర్జువావర్గంతో పోరాడుతాయి. కాబట్టి ఇవి విప్లవాత్మకములుకావు, సనాతనాభిమానులు. అంతేకాదు అభివృద్ధి విరోధకములు కూడానూ ఎందువల్లనంటే అవి చరిత్ర రథచక్రాన్ని వెనక్కి త్రిప్పడానికి ప్రయత్నం చేస్తాయి. ఒక వేళ ఇవి ఎప్పుడైనా యాదృచ్ఛికంగా విప్లవాత్మకములుగా మారాయంటే అదికేవలం ముమ్మందు అవి శ్రామిక వర్గంలోకి బదిలీచేయబడే విషయాన్ని దృష్టిలో వుంచుకొనే ఆవిధంగా చేస్తాయన్నమాట. ఈవిధంగా అవి తమ ప్రస్తుత ప్రయోజనాలను కాపాడుకోకుండా భవిష్యత్ ప్రయోజనాలను కాపాడుకుంటాయి. శ్రామిక వర్గంయొక్క దృక్పథానికి తాము ఉపయోగపడాలని అవి తమ దృక్పథాన్ని పరిత్యజించుతాయి.

"ప్రమాదకరమైన వర్గం," సాంఘిక తెట్టువ, పాత సమాజంయొక్క అట్టడుగు పొరలచే బయటికి విసర్జించబడి నిశ్చేష్టితమై కుళ్ళుతూన్న రాశి, శ్రామిక విప్లవంవల్ల అక్కడక్కడా ఉద్యమంలోకి కొట్టుకు రావచ్చు; ఐనప్పటికీ దాని జీవన పరిస్థితులు దానిని అభివృద్ధి నిరోధక తంత్రంయొక్క లంచాలుమేసే పనిముట్టుగా తయారుచేస్తాయి.

శ్రామిక వర్గం స్థితిగతులలో మొత్తంగా పాత సమాజంయొక్క స్థితిగతులు అప్పటికే వాస్తవంగా అంతరించిపోయాయి. శ్రామికునికి ఆస్తి పాస్తులుసున్న; బూర్జువా కుటుంబ సంబంధాలకూ, శ్రామికునికీ అతని భార్యా బిడ్డలకూ ఉన్న సంబంధానికీ ఎక్కడా సామ్యమే లేదు; ఫ్రాన్సులో ఉన్నట్టే ఇంగ్లండులోనూ, జర్మనీలో ఉన్నట్టే అమెరికాలోనూ ఉన్నట్టి ఆధునిక పారిశ్రామిక శ్రమ, పెట్టుబడి అధికారంకింద ఉండే ఆధునిక పరాధీనత, ఇది శ్రామికునినుండి జాతీయ స్వభావాన్ని ఎక్కడా జాడలేకుండా వొలిచివేసింది. చట్టం, నీతి, మతం యివి అన్నీ కూడా శ్రామికుని దృష్టిలో బూర్జువా ప్రయోజనాలు మాటువేసుకొని పొంచి వున్న కేవలం అన్ని బూర్జువా దురభిమానేలే తప్పమరేమీకావు.

పరిపాలనాధికారన్ని జయించుకున్నట్టి ఇంతకు పూర్వపు వర్గాలన్నీ అప్పటికే ఆర్జించుకున్న తమ హోదాను బలీయం చేసుకొనేందుకు తమ భుక్తపు నిబంధనలకు మొత్తం సమాజాన్ని వశంచేయడానికి ప్రయత్నం చేశాయి. పూర్వపు తమ సొంత భుక్తపు విధానము

రద్దు కాబడడం ద్వారానే తప్ప, తద్వారా యింతకు పూర్వమున్న ప్రతి ఒక్క భుక్తపు విధానమూ రద్దురాకాబడితేనే తప్ప శ్రామికులు సమాజంయొక్క ఉత్పాదక శక్తులకు యజమానులు కాలేరు. భద్రపరచుకోడానికీ, బలీయంచేసుకోడానికీ వారికి తమ దంటూ ఏదీలేదు; ఇంతకుపూర్వం సొంత ఆస్తుల భద్రతలనూ భీమాలనూ నాశనం చేయడమే వారికర్తవ్యం.

ఇదివరలో జరిగిన చారిత్రక ఉద్యమాలన్నీ అల్పసంఖ్యాకవర్గాల ఉద్యమాలే, లేదా అల్పసంఖ్యాకవర్గాల ప్రయోజనాలకొరకై జరిగిన ఉద్యమాలే. శ్రామిక ఉద్యమం ఆత్మచైతన్య వంతమై అధిక సంఖ్యాకవర్గం ప్రయోజనాలకొరకై ఏర్పడిన అత్యధిక సంఖ్యాకవర్గంయొక్క స్వతంత్ర ఉద్యమం. మన ప్రస్తుత సమాజంలో అన్నిటికంటే తక్కువ శ్రేణిలో వున్న శ్రామిక వర్గం తనమీద వున్న సమాజంయొక్క యావత్ ఉపరిస్థిత అధికారయుత శ్రేణులు గాలిలోకి విధ్వంసం కాబడితేనేతప్ప శ్రామిక వర్గం అటూ యిటూ కదలలేకపోతుంది, తనంతట తాను స్వయంగా ఉన్నత స్థితికి రాలేకపోతుంది.

శ్రామిక వర్గం బూర్జువావర్గంతో జరిపే పోరాటం విషయంలో కాకపోయినా రూపంలో నైనా మొట్టమొదట జాతీయ పోరాటంగా ఉంటుంది. ప్రతి దేశంయొక్క శ్రామిక వర్గమూ వాస్తవానికి మొట్టమొదట తన దేశపు బూర్జువావర్గంతో వ్యవహారాలు తేల్చుకొని తీరాలి.

శ్రామిక వర్గం అభివృద్ధియొక్క అత్యంత సర్వసాధారణ దశలను వివరించడంలో ప్రస్తుత సమాజంలో కొద్దో గొప్పో ప్రచ్ఛన్నంగా రగుల్తూన్న అంతర్యుద్ధాన్ని, ఎక్కడైతే యీ యుద్ధం బహిరంగ విప్లవంగా ప్రజ్వరిల్లుతుందో ఎక్కడైతే బూర్జువావర్గంయొక్క బలాత్కారయుత పదవీభ్రష్టం శ్రామిక వర్గ పరిపాలనకు పునాదులు నిర్మించుతుందో అంతవరకు విశదపరచాం.

ఇంతవరకు సమాజంయొక్క ప్రతి రూపమూ, మనం యిదివరకే గమనించినట్టు, పీడకులు పీడితులు మధ్యనున్న వైరుధ్యంమీదే ఆధారపడివుంది. కాని ఒక వర్గాన్ని అణచి వేసి వుంచాలంటే ఆ వర్గం కనీసం బానిసగానైనా బ్రతుకు వెళ్లబుచ్చుకొనేట్టి రక్షణ ఏర్పాట్లను ఆ వర్గానికి తప్పక కలుగజేయవలసి వుంటుంది. ఫ్యూడల్ నిరంకుశత్వపు కాడి కింద వుంటూ పెట్టీబూర్జువా ఏవిధంగా ఒక బూర్జువాగా అభివృద్ధి చెందాడో ఆదేవిధంగా భూదాస్యపు కాలంలో భూదాసుడు కమ్యూన్‌లలో స్వయంగా సభ్యత్వం సంపాదించుకొనే స్థితికి స్వయంగా తంటాలుపడి రాగలిగాడు. కాని ఆధునిక శ్రామికుడు అందుకు వ్యతిరేకంగా పరిశ్రమ ప్రగతితోపాటు పైకిరావడం బదులు తన వర్గపు సొంత అస్తిత్వ స్థితుల కంటే

కూడా అధమాధమపు స్థితికి దిగజారి పోతున్నాడు. అతడు గర్భదరిద్రుడై పోతున్నాడు, కాగా, జనాభా కంటేనూ, సంపదలకంటేనూ దారిద్ర్యం ఎక్కువ త్వరితగతిని అభివృద్ధి చెందుతుంది. కాబట్టి యిక్కడ స్పష్టంగా ఏంతెలుస్తుందంటే సమాజంలో బూర్జువా వర్గం ఇక పాలక వర్గంగా ఉండడానికీ, అన్ని శాసనాలనూ నియంత్రించేటట్టి ఉన్నత శాసనంలాగా సమాజంపై తన జీవిత పద్ధతుల్ని బలవంతంగా రుద్దడానికీ అర్హతను కోల్పోతూంది. తన బానిసను అతని బానిసత్వపు పరిధిలో బ్రతుకు యీడ్చేందుకు వలసిన రక్షణనిచ్చే సామర్థ్యం బూర్జువావర్గానికి లేకపోవడం కారణంగానూ, బానిసచే అది పోషింపబడడానికి బదులు అదే బానిసను పోషించవలసివచ్చిన స్థితికి అతడు దిగజారిపోతూన్నప్పటికీ అది అతనిని రక్షించలేక చూస్తూ ఉరుకోవలసిన కారణంగానూ, అది పాలనాధికారాన్ని చేబట్టడానికి అర్హతను కోల్పోయింది. ఈ బూర్జువావర్గంకింద సమాజం యిక మనజాలదు; వేరేవిధంగా చెప్పాలంటే బూర్జువావర్గం ఉనికికీ సమాజానికీ ఇక పొత్తుకుదరదు.

బూర్జువావర్గం అస్తిత్వానికీ, అది తన అధికారాన్ని స్థిరంగా ఉంచుకోడానికీ అవసరమైన పరిస్థితే పెట్టుబడి ఏర్పడడమూ, దాని వృద్ధినూ; పెట్టుబడికి అవసరమైన పరిస్థితి కూలిశ్రమ. కూలిశ్రమ కార్మికుల మధ్య వుండే పోటీమీద కేవలం ఆధారపడివుంటుంది. బూర్జువావర్గమే అప్రయత్న పూర్వకంగా దోహదం చేస్తూనట్టి పరిశ్రమాభివృద్ధి, పోటీ కారణంగా విడివిడిగా ఉండిపోయిన కార్మికుల అనైక్యత స్థానే సహవాసం కారణంగా విప్లవకర ఐక్యతను నెలకొల్పుతుంది. కాబట్టి ఆధునిక పరిశ్రమాభివృద్ధి, బూర్జువావర్గం ఏ పునాదులపై ఉత్పత్తిచేసి ఉత్పత్తులను భుక్తం చేసుకుంటూ వుందో ఆ పునాదులనే దాని పాదాలకిందనుండి తొలిగించి వేస్తుంటుంది. అందువల్ల బూర్జువావర్గం తన సమాధికి గోతిని తవ్వేవారినే అన్నిటికంటే ప్రధానంగా ఉత్పత్తి చేస్తూంది. దాని పతనం, శ్రామికవర్గ విజయం రెండూ సమంగా అనివార్యములే.

## II. శ్రామికులు, కమ్యూనిస్టులు

మొత్తంగా శ్రామికులపట్ల కమ్యూనిస్టులు ఏలాంటి సంబంధాన్ని కలిగి వుంటారు?

ఇతర కార్మికవర్గపు పార్టీలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వేరే ఒక పార్టీ వారుకారు.

మొత్తం శ్రామిక వర్గంయొక్క ప్రయోజనాలు కాకుండా వేరే ప్రత్యేకమైన ప్రయోజనాలు వారికి లేవు.

శ్రామికోద్యమాన్ని నమూనాకట్టి పోతపోసి తయారుచేసేందుకు ఎలాంటి తమ సొంత ఒంటెత్తు పోకడ సూత్రాలనూ వారు నెలకొల్పరు.

ఇతర శ్రామిక వర్గపు పార్టీలతో కమ్యూనిస్టులు యీకింది విషయాలలో మాత్రమే విభేదించుతారు: 1. భిన్నభిన్న దేశాలలోని జాతీయపోరాటాలలో వారు ఏ శ్రామిక వర్గంయొక్క ఎట్టి జాతీయతపైనా ఆధారపడనట్టి, సామాన్య ప్రయోజనాలను పేర్కొని వాటిని స్పష్టంగా ప్రదర్శించుతారు. 2. కార్మికవర్గం బూర్జువా వర్గంతో జరిపే పోరాటం మన వలసిన వివిధ దశల అభివృద్ధిలోనూ కమ్యూనిస్టులు ఎప్పుడూ కూడా ప్రతిచోటా మొత్తం ఉద్యమంయొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

కాబట్టి కమ్యూనిస్టులు ఇటు ఆచరణరీత్యా యితరులను కార్యరంగంలోకి తీసుకు వచ్చే వారుగా వుంటూ ప్రతిదేశంయొక్క కార్మికవర్గపు పార్టీలలోనూ అత్యంత పురోగామి అయినట్టి, దృఢసంకల్పం కలిగినట్టి భాగంగా, ఇతర భాగాలన్నిటినీ నిరంతరం ముందుకు తీసుకుపోయేనట్టి భాగంగా ఉంటారు. అటు వారు, సిద్ధాంత రీత్యా, శ్రామికోద్యమంయొక్క పురోగమన పథము, పరిస్థితులు, అంతిమ సాధారణ ఫలితాలను శ్రామిక జనబాహుళ్యంలో అధికభాగంకంటే స్పష్టంగా అవగాహన చేసుకొన గలుగుతున్నారు.

ఇతర శ్రామిక పార్టీలన్నిటి తక్షణ లక్ష్యమేమిటో కమ్యూనిస్టుల తక్షణ లక్ష్యమూ అదే: శ్రామికులందరినీ ఒక వర్గంగా నిర్మాణం చెయ్యడం, బూర్జువావర్గపు ఆధిపత్యాన్ని పడగొట్టడం, శ్రామిక వర్గం రాజకీయ అధికారాన్ని జయించడము.

కమ్యూనిస్టుల సైద్ధాంతిక పర్యవసానాలు ఎవరో ఒక విశ్వసంస్కర్త కాదలచిన వ్యక్తి ఆవిష్కరించిన, లేదా కొత్తగా కనిపెట్టిన భావాలపైగానీ, సూత్రాలపైగానీ ఏవిధంగానూ ఆధారపడి వుండవు.

మన కండ్లముందే నడుస్తూ వున్న ఒక చారిత్రక ఉద్యమంనుండి, అస్తిత్వాన్ని కలిగి వున్న ఒక వర్గపోరాటంనుండి ఉద్భవించే వాస్తవిక సంబంధాలను కేవలం సాధారణమైన మాటలల్లోనే ఈ సూత్రాలు వ్యక్త పరుస్తాయి. ఇప్పుడుంటూన్న ఆస్తి సంబంధాలను రద్దు చేసే విషయం కమ్యూనిజంయొక్క విశిష్టాంశమేమీకాదు.

గతంలోని ఆస్తి సంబంధాలన్నీ చారిత్రక పరిస్థితులలోని మార్పు ఫలితంగా ఎడతెగకుండా మార్పుకు లోనవుతూనే వచ్చాయి.

ఉదాహరణకు ఫ్రెంచి విప్లవం ఫ్యూడల్ ఆస్తిని బూర్జువా ఆస్తికి అనుకూలంగా రద్దుపరచింది.

కమ్యూనిజంయొక్క ప్రత్యేకమైన లక్షణం ఏమిటంటే, సాధారణంగా ఆస్తిని రద్దు పరచడం కాదు, కాని బూర్జువా ఆస్తిని రద్దుచేయడమే. ఐతే వర్గవైషమ్యాలపైనా, అల్ప సంఖ్యాకులు అధిక సంఖ్యాకులను దోపిడీ చేసుకోవడంపైనా ఆధారపడిన సరుకులను ఉత్పత్తి చేసే విధానంయొక్క, సరుకులను భుక్తపరచుకునే విధానంయొక్క ఆఖరి సమగ్ర వ్యక్తీకరణమే ఆధునిక బూర్జువా విధానపు సొంత ఆస్తి.

ఈ అర్థంలో కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని క్రోడీకరించి ఒక్క వాక్యంలో యిలా చెప్పవచ్చు: సొంత ఆస్తి రద్దుచేయడం.

వ్యక్తి స్వేచ్ఛ, క్రియాశీలత, స్వాతంత్ర్యములన్నిటికీ పునాది అని ఇతరులచే చెప్పబడుతూన్నట్టి ఆస్తిని, వ్యక్తియొక్క సొంత శ్రమ ఫలితమైన ఆస్తిని, వ్యక్తిగతంగా సంపాదించుకొనే హక్కును రద్దుపరచే కాంక్ష మనకుందని కమ్యూనిస్టులమైన మనల్ని నిందిస్తున్నారు.

కష్టపడి పనిచేసి, సొంతంగా సముపార్జించుకొని, సొంతంగా సంపాదించుకొన్న ఆస్తి! అంటే బూర్జువా ఆస్తి రూపానికి యింకా పూర్వం వుండిన రూపమైనట్టి చిల్లర చేతి పనులు చేసుకొనే వ్యక్తియొక్క, చిన్న తరగతి రైతుయొక్క ఆస్తి అనా మీ అభిప్రాయం? ఆ ఆస్తిని రద్దుచేయవలసిన అవసరమేలేదు; దానిని పరిశ్రమాభివృద్ధి యిదివరకే చాలావరకు నాశనంచేసేసింది. ఇంకా ఇప్పటికీ రోజూ నాశనం చేస్తూనే ఉంది.

లేదా మీరు అభిప్రాయపడేది ఆధునిక బూర్జువా సొంత ఆస్తి గురించా?

ఐతే కూలిశ్రమ శ్రామికునికి ఆస్తి నేమైనా సృష్టిస్తుందా? ఏమాత్రం కూడా సృష్టించదు. అది పెట్టుబడిని సృష్టిస్తుంది, అంటే కూలిశ్రమను దోచుకొనేటట్టి,

తాజాగా దోపిడీకి గురిచేయడానికై కూలి(శమను కొత్తగా పుట్టించుతేనే తప్ప ఇతర షర తుపై అభివృద్ధి చెందనేరనట్టి ఆస్తిని సృష్టిస్తుంది. పెట్టుబడి, కూలి(శమ యీరెంటి వైరుధ్యంపైనా ఆధారపడి వుంది (ప్రస్తుత రూపంలో వున్న ఆస్తి. ఈ వైరుధ్యం రెండు పక్షాలనూ మనం పరిశీలించుదాం.

పెట్టుబడిదారుడుగా తయారవ్వాలంటే ఉత్పత్తిలో కేవలం వ్యక్తిగత హోదాయే కాకుండా సామాజిక హోదా కలిగి వుండడం అన్నమాట. పెట్టుబడి ఒక సమిష్టి ఉత్పత్తి. సమాజంలో అనేకమంది సభ్యుల సంఘటిత చర్యవల్లనే, అంతే కాదు ఇక చిట్టచివ రకి సమాజంలోని వారందరి సంఘటిత కార్యాచరణవల్లనే దానిని చలనంలో పెట్టడానికి వీలవుతుంది.

కాబట్టి పెట్టుబడి ఒక వ్యక్తిగత శక్తి కాదు, అది ఒక సామాజిక శక్తి.


అందువల్ల పెట్టుబడి సమిష్టి ఆస్తిగా మారినప్పుడూ, సమాజంలోని సభ్యులం దరి ఆస్తిగా మారినప్పుడూ, వ్యక్తిగత ఆస్తి సామాజిక ఆస్తిగా పరివర్తనం చెందదు. మారిన దల్లా ఒక్క ఆస్తియొక్క సామాజిక స్వభావం మాత్రమే. తన వర్గ స్వభావాన్ని అది కోల్పో తుంది.

ఇప్పుడు మనం కూలి(శమ విషయం తీసుకుందాం.

కూలి(శమయొక్క సగటుఖరీదు కనిష్ఠ కూలి. అంటే ఒక (శామికుడు (శామి కునిగా బొటాబొటిగా (బతకడానికి మాత్రమే కచ్చితంగా అవసరమైన జీవనోపాధికి వలయు భాగం. కాబట్టి కూలి(శామికుడు తన (శమవల్ల భుక్తం చేసుకొనేది తన నగ్నజీవితాన్ని పొడి గించుకోడానికీ తన నగ్నజీవితంలాంటి సంతానాన్ని వృద్ధిచేసుకోడానికీ బొటాబొటిగా సరి పోతుంది. మానవ జీవన పోషణానికీ, సంతానాభివృద్ధి కొరకూ సంపాదించుకొనే యీ (శమఫలి తాలయొక్క వ్యక్తిగతభుక్తాన్ని రద్దుచేయాలని మేం ఎన్నడూ ఉద్దేశించం. ఏ భుక్తవిధానం కింద పెట్టుబడిని వృద్ధి చేయడానికి (శామికుడు జీవిస్తున్నాడో, ఆ జీవించడమైనా కేవలం పాలకవర్గం అవసరం ఉన్నంతవరకే అలా జీవిస్తున్నాడో, ఆ భుక్తవిధానంయొక్క దౌర్భాగ్య స్వభావాన్ని మాత్రమే మేం నిర్మూలించదలచుకున్నాం.

బూర్జువా సమాజంలో సజీవ(శమనేది సంచితమైన (శమను వృద్ధిచేసే సాధనం మాత్రమే. కమ్యూనిస్టు సమాజంలో సంచితమైన (శమ (శామికుని జీవితం విస్తృతమూ భాగ్యవంతమూ చేయడానికీ జీవితవిధానాన్ని దోహదంచేయడానికీ సాధనంగా ఉంటుంది.

కాబట్టి బూర్జువా సమాజంలో గతం వర్తమానంపై అధికారం చలాయిస్తుంది; కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతంపై అధికారం చలాయిస్తుంది. బూర్జువా సమా



“కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక” వ్రాతప్రతిలో ఒక పుట. (వాచకము సర్వమూ మార్క్స్ దస్తూరీలోనే ఉంది; పై రెండు పంక్తులు మాత్రం అయన భార్య, జెన్నీ మార్క్స్ దస్తూరీలో ఉన్నాయి.)

జంలో పెట్టుబడి స్వతంత్రమైనదిగానూ, వ్యక్తిత్వ సహితమైనదిగానూ వుండగా బూర్జువా సమాజంలో సజీవ మానవుడు పరాధీనుడుగానూ, వ్యక్తిత్వ రహితుడుగానూ వున్నాడు.

కాగా, ఈ పరిస్థితులను రద్దుచేయడం వ్యక్తిత్వాన్నీ స్వేచ్ఛనీ రద్దుచేయడమేనని బూర్జువావర్గం వారు అంటున్నారు! అవును వారనేదీ నిజమే. బూర్జువా వ్యక్తిత్వాన్నీ, బూర్జువా స్వాతంత్ర్యాన్నీ బూర్జువా స్వేచ్ఛనీ రద్దుచేయడమే నిస్సంశయమైన లక్ష్యం.

ఈనాటి బూర్జువా ఉత్పత్తి పరిస్థితులలో స్వేచ్ఛ అంటే స్వేచ్ఛాయుత వ్యాపారం, స్వేచ్ఛాయుతమైన క్రయవిక్రయాలు.

కాని క్రయవిక్రయాలు అంతర్థానమైపోయినట్లైతే స్వేచ్ఛాయుతమైన క్రయవిక్రయాలు కూడా అంతర్థానమైపోతాయి. బూర్జువాలు చేసే యీ స్వేచ్ఛాయుతమైన క్రయవిక్రయాలను గురించిన ప్రసంగాలకూ, సాధారణంగా స్వేచ్ఛను గురించి పలికే ''సాహసోక్తుల''కూ, ఒకవేళ ఏమైనా అర్థం వుంటే మధ్యయుగాలలో అనేక నిబంధనలకు లోనైన క్రయవిక్రయాలతో, అస్వతంత్రులైన వర్తకులతో పోల్చిచూసినప్పుడున్న వ్యత్యాసంలో మాత్రమే అర్థం అగపడుతుందే కాని, క్రయవిక్రయాలనూ బూర్జువా ఉత్పత్తి పరిస్థితులనూ, అసలు బూర్జువావర్గాన్నే కమ్యూనిస్టు విధానం ప్రకారం రద్దుచేయడంతో పోల్చిచూస్తే మాత్రం అర్థమే అగపడదు.

సొంత ఆస్తిని నాశనం చేయాలనే మా సంకల్పాన్ని చూసి మీరు భయకంపితుల తున్నారు. కాని నేటి మీ సమాజంలో పదింట తొమ్మిది వంతుల జనాభా విషయంలో సొంత ఆస్తి యీపాటికే రద్దయిపోయింది; మిగతా కొద్ది మందికి మాత్రమే అది ఉండిపోయిందీ అంటే అందుకు ముఖ్యమైన కారణం ఆ తొమ్మిది వంతుల జనాభా చేతుల్లోనూ ఆస్తి అనేది లేకపోవడమే. ఇలాంటి ఆస్తి రూపాన్ని, అంటే సమాజంలో బ్రహ్మాండమైన అత్యధిక సంఖ్యాకులకు ఏ ఆస్తి లేకుండా ఉండడమే తన అస్తిత్వానికి అవసర పరిస్థితిగా కలిగినట్టి ఆస్తి స్వరూపాన్ని మేం నిర్మూలం చేయబూనినందుకు మీరు మమ్మల్ని దూషిస్తున్నారు.

ఒక్క మాటలో చెప్పాలంటే మీ ఆస్తిని మేం నిర్మూలం చేయబూనినందుకు మీరు మమ్మల్ని దూషిస్తున్నారు. సిసలుగా అంతే; సరిగ్గా అదే మేం చేయదలచుకున్నాం.

శ్రమ పెట్టుబడిగా, ధనంగా, లేదా శిస్తుగా, ఏ క్షణంనుండి యిక మారదో, ఏ క్షణం నుండి అది గుత్తాధికార పెత్తనంకింద వుండే సామాజిక శక్తిగా మారదో, అంటే సొంత ఆస్తిని ఏ క్షణంనుండి బూర్జువా ఆస్తిగాగానీ, పెట్టుబడిగాగానీ మార్చడానికి వీలుండదో, అనగా, వ్యక్తిగత ఆస్తి బూర్జువా ఆస్తిగా, పెట్టుబడిగా ఇటుపైనుండీ పరివర్తనం చెందడానికి ఇకవీలుండదో, ఆ క్షణంనుండే మానవుని వ్యక్తిత్వం మాయమౌతుందని మీరంటారు.

కాబట్టి "వ్యక్తి" అంటే బూర్జువా తప్ప యింకా ఎవరూ కాదనీ, "వ్యక్తిగతమైన" అంటే ఆస్తియొక్క మధ్యతరగతికి చెందిన సొంతదారుడనీ మీరు అభిప్రాయపడుతున్నట్టు మీరు ఒప్పుకుని తీరాలి. ఈ "వ్యక్తి"ని తప్పనిసరిగా దారినుండి తుడిచిపెట్టి వేయాలి. అలాంటి వ్యక్తి ఉండడానికి అసాధ్యమయ్యేటట్టు చేయాలి.

కమ్యూనిజం ఏవ్యక్తిని కూడా సామాజిక ఉత్పత్తులను భుక్తంచేసుకోకుండా చేయదు; కమ్యూనిజం చేసేదంతా ఏమిటంటే, అట్టి భుక్తముయొక్క సాధనాలను ఉపయోగించి ఇతరుల శ్రమను లొంగదీసుకునే శక్తిని అతనకి లేకుండా చేయడమే.

సొంత ఆస్తిని రద్దుచేయడంతో పని అంతా నిలిచి పోతుందనీ, సార్వజనికమైన సోమరి తనం మనని ముంచెత్తుతుందనీ ఆక్షేపిస్తున్నారు.

దీని ప్రకారం బూర్జువా సమాజం వట్టి సోమరితనంతో ఏనాడో అడుక్కుని తిన వలసి వుండేది. ఎందువల్లనంటే ఆ సమాజంలో వున్నట్టి పనిచేసే వ్యక్తులకు ఆస్తి సంపాదన శూన్యం. ఏదైనా ఆస్తి సంపాదించినవారు అసలు పనిచేయరు. ఈ ఆక్షేపణంతా, పెట్టుబడి లేనంతకాలం కూలిశ్రమ వుండదు అనే పునరుక్తియొక్క మరొక రూపంతప్ప మరేమీ కాదు.

కమ్యూనిస్టు విధానపు భౌతిక ఉత్పత్తి విషయంలోనూ, భౌతిక ఉత్పత్తుల భుక్తం విషయంలోనూ ఎన్ని ఆక్షేపణలైతే వస్తున్నాయో అదేవిధంగా కమ్యూనిస్టు విధానపు వైజ్ఞానిక ఉత్పత్తుల విషయంలో, వాటి ఉత్పత్తి, భుక్తం విషయంలోనూ వచ్చాయి. బూర్జువా దృష్టికి వర్గంయొక్క ఆస్తి అదృశ్యమైపోవడమంటే, అసలు ఉత్పత్తే నిర్మూలమైపోవడమని ఏలా అగుపిస్తూందో అలాగే వర్గ సంస్కృతి అదృశ్యమైపోవడమంటే అసలు సంస్కృతంతా అదృశ్యమైపోవడంతో సమానమైనట్టు అతనికి అగుపిస్తుంది.

ఏ సంస్కృతి నాశనమైపోతుందని బూర్జువా దుఃఖిస్తున్నాడో ఆ సంస్కృతి, బ్రహ్మాండమైన అత్యధిక సంఖ్యాకవర్గానికి కేవలం ఒక యంత్రంవలె నడుచుకొనేటట్టు చేసిన శిక్షణే.

స్వేచ్ఛ, సంస్కృతి చట్టం వగైరాలపట్ల మీకుండే బూర్జువా భావాల ప్రమాణాలను మేం తలపెట్టిన బూర్జువా ఆస్తి రద్దుకి మీరు ఎంత కాలమైతే ముడిపెట్టుతారో అంత కాలమూ మీరు మాతో ఘర్షణపడకండి. ఏవిధంగానైతే అందరూ అనుసరించవలసిన చట్టంగా చేయబడినట్టి మీ వర్గ అభీష్టమే, మీ వర్గంయొక్క అస్తిత్వ ఆర్థిక పరిస్థితులచే నిర్ణయించబడినట్టి స్వభావమూ నియంత్రమే, నిర్ణయించబడినట్టి అభీష్టమే తప్ప మీ న్యాయశాస్త్రం వేరొకటి ఏదీ కాదో, ఆలాగే అసలు మీకున్న భావాలన్నీ మీ బూర్జువా

ఉత్పత్తి, బూర్జువా ఆస్తి పరిస్థితులు, శరీరంపై పుట్టించిన నూసంపుకంతి తప్ప వేరొకటి ఏదీ కాదు.

మీ ప్రస్తుత ఉత్పత్తి విధానాలనుండీ, ఆస్తి స్వరూపంనుండీ ఉద్భవించే సామాజిక రూపాలు శాశ్వత ప్రకృతి, హేతువాద సూత్రాలవలె మార్చి వేసేందుకు – ఉత్పత్తి ప్రగతిలో ఉద్భవించి అంతరించిపోయే చారిత్రక సంబంధాలు ప్రేరేపిస్తూన్నట్టి స్వార్థపరసహితమైనట్టి మీ తప్పుడుభావాలు – ఈ తప్పుడుభావాలలో మీ ముందుండిన ప్రతి పాలక వర్గంతోనూ మీరు భాగస్వాము లవుతున్నారు. ప్రాచీన ఆస్తి విషయంలో మీరు దేనినైతే స్పష్టంగా చూస్తున్నారో, ఫ్యూడల్ ఆస్తి విషయంలో దేనినైతే మీరు అంగీకరించుతున్నారో మీ ంత బూర్జువా ఆస్తి రూపం విషయంలో ఒప్పుకోడానికి మీకు సహజంగానే నిషేధాలున్నాయి.

కుటుంబాన్ని రద్దుచేయడం! కమ్యూనిస్టులు యింత అప్రతిష్ఠాపాలైన ప్రతిపాదనను చేస్తున్నారని ఆఖరికి అతివాదులలో అతివాదులైన వారు కూడా మండిపడి పోతున్నారు.

ఈనాటి కుటుంబం, బూర్జువా కుటుంబం, ఏ పునాదులపైన నిలిచి వుంది? పెట్టుబడిపైనా, వ్యక్తిగత లాభాంపైనా? ఇటువంటి కుటుంబంయొక్క సంపూర్ణంగా అభివృద్ధి చెందిన రూపం కేవలం బూర్జువా వర్గంలోనే మనుతూంది. కాని యీ పరిస్థితులయొక్క పూరకము శ్రామికులలో కుటుంబజీవితం ఆచరణలో లేకపోవడంలోనూ బహిరంగ వ్యభిచారంలోనూ కనబడుతూంది.

దాని పూరకము ఎప్పుడు అంతర్థానమైపోతుందో, అప్పుడు బూర్జువా కుటుంబం కూడా అంతర్థానమైపోతుంది, కాగా, పెట్టుబడి అంతర్థానంతో రెండూ అంతర్థానమైపోతాయి.

తల్లిదండ్రులు తమ పిల్లలను స్వలాభం కొరకు ఉపయోగించుకోవడాన్ని మేం వ్యతిరేకిస్తున్నామని మీరు మా పైన నేరంమోపదలచుకున్నారా? ఈనేరాన్ని మేం అంగీకరిస్తున్నాం.

కాని, ఇంటివద్ద నేర్చుకొనే విద్య బదులు సామాజిక విద్యను మేం ప్రవేశపెట్టినప్పుడు పవిత్ర సంబంధాలన్నిటిలోనూ అత్యంత పవిత్ర సంబంధాన్ని నాశనం చేస్తున్నామని మీరు అంటారు.

మరి మీ విద్యమాటో? అది మాత్రం సామాజిక విద్యకాదా? పాఠశాలలు మొదలైన విద్యాసంస్థలద్వారా, సమాజం ప్రత్యక్షంగానో పరోక్షంగానో జోక్యం కలుగచేసుకోవడంవల్ల మీరు ఏ సామాజిక పరిస్థితులకిందైతే చదువు చెప్పిస్తున్నారో ఆ సామాజిక పరిస్థితులు వల్లనే ఆ విద్య నిశ్చయించబడడం లేదా? విద్యలో సమాజం జోక్యం కలుగజేసుకోవడమనే దాన్ని కమ్యూనిస్టులు కనిపెట్టలేదు; వారు యీ జోక్యంయొక్క స్వభావాన్ని మాత్రమే మార్చదలచుకున్నారు, కాగా విద్యను పాలకవర్గ ప్రభావంనుండి రక్షించ దలచుకున్నారు.

కుటుంబాన్ని గురించీ, విద్యను గురించీ, తల్లిదండ్రుల బిడ్డల పవిత్రమైన పరస్పర సంబంధాలను గురించీ బూర్జువావర్గం వారు చెప్పే గొప్ప కబుర్లు వింటుంటే, ఆధునిక పరిశ్రమ చర్య కారణంగా శ్రామికులయొక్క కుటుంబ బంధనాలు విచ్ఛిన్నమైపోతూన్నప్పుడూ, వారి పిల్లలు కేవలం వాణిజ్య సరుకులుగానూ శ్రమ పరికరాలుగానూ మరింతగా మారిపోతూన్నప్పుడూ ఇక ఎంతైనా అసహ్యం వేస్తుంది.

కమ్యూనిస్టులు స్త్రీలను సమాజపరంచేసే విధానాన్ని ప్రవేశపెడతారంటూ బూర్జువావర్గం వారంతా కలిసి ఒక్కటే గొంతుకతో గావుకేకలు వేస్తున్నారు.

తన భార్యను కేవలం ఒక ఉత్పత్తి పరికరంగానే భావిస్తున్నాడు బూర్జువా. ఉత్పత్తి పరికరాలన్నీ ఉమ్మడిగా ఉపయోగించబడుతాయని అతడు వింటున్నాడు. ఆవిధంగానే అందరికీ ఉమ్మడిగా అయిపోయే గతి స్త్రీలకి కూడా పట్టుతుంది కదా అనే పర్యవసానానికే తప్ప మరొక పర్యవసానానికి అతడు సహజంగానే రాక తప్పదు.

లక్ష్యంయొక్క అసలు విషయమంతా స్త్రీలు కేవలం ఉత్పత్తి పరికరంగా వుండే స్థితిని అంతమొందించడంలోనే ఉందని అతడికి ఒక అనుమానమైనా తోచదు.

కమ్యూనిస్టులు స్త్రీలను బహిరంగంగానే, అధికారయుతంగానే సమాజపరం చేస్తారని బూర్జువావర్గం తెచ్చిపెట్టుకున్నట్టి ధర్మయుతమైన ఆగ్రహంతో చేసే ప్రచారం కంటే పరిహాసాస్పదమైనటువంటి ప్రచారం మరి వేరే వుండదని చెబితే ఇకసరిపోతుంది. స్త్రీలను సమాజపరం చేయడమనేదానిని ప్రవేశపెట్టడం కమ్యూనిస్టులకు అవసరమే లేదు; ఆ పద్ధతి ఇంచుమించు అనాదినుండే జరుగుతూనే వుంది.

మన బూర్జువాలు తమ శ్రామికుల భార్యలనీ వారి కుమార్తెలనీ తమ చెప్పుచేతలలో వుంచుకోవడం చాలక, మామూలు వేశ్యలమాట అటుండగా ఒకరి భార్యనొకరు అనుభవించడంలో అపరిమితమైన ఆనందాన్ని పొందుతున్నారు.

వాస్తవానికి బూర్జువా వివాహం సమిష్టి భార్యావిధానం. కమ్యూనిస్టులపై బూర్జువాలు చేయదలచుకున్న ఆక్షేపణ అంటూ ఒకటి ఉంటే అది రహస్యంగా, కుటిలబుద్ధితో విచ్చలవిడిగా జరుగుతూన్న దాని స్థానే కమ్యూనిస్టులు ఈ వ్యభిచారాన్ని బహిరంగంగా చట్టసమ్మతమైన సమిష్టి భార్యా విధానంగా చేయదలచుకున్నారేమో అనేదే. ఇక మిగతా విషయమంటారా, వాస్తవానికి నేటి ఉత్పత్తి విధానం రద్దుతో యీ విధానంనుండి ఉద్భవించినట్టి స్త్రీలను సంఘపరం చేయడమనేది కూడా, అంటే రహస్యంగానూ బహిరంగంగానూ జరిగే వ్యభిచారం కూడా నేటి ఉత్పత్తి విధానంతోపాటే తప్పక రద్దు అయిపోతుందనడం స్వయం వ్యక్తమే.

దేశాలనీ జాతీయతనీ రద్దుచేయాలని సంకల్పిస్తున్నారంటూ కమ్యూనిస్టులపై మరో నింద కూడా ఉంది.

కార్మిక జనానికి దేశం అనేది లేదు. వాళ్లకు లేనటువంటి దానిని మేం వాళ్లనుండి తీసుకోలేం. అసలు అన్నిటికంటె మొట్టమొదట శ్రామికవర్గం రాజకీయ అధికారాన్ని సంపాదించాలి, జాతియొక్క అగ్రగామి వర్గంగా పైకిరావాలి, స్వయంగా తానే అసలు జాతిగా నిర్మాణం కావాలి కాబట్టి, ఇంతవరకూ — ఆమాటకు బూర్జువాలు చెప్పే అర్థంలో కాకపోయినా — తానే జాతీయమైనదిగా ఉంది.

బూర్జువావర్గం అభివృద్ధి చెందుతూండడంవల్లనూ, వాణిజ్యం స్వేచ్ఛగా కొనసాగుతూండడంవల్లనూ, ప్రపంచ మార్కెట్టువల్లనూ, ఉత్పత్తి విధానంలోనూ దానికి ప్రతిరూపమైన జీవన పరిస్థితులలోనూ ఏకరూపత్వం వస్తూండడంవల్లనూ జాతుల మధ్యనున్న విభేదాలూ, వైషమ్యాలూ రోజురోజుకూ ఎక్కువకెక్కువగా అంతర్ధానమౌతూ వున్నాయి.

శ్రామిక వర్గాధికారం యీ విభేదాలనీ వైషమ్యాలనీ మరింత ఎక్కువ త్వరితగతిని అంతర్ధానమయేటట్టు చేస్తుంది. శ్రామికవర్గ విమోచనానికి అవసరమైన మొట్టమొదటి షరతు కనీసం అగ్రస్థానంలో వున్న నాగరిక దేశాలయొక్క సమైక్య కార్యాచరణయే.

ఏ నిష్పత్తిలో ఒక వ్యక్తి మరో వ్యక్తిని దోచుకోవడం అంతమొందింపబడుతుందో అదే నిష్పత్తిలో ఒక జాతి మరొక జాతిని దోచుకోవడం కూడా అంతమొందింపబడుతుంది. ఒక జాతిలో వున్న వర్గాలమధ్య వైషమ్యం ఏ నిష్పత్తిలో అంతర్ధానమైపోతుందో అదే నిష్పత్తిలో ఒక జాతికీ మరో జాతికీ మధ్యనున్న శత్రుత్వం అంతమౌతుంది.

మతం, తత్వం, సాధారణంగా సిద్ధాంతం, వీటి దృష్ట్యా కమ్యూనిస్టులపై చేసే నేరారోపణలు తీవ్రంగా పరిశీలించదగినట్టివి కానేకావు.

మానవుని భావాలు, దృక్పథాలూ, తలంపులూ, ఒక్క మాటలో చెప్పాలంటే మానవుని చైతన్యం, భౌతిక పరిస్థితులలోనూ అతని సామాజిక సంబంధాలలోనూ అతని సాంఘిక జీవనంలోనూ కలిగే ప్రతిమార్పుతోనూ మారుతుందని గ్రహించడానికి గాఢమైన, అంతర్జ్ఞానం అవసరమా? ఏమి అవసరంలేదు.

భౌతిక ఉత్పత్తి ఏ నిష్పత్తిలో మారుతుందో అదే నిష్పత్తిలో విజ్ఞానోత్పత్తి తన స్వభావాన్ని మార్చుకుంటుందని కాకపోతే మరిదేనిని రుజువుచేస్తూంది మానవ భావాలచరిత్ర? ప్రతి యుగంలోనూ పాలన చేస్తూన్న భావాలు ఆయా యుగాలలోని పాలకవర్గంయొక్క భావాలే.

సమాజంలో విప్లవం తీసుకువచ్చే భావాల గురించి ప్రజలు మాట్లాడేటప్పుడు పాత

సమాజంలో కొత్త సమాజపు అంకురాలు సృష్టించబడ్డాయనే వాస్తవాంశాన్నే, పాత సామాజిక పరిస్థితులు ఎంత వేగంగా క్షయమైపోతాయో పాత భావాలు కూడా అంత వేగంగా క్షయమైపోతాయనే వాస్తవాంశాన్నే వ్యక్తంచేస్తున్నారు.

ప్రాచీన ప్రపంచం తన అవసాన మృత్యువేదనలో వున్నప్పుడు పురాతన మతాలన్నింటినీ క్రైస్తవ మతం త్రోసి రాజన్నది. 18వ శతాబ్దంలో క్రిస్టియన్ భావాలు హేతువాద భావాలకు దాసోహమన్నప్పుడు ఫ్యూడల్ సమాజం ఆనాటి విప్లవాత్మకమైన బూర్జువా వర్గంతో ప్రాణాలు వీడేవరకు యుద్ధంచేసింది. మతైక స్వాతంత్ర్యం అంతఃకరణ స్వాతంత్ర్యం, యీ రెండు భావాలూ విజ్ఞాన సామ్రాజ్యంలోని స్వేచ్ఛాయుతమైన పోటీనే వ్యక్త పరిచాయి.

''మతైక, నైతిక, తాత్విక, న్యాయశాస్త్ర భావాలు చారిత్రకాభివృద్ధి గమనంలో మార్పుచెందుతూ వచ్చాయనడం నిస్సందేహమైన విషయం. ఐనా మతం, నీతి, తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, న్యాయశాస్త్రం యివన్నీ కూడా పైమార్పును నిరంతరమూ తట్టుకొనే జీవించి వున్నాయి.

''ఇవేకాకుండా, సమాజపరిణామ అవస్థలన్నిటికీ సామాన్యమైన స్వేచ్ఛ, న్యాయం మొదలైనటువంటి శాశ్వత సత్యాలు కూడా ఉన్నాయి. కాని వాటిని కొత్త పునాదులపై నిర్మాణం చేసే బదులు కమ్యూనిజం శాశ్వత సత్యాలను, రద్దుచేస్తుంది, మతాన్నే రద్దుచేస్తుంది, నీతినంతనీ రద్దుచేస్తుంది కాబట్టి కమ్యూనిజం గత చారిత్రక అనుభవాన్నంతటినీ కాదంటూ వ్యవహరిస్తుంది'' అని కొందరు అనవచ్చు.

ఈ నేరారోపణ సరాంశం ఏమిటి? వివిధ శకాలలో విభిన్న రూపాలను ధరించిన వర్గవైషమ్యాల అభివృద్ధి గతంలోని మొత్తం సమాజయొక్క వర్గవైషమ్యాల చరిత్రలోనే వుంది.

కాని ఇవి ఏయే రూపాలను ధరించినప్పటికీ ఒక వాస్తవ విషయం మాత్రం గత యుగాలన్నిటికీ సామాన్యంగా ఉంది; ఆ వాస్తవాంశం ఏమిటంటే సమాజంలోని ఒక భాగం మరొక భాగాన్ని దోచుకోవడం. కాబట్టి గతయుగాలలోని వర్గచైతన్యం, అది ఎంత బహుళత్వాన్నీ, విభిన్నత్వాన్నీ, ప్రదర్శించినప్పటికీ, వర్గవైషమ్యాలు సంపూర్ణంగా అదృశ్యమైతే గాని పూర్తిగా అంతర్ధానం కాజాలని కొని నిర్దిష్టములైన రూపాలు, లేదా సాధారణ భావాల పరిధిలోనే కదలడంలో ఆశ్చర్యమేమీ లేదు.

సాంప్రదాయకంగా వస్తున్న ఆస్తి సంబంధాలతో ఆమూలాగ్రంగా తెగతెంపులు చేసుకోనే ధోరణులలో అత్యంత అతివాద ధోరణే కమ్యూనిస్టు విప్లవం; కమ్యూనిస్టు విప్లవాభివృద్ధి సాంప్రదాయకంగా వచ్చే భావాలతో ఎట్టి అవశేషాలూ కూడా లేకుండా సంపూర్ణంగా

తెగతెంపులు చేసుకోవడంలోనే ఉండడంలో ఏమాత్రం ఆశ్చర్యమా ఉండనవసరం లేదు.

కమ్యూనిజం విషయమై బూర్జువావర్గం చేసే ఆరోపణలకు యింతటితో స్వస్తి చెబుదాం.

కార్మిక వర్గం లేవదీసే విప్లవంలో మొట్టమొదటి అడుగు శ్రామికవర్గాన్ని పాలకవర్గపు స్థితికి పైకి తీసుకురావడమనీ, ప్రజాస్వామ్యంకొరకు చేసే యుద్ధంలో విజయాన్ని చేపట్టడమనీ పైన గమనించాం.

శ్రామికవర్గం తన రాజకీయ ఆధిపత్యాన్ని, పెట్టుబడినంతటినీ బూర్జువావర్గం నుండి దశలవారీగా లాక్కోవడానికీ, ఉత్పత్తిసాధనాలన్నిటినీ ప్రభుత్వహస్తాలలో, అంటే పాలక వర్గంగా సంఘటితపడిన శ్రామిక వర్గ హస్తాలలో కేంద్రీకరించడానికీ, ఉత్పాదక శక్తుల మొత్తం రాశిని సాధ్యమైనంత త్వరితగతినివృద్ధి చేయడానికీ ఉపయోగించుతుంది.

ఆరంభదశలో, ఆస్తిహక్కులపైనా, బూర్జువా ఉత్పత్తి పరిస్థితులపైనా నిరంకుశంగా దాడిచేయవలసి వుండడం సహజమే; కాబట్టి, ఆర్థికంగా చాలనివిగానూ, సమర్థింప వీలులేనివిగానూ అగపడే చర్యలు తీసుకోవలసినప్పటికీ ఉద్యమం నడుస్తున్న కొద్దీ పాత సమాజిక వ్యవస్థపై తమంతటతామే అవి అతిశయించి, యింకా కొన్ని దాడులు అవసరమయేటట్లు చేసి ఉత్పత్తి విధానంలో పూర్తిగా విప్లవం తేవడానికి అవి తప్పనిసరి అవుతాయి.

ఈ చర్యలు భిన్నభిన్న దేశాలలో భిన్నభిన్నంగా ఉండడం సహజమే.

ఐనప్పటికీ, బాగా పురోగమించిన దేశాలలో యీ దిగువ పేర్కొన్నవి సర్వసాధారణంగా అన్వయింపబడవచ్చును.

1. భూమిపైగల సొంత ఆస్తి రద్దు, భూమిపై వచ్చే శిస్తులన్నిటినీ ప్రజోపయోగాల కొరకై వినియోగము.

2. వృద్ధిక్రమానుసారంగానో, లేక తరగతి క్రమానుసారంగానో హెచ్చయే భారమైన ఆదాయపు పన్ను విధింపు.

3. వారసత్వపు హక్కు పూర్తి రద్దు.

4. ఇతర దేశాలకు వలసపోయేవారి ఆస్తులూ, తిరుగుబాటు చేసినవారి ఆస్తులూ జప్తు.

5. రాజ్యాంగయంత్రంయొక్క ప్రత్యేకమైన గుత్తాధిపత్యంతోనూ పెట్టుబడితోనూ, జాతీయ బ్యాంకుద్వారా రాజ్యాంగయంత్రం చేతిలోనే పరపతి కేంద్రీకరణం.

6. రాకపోకలు రవాణాసాధనాలూ రాజ్యాంగయంత్రం చేతిలో కేంద్రీకరణం.

7. రాజ్యాంగయంత్రంయొక్క సొంత స్వామ్యమైనట్టి ఫ్యాక్టరీలూ ఉత్పత్తి సాధనాలూ విస్తృతపరచడం, సాధారణంగా ఉమ్మడి పథకం ప్రకారం బంజరు భూములను సాగులోకి తీసుకురావడం భూములను మెరుగుపరచడం.

8. అందరూ శ్రమించవలసిన బాధ్యను వహించడం. పారిశ్రామిక సైన్యాలను ముఖ్యంగా వ్యవసాయంకొరకు స్థాపించడం.

9. సరకులను ఉత్పత్తి చేసే పరిశ్రమలనూ వ్యవసాయాన్నీ మేళవించడం; జనాభాను దేశమంతటా ఎక్కువ సమత్వంతో పంపకం చేయడంద్వారా పట్టణాలకీ పల్లెలకూ వున్న తేడాను క్రమక్రమేణా అంతరింపజేయడం.

10. పిల్లలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య. ప్రస్తుత రూపంలో ఫ్యాక్టరీలలో పిల్లలచే పనిచేయించే విధానం రద్దు. విద్యను పారిశ్రామికోత్పత్తితో మేళవించడం, వగైరా, వగైరా.

అభివృద్ధి జరుగుతూన్న కాలంలో వర్గభేదాలు అంతరించి పోయినప్పుడూ, మొత్తం జాతి అనే అపారమైన సంఘం చేతిలో ఉత్పత్తి యావత్తూ కేంద్రీకృతమైనప్పుడూ ప్రభుత్వశక్తి తన రాజకీయస్వభావాన్ని పోగొట్టుకుంటుంది. అసలు న్యాయంగా రాజకీయశక్తి అని పిలువబడేది మరొక వర్గాన్ని అణచివుంచేటందుకు కేవలం ఒక వర్గంయొక్క నిర్మాణయుతమైన శక్తి. శ్రామిక వర్గం బూర్జువావర్గంతో పోరాడుతున్నప్పుడూ పరిస్థితుల కొద్దీ విధిలేక ఒక వర్గంగా సంఘటితపడవలసి వచ్చినప్పుడూ విప్లవ మార్గాన శ్రామిక వర్గం తానే పాలక వర్గంగా మారినట్లైతేనూ, అలా పాలక వర్గంగా మారిన శ్రామిక వర్గం బలప్రయోగంవల్ల పాత ఉత్పత్తి విధానాలను తుడిచిపెట్టేసి నప్పుడూ, అప్పుడు, ఈ పరిస్థితులతోపాటుగా పాత ఉత్పత్తి విధానాలతోపాటే వర్గాలూ వర్గవైషమ్యాలు నిలిచి వుండడానికి అవసరమయే పరిస్థితులనూ, సాధారణంగా వర్గాలు ఉండే పరిస్థితులనూ తుడిచిపెట్టేసి, ఇక తద్వారా ఒక వర్గంగా అది తన సొంత ఆధిపత్యాన్నే అంతం చేసివేసుకుంటుంది.

వర్గాలనూ వర్గవైషమ్యాలనూ కలిగి వున్న పాత బూర్జువా సమాజం స్థానే ప్రతి వ్యక్తియొక్క స్వేచ్ఛాభివృద్ధి అందరి స్వేచ్ఛాభివృద్ధికీ ఆధారమైయేట్టి సమాజం మనకు ఏర్పడుతుంది.

# III. సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం

## 1. అభివృద్ధినిరోధక సోషలిజం

### ఎ. ఫ్యూడల్ సోషలిజం

ఫ్రాన్సు, ఇంగ్లండు దేశాలలోని రాచవర్గాలు తమ చారిత్రకస్థానాన్ని బట్టి ఆధునిక బూర్జువా సమాజానికి ప్రతికూలంగా పాంఫ్లెట్లు రాయడం ఒక వృత్తిగా పెట్టుకున్నారు. 1830 జులై నెల ఫ్రెంచి విప్లవమప్పుడూ, ఇంగ్లండులో సంస్కరణల ఆందోళనప్పుడూ యీ రాచవర్గాలవారు తాము ద్వేషించినట్టి చెడ్రబతికిన ఉద్యమం యెదుటే మళ్లీ తల వొగ్గవలసివచ్చింది. అప్పటినుండీ తీవ్రమైన రాజకీయ పోరాటమనే ప్రశ్నకే అవకాశం లేకుండా పోయింది. ఒక్క సాహిత్యసమరం మాత్రమే సాధ్యంగా కనపడింది. ఐనా యీ సారస్వత రంగంలో కూడా రాజత్వపునరుద్ధరణ కాలం* నాటి పాత పదాలు అసంభవమై పోయాయి.

ఈ రాచవర్గాలు సానుభూతిని సంపాదించుకొనేందుకని తమ స్వప్రయోజనాలను స్పష్టంగానే అవతలకు నెట్టవలసివచ్చింది. దోపిడీకి గురి అవుతూన్న ఒక్క కార్మికవర్గం యొక్క ప్రయోజనాలకోసమనే బూర్జువావర్గానికి ప్రతికూలంగా వ్యవహరించవలసి వచ్చింది.

---

* ఈ రాజత్వపునరుద్ధరణ 1660నుండి 1689వరకూ సాగిన ఇంగ్లండులోని రాజత్వపునరుద్ధరణ కాదు. ఇది 1814నుండి 1830వరకూ సాగిన ఫ్రెంచి రాజత్వపునరుద్ధరణ. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

ఈవిధంగా రాచవర్గాలు తమ కొత్త యజమానిని గేలిచేసే పాటలనుపాడీ, రానున్న విపత్తు గురించి యజమాని చెవిలో దుష్టమైన జోస్యం చెప్పుతూ తమ పగను సాధించుకున్నాయి.

ఫ్యూడల్ సోషలిజం యీవిధంగా సగం ఏడుపూ సగం ఎగతాళితోనూ, సగం గతాన్ని ప్రతిధ్వనించడం, సగం భవిష్యత్ మహోపద్రవాల గురించి భీతావహం కల్గించడంగానూ తలయెత్తింది; ఒక్కొక్కప్పుడు యీ ఫ్యూడల్ సోషలిజం బూర్జువావర్గం హృదయాంతరాళంలో దూసుకు పోయేట్టు బాధాకరమైన, చమత్కారమైనట్టి మనసు చివుక్కుమనేటట్టి విమర్శలే చేసినప్పటికీ ఆధునిక చరిత్ర పురోగమనంను అసలే అర్థం చేసుకోలేకపోవడం వల్ల వీటి ఫలితమెప్పుడూ నవ్వు పుట్టించడంతోనే సరిపోయేది.

రాచవర్గంవారు ప్రజలను తమవైపుకు కూడదీసుకొనేందుకని పతాకం బదులు శ్రామిక వర్గపు బిచ్చాటనపు జోలిని ముందు ఎత్తి పట్టుకునేవారు. కాని ప్రజ తరచూ వీరితో చేతులు కలిపినప్పటికీ కూడా, ఎప్పటికప్పుడు, యీ రాచవర్గంవారిపృష్ఠ భాగానవున్న పాత ఫ్యూడల్ వంశావళి చిహ్నాలను కనిపెట్టి పెద్దగానూ భయభక్తులు లేకుండానూ నవ్వుతూ వారిని వదిలిపెట్టేసి వచ్చేసేవారు.

"ఫ్రెంచి లెజిటిమిస్టుల"[6]లో ఒక భాగానికి చెందిన వారూ, "యంగ్ ఇంగ్లండ్"[7] సంఘీయులలో ఒక భాగానికి చెందిన వారూ ఈ నాటకమాడారు.

ఫ్యూడలిస్టులు తమ దోపిడీ విధానం బూర్జువా దోపిడీకి విధానానికి ఏవిధంగా భిన్నంగా వుందో వ్రేలుపెట్టి చూపుతూ, తాము దోపిడీ చేసిన పరిస్థితులకూ విధానాలకూ యీ నాటి పరిస్థితులకూ విధానాలకూ ఎంతో భేదం వున్నదన్న సంగతే, అవి యీనాడు పాత పడిపోయాయన్న సంగతే మరచి పోతారు. తాము పాలించే రోజుల్లో ఆధునిక శ్రామిక వర్గం అసలు ఎన్నడూ ఉండేదే కాదని వీరు తెలుపుతూ, తమ సమాజ రూపంనుండే ఆధునిక బూర్జువావర్గం విధిగా జన్మమెత్తి తీరిందన్న సంగతిని వారు మరచిపోతారు.

బూర్జువావర్గానికి వ్యతిరేకంగా తాము చేస్తూన్న విమర్శయొక్క అభివృద్ధినిరోధక స్వభావాన్ని ఎంతగా దాచుకోవడంలేదంటే, బూర్జువావర్గంయెడల వీరు ఆరోపించుతూన్న నేరంయొక్క సారమంతా బూర్జువా పాలన విధానంకింద పాత సామాజిక వ్యవస్థను కూకటి వ్రేళ్లతో విధికృతంగా పెళ్లగించితీరే ఒక వర్గం అభివృద్ధి చెందుతోందనడం కిందకి దిగిపోతూందని చెబితే అక్కడికి సరిపోతుంది.

వీరు బూర్జువావర్గాన్ని తప్పుపట్టడానికి కారణం ఆ వర్గం శ్రామిక వర్గాన్ని సృష్టించిందని కాదు. అది విప్లవకరమైన శ్రామిక వర్గాన్ని సృష్టించిందనే.

కాబట్టి వీరు రాజకీయ కార్యాచరణలో కార్మిక వర్గాన్ని నిర్బంధించే చర్యలన్నిటి లోనూ చేతులుకలుపుతారు; వీరుపైకి ఎంత పదాడంబరంతో మాట్లాడినా మామూలు జీవితంలో మాత్రం పరిశ్రమ అనే చెట్టునుండి నేల రాలిన బంగారు ఆపిలు పండ్లను ఏరు కోవడానికి నీచంగా ముందుకు వంగుతూ, తమ వున్ని, బీట్‌రూట్-పంచదార, బంగాళ దుంపసారా వ్యాపారాల కోసమని సత్యాన్నీ, ప్రేమనీ, గౌరవాన్నీ కుదువపెట్టుతున్నారు.*

ఏవిధంగా క్రైస్తవ మతగురువు భూస్వామితో చెట్టా పట్టాలు వేసుకుని ఎల్లప్పుడూ తిరుగుతూ వుంటాడో ఆవిధంగా ఫ్యూడల్ సోషలిజంతో క్రైస్తవ సోషలిజం కూడా బుజా బుజాలు రాసుకుంటూ తిరుగుతూంది.

కిరస్తానీ వైరాగ్యానికి సోషలిస్టు రంగు పూయడం కంటే సులభమైన పని వేరొకటి వుండదు. సొంత ఆస్తికి వ్యతిరేకంగా, వివాహానికి వ్యతిరేకంగా, రాజ్యాంగయంత్రానికి వ్యతి రేకంగా క్రైస్తవమతం బోధించలేదా? వీటిస్థానే దానం, దారిద్ర్యం, బ్రహ్మచర్యం, శరీర శోషణం, మఠ జీవనం, చర్చినే దైవతుల్యంగా ఆరాధించడం బోధించలేదా? రాచవర్గంవారి హృదయవేదనలను భగత్సేవార్థం కైంకర్యం చేయడానికి మతగురువు వినియోగించే సాక్షాత్ పవిత్ర జలమే క్రైస్తవ సోషలిజం.

## బి. పెట్టీబూర్జువా సోషలిజం

బూర్జువావర్గంచే నాశనమైనవర్గం కేవలం ఫ్యూడల్ రాచవర్గమే కాదు; ఆధునిక బూర్జువా సమాజంయొక్క వాతావరణంలో కృశించి నిర్మూలమైపోయింది ఒక్క ఫ్యూడల్ రాచవర్గమేకాదు. మధ్యయుగాలలోని రక్షిత పౌరులు, చిన్నచిన్న రైతు ఖామందులే ఆధునిక

---

* ఇది ముఖ్యంగా జర్మనీకి వర్తిస్తుంది. అక్కడ రాచకుటుంబాలకూ, భూస్వాము లకూ, జమీందారులకూ పెద్దపెద్ద జమీలు వున్నాయి. ఆ జమీలను తమ తరఫున మేనే జర్లచే సేద్యం చేయించుకుంటూ, అపారంగా బీట్‌రూట్-పంచదారను తమ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేస్తున్నారు, కాగా బంగాళదుంపలతో సారాను తయారు చేసే సారాబట్టీలు వీరికు న్నాయి. వీరికంటే ధనికులైన బ్రిటిష్ రాచవర్గంవారు యీ వ్యాపారానికింకా దిగలేదు; ఐనా తమ పేర్లను దాదాపు అనుమానాస్పదాలైన జాయింట్-స్టాక్ కంపెనీస్థాపకులకు బదు లివ్వడం ద్వారా తగ్గిపోతూ వున్న తమ శిస్తు ఆదాయాన్ని ఏవిధంగా పూడ్చుకోవాలో వీళ్లకి కూడా తెలుసు. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

బూర్జువావర్గం ఆగమనసూచకులు. పారిశ్రామికంగానూ వాణిజ్య రీత్యానూ ఏ కొద్దిగానో అభివృద్ధిచెందిన దేశాల్లో యీ రెండు వర్గాలూ క్రమంగా పైకి తలయెత్తుతున్న బూర్జువావర్గం పక్కపక్కల్నే అస్తుబిస్తుగా కాలంక్షేపంచేస్తూనే వున్నాయి.

ఆధునిక నాగరికత సంపూర్ణంగా వృద్ధి చెందిన దేశాల్లో అటుశ్రామిక వర్గానికీ యిటు బూర్జువా వర్గానికీ చెందక మధ్య ఊగిసలాడుతూ, బూర్జువావర్గంకు అనుబంధ భాగంగా వుంటూ ఎప్పటికప్పుడు పునస్సృష్టి అవుతూన్న పెట్టీబూర్జువా అనే ఒక కొత్త వర్గం రూపొందింది. అయితేనేం ఈ వర్గంలోని వ్యక్తిగత సభ్యులు మాత్రం పోటీ ప్రక్రియ ఫలితంగా నిరంతరం శ్రామికవర్గంలోకి దభాలున త్రోసివేయబడుతూ, ఆధునిక పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఆధునిక సమాజంలో తామొక స్వతంత్ర విభాగంగా సంపూర్ణంగా అదృశ్యమయ్యే క్షణం సమీపిస్తోందని ఫ్యాక్టరీలలోనూ, వ్యవసాయంలోనూ, వాణిజ్యంలోనూ తమస్థానే మేస్త్రీలు, ఎస్టేటు మేనేజర్లు, షాపు గుమాస్తాలు ప్రవేశిస్తారని స్వయంగా తెలుసుకోగలుగుతున్నారు కూడా.

సగం జనాభాకంటే అధికంగా వున్న రైతాంగంను కలిగిన ఫ్రాన్సువంటి దేశాల్లో బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గపక్షాన నిలచిన రచయితలు బూర్జువావర్గం పాలన విధానంపై చేసే తమ విమర్శలలో పేద రైతాంగం, పెట్టీబూర్జువా, యీ రెండు వర్గాల ప్రమాణాలనే ఉపయోగించి వుండడమూ ఈ నడిమి వర్గాల దృక్స్థానంనుండి కార్మిక వర్గపక్షం వహించి వుండడమూ సహజమే. ఈవిధంగా పెట్టీబూర్జువా సోషలిజం తలెత్తింది. ఈ పెట్టీబూర్జువా సోషలిస్టు పంథాకి ఫ్రాన్సులోనే కాకుండా ఇంగ్లండులో కూడా సిస్మోండి నాయకత్వం వహించాడు.

ఈ సోషలిస్టుపంథా ఆధునిక ఉత్పత్తి విధానంలోని వైరుధ్యాలను అత్యంత సూక్ష్మబుద్ధితో వేర్వేరు భాగాలుగా విడగొట్టి చూపించింది. కపటబుద్ధితో క్షమాపణలు వేడుకొన్న అర్థశాస్త్రజ్ఞుల గుట్టును నగ్నంగా బైటపెట్టింది. యంత్రాలవల్లా శ్రమ విభజనవల్లా, పెట్టుబడీ భూమీ ఏకొద్దిమంది చేతుల్లోనో కేంద్రీకృతమవడంవల్లా, అధికోత్పత్తీ సంక్షోభాలవల్లా ఏలాంటి వినాశకరమగు ఫలితాలు కలుగుతాయో నిర్వివాదంగా రుజువు చేసింది; పెట్టీబూర్జువా, రైతూ ఏనాటికైనా విధిగా నాశనమై తీరుతారనీ, శ్రామికవర్గంయొక్క దౌర్భాగ్యాన్నీ, ఉత్పత్తి విధానంలోని అరాచకాన్నీ, భాగ్యసంపదల పంపకంలోని కొట్టొచ్చేటట్టు కనిపిస్తూన్న అసమానత్వాలనీ, జాతులమధ్య తలయెత్తే దుంపనాశనం కలిగించే పారిశ్రామిక యుద్ధాలనీ, పూర్వపు నైతిక సంబంధాలూ పూర్వపు కుటుంబ సంబంధాలూ పూర్వపు జాతులూ, వీటి విధ్వంసనాన్నీ స్పష్టంగా పేర్కొంది.

ఏమైతేనేం ఈ సోషలిజంయొక్క రూపం పాత ఉత్పత్తి సాధనాలనీ పాత మారకపు విధానాలనీ, వాటితో పాటే పూర్వపు ఆస్తి సంబంధాలనీ పాత సమాజాన్నీ పునరుద్ధరించాలనో, లేదా ఆధునిక ఉత్పత్తి సాధనాలనీ, ఆధునిక మారకపు విధానాలనీ ఈ సాధనాలవల్లనే అదివరకే బద్దలైపోయినట్టీ, బద్దలై తీరవలసినట్టీ పాత ఆస్తిసంబంధాల చట్రంలోనే ఇరికించి యిమడ్చాలని ఆశిస్తుంది. ఈ పై రెండు విషయాల్లోనూ యిది అభివృద్ధి నిరోధకమూ ఊహాజనితమూనూ.

దీని చిట్టచివరి మాటలు యివి: పరిశ్రమలకోసమని శ్రేణులు, వ్యవసాయంలో పితృస్వామిక సంబంధాలు.

తుట్టతుదకు ఆత్మవంచనవల్ల కలిగిన ఉన్మత్త ఫలితాల నన్నింటినీ మొండి చారిత్రక సత్యాలు వదలగొట్టిన తర్వాత యీ సోషలిజంయొక్క రూపం పిరికితనపు ఏడుపుతోనూ మైత్రతోనూ అంత మొందింది.

## సి. జర్మన్ సోషలిజం, లేక "యథార్థమైన" సోషలిజం

అధికారంలో ఉన్న బూర్జువావర్గం వొత్తిడివల్ల ఉద్భవించినట్టీ, యీ వర్గంపై జరుగుతూన్న పోరాటాన్నీ వ్యక్తపరుస్తూన్నట్టీ ఫ్రాన్సులోని సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం, జర్మనీలో బూర్జువావర్గం ఫ్యూడల్ నిరంకుశత్వంతో పోరాటాన్ని ఎప్పుడైతే ప్రారంభించిందో సరిగ్గా అదే సమయంలో ఆ దేశంలో ప్రవేశపెట్టబడింది.

జర్మన్ తత్వవేత్తలూ, తత్వవేత్తలౌదామనుకొన్న వారూ, హాస్య రచయితలూ ఈ సారస్వతాన్ని ఆత్రతతో లంకించుకున్నారే గాని వారు, యీ సారస్వతం ఫ్రాన్సునుండి జర్మనీకి వలసపోయినప్పుడు యీ సారస్వతంతోపాటే ఫ్రెంచి సమాజిక స్థితులు వలసపోలేదన్న సంగతిని ఏమరిచారు. ఈ ఫ్రెంచి సారస్వతం జర్మన్ సాంఘిక పరిస్థితులతో సంపర్కం కలిగిన పరిస్థితిలో అది తన తక్షణ కార్యాచరణ ప్రాముఖ్యత నంతటినీ కోల్పోయి పూర్తిగా సాహిత్య స్వభావాన్ని మాత్రమే ధరించింది. ఈవిధంగా ప్రథమ ఫ్రెంచి విప్లవం యొక్క కోర్కెలు పద్దెనిమిదవ శతాబ్దపు జర్మన్ తత్వవేత్తలకు సామాన్యంగా "ఆచరణ యోగ్యహేతువాదం" కంటే అధికమేమీకాదని అనిపించి, విప్లవకరమైన ఫ్రెంచి బూర్జువావర్గ అభీష్టంయొక్క వాక్కులు యీ జర్మన్ తత్వవేత్తల దృష్టిలో స్వచ్ఛ అభీష్ట నియమాలుగానే, అభీష్టం ఎలావుండితీరవలసిందో అలాంటి అభీష్టంయొక్క సూత్రాలుగానే యథార్థ మానవ అభీష్టంయొక్క నియమాలుగానే అగుపించాయి.

ఈ కొత్త ఫ్రెంచి భావాలను తమ ప్రాచీన తాత్విక చైతన్యంతో మేళవించడానికే జర్మన్ పండిత వర్గంవారు కేవలం పాటు పడ్డారు; లేదా మరోవిధంగా చెప్పాలంటే వీరు తమ స్వయం తాత్విక దృక్స్థానాన్ని విడిచిపెట్టకుండానే యీ ఫ్రెంచి భావాలను తమ సిద్ధాంతాలతోపాటు అలవరచుకోవాలని చూశారు.

ఒక విదేశ భాషను అలవరచుకునే విధంగానే, అంటే ఆ భాషను తర్జుమాచేయడమనే పద్ధతిలోనే, ఈ అలవరచుకోవడం జరిగింది.

క్రైస్తవ సన్న్యాసులు పూర్వకాలపు హీదెన్ల పురాణగ్రంథాల వ్రాతప్రతులమీద కాథలిక్ పావనపురుషుల వెర్రిమొర్రి జీవిత చరిత్రలను ఏవిధంగా లిఖించిందీ అందరికీ తెలిసిన విషయమే. జర్మన్ పండితులు యీ పద్ధతిని లౌకికపు ఫ్రెంచి సారస్వతం యెడల తలక్రిందులు చేశారు. ఫ్రెంచి మాతృకకింద తమ తత్వశాస్త్రపు వెర్రిమొర్రి భాషణనంతా రాశారు. ఉదాహరణకు ద్రవ్యంయొక్క ఆర్థిక వ్యాపారాలపై ఫ్రెంచి రచయితలు చేసిన విమర్శకింద "మానవత్వపరిత్యాగం" అని రాశారు, పోతే బూర్జువా రాజ్యాంగయంత్ర విషయమైన ఫ్రెంచి విమర్శకింద "సాధారణత్వవర్గ పదవీభ్రష్టత" అని వీరు రాశారు.

వీరు ఫ్రెంచి చారిత్రక విమర్శలకు వెనకాతల ఈ తత్వశాస్త్రీయ వాక్యాల ప్రవేశానికి "కార్యాచరణ తత్వశాస్త్రం," "యథార్థమైన సోషలిజం," "జర్మన్ సోషలిస్టు శాస్త్రం," "సోషలిజంయొక్క తత్వశాస్త్రీయ పునాదులు", యింకా యిలాంటి పేర్లనే పెట్టారు.

ఈవిధంగా జర్మన్ రచయితలు ఫ్రెంచి సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతాన్ని నిర్వీర్యంచేసేశారు. జర్మనీవాడి చేతిలో ఈ సాహిత్యం ఒక వర్గం మరొక వర్గంపై చేసే పోరాటాన్ని వ్యక్తంచేసేదిగా లేనందున "ఫ్రెంచివాడి పాక్షిక దృష్టి"ని అధిగామించి, యథార్థ అవసరాలను కాకుండా, యథార్థంయొక్క అవసరాలను తెలియచేస్తున్నట్టు; శ్రామికవర్గ ప్రయోజనాలను కాకుండా మానవస్వభావ ప్రయోజనాలనూ, ఏ వర్గానికీ చెందని, వాస్తవికతలేని, కేవలం తాత్విక అభూతకల్పనా అస్పష్ట జగత్తులో జీవించే అనిర్దిష్టమైన మానవుని ప్రయోజనాలనూ తాము తెలియచేస్తున్నట్టు భావించాడు.

ఈ జర్మన్ సోషలిజం ఈ బడిపిల్లకాయ సాధకాన్ని మనస్ఫూర్తిగానూ పవిత్రంగానూ చేపట్టి తన నాసి సరకులను సంతలో అమ్మేవాళ్లలాగున అతిగా స్తుతించుకుంటూండగా యీలోగా అది తన పండితభిషక్కుల అమాయకత్వాన్ని క్రమక్రమేణా కోల్పోయింది.

ఫ్యూడల్ రాచవర్గంతోనూ నిరంకుశ రాచరికంతోనూ, జర్మన్ బూర్జువావర్గం, ముఖ్యంగా ప్రష్యన్ బూర్జువావర్గం సలిపిన పోరాటం, వేరే మాటల్లో చెప్పాలంటే లిబరల్ ఉద్యమం, ఇంతకంటె ఎక్కువ దీక్షతో పనిచేయ మొదలెట్టింది.

ఇందువల్ల సోషలిస్టు కోర్కెలతో రాజకీయ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికీ, లిబరలిజం, ప్రజా ప్రతినిధులచే ఏర్పడిన ప్రభుత్వం, బూర్జువా పోటీ, బూర్జువా పత్రికా స్వాతంత్ర్యం, బూర్జువా శాసననిర్మాణం, బూర్జువా స్వాతంత్ర్యం, సమానత్వం, వీటన్నిటికీ వ్యతిరేకంగా సాంప్రదాయకమైన శాపనార్థాలను కురిపించడానికీ, యీ బూర్జువా ఉద్యమం వల్ల ప్రజలకు అంతా నష్టమేగాని లాభం ఏమీ చేకూరదని అశేషప్రజానీకంలో ప్రచారం చేయడానికీ ఎంతో కాలంనుండి ఎదురుచూస్తున్నట్టి అవకాశం ఇప్పుడు "యథార్థమైన" సోషలిజానికి చిక్కింది. ఫ్రెంచి విమర్శ, దేనియొక్క తెలివిమాలిన ప్రతిధ్వనే జర్మన్ సోషలిజమో అట్టి ఫ్రెంచి విమర్శ, ఆధునిక బూర్జువా సమాజం, దానికి జతయైన ఆర్థిక అస్తిత్వపరిస్థితులు, తదనుగుణంగా నిర్మాణమైన రాజ్యాంగ నిర్మాణమూ, జర్మనీలో జరగనున్న పోరాటం సాధించ వలసిన అసలు ధ్యేయాలైన యివన్నీ అంతకుముందే ప్రాదుర్భవించినట్టు అనుకున్నదన్న సంగతి జర్మన్ సోషలిజం, సరిగ్గా అసలువేళకే మరచిపోయింది.

మతగురువులు, ప్రొఫెసర్లు, జమీందార్లు, ఉద్యోగులు, అనుచరులుగాగల నిరంకుశ ప్రభుత్వాల మీదకు లేచివస్తూ బెదరించుతూన్నట్టి బూర్జువా వర్గానికి ప్రతికూలంగా అవసరానికి సిద్ధంగా ఉపయోగపడే దిష్టిబొమ్మవలె ఇది ఉపయోగపడింది.

అదే సమయంలో సరిగ్గా యీ నిరంకుశ ప్రభుత్వాలే జర్మన్ కార్మికవర్గం తిరుగుబాట్లవ్యాధిని అణచడానికై వుపయోగించిన కొరడా దెబ్బలూ తుపాకీ కాల్పులూ అనే చేదు మాత్రలతర్వాత ఇది మధుర సమాప్తి అనిపించింది.

ఈవిధంగా "యథార్థమైన" సోషలిజం ఒకవైపు జర్మన్ బూర్జువావర్గంతో పై నిరంకుశ ప్రభుత్వాలు జరిపే పోరాటంలో ఒక ఆయుధంగా ఉపయోగపడి, మరోవైపు అదే సమయంలో అభివృద్ధి నిరోధకుల ప్రయోజనాలకు, అంటే జర్మన్ ఫిలిస్టైన్ల ప్రయోజనాలకు ప్రత్యక్షంగా ప్రాతినిధ్యం వహించింది. జర్మనీలో పదహారవ శతాబ్ద గతావశేషంగా మిగిలినట్టీ, ఆ నాటి నుండీ కూడా వివిధ రూపాలలో తరచూ తలయెత్తుతూ వున్నట్టీ, పెట్టీ బూర్జువావర్గం, ప్రస్తుత పరిస్థితులకు అసలైన సాంఘిక పునాదిగా వుంది.

ఈ వర్గాన్ని భద్రపరచడమంటే ప్రస్తుతం జర్మనీలో వున్న పరిస్థితులను భద్రపరచడమన్నమాట. బూర్జువావర్గంయొక్క పారిశ్రామిక రాజకీయ ఆధిపత్యం ఒక వైపున పెట్టుబడి సాంద్రీకృతమవడంవల్లనూ మరోవైపున విప్లవకరమైన శ్రామిక వర్గం పైకి లేవడంవల్లనూ యీ పెట్టీబూర్జువావర్గంను తప్పనిసరిగా నాశనంచేస్తానని బెదరించుతుంది. "యథార్థమైన" సోషలిజం యీ రెండు పిట్టల్నీ ఒక రాయితో చంపనున్నట్లు అగుపించింది. అది ఒక మహామారివలె వ్యాపించింది.

జర్మన్ సోషలిస్టులు తమ "శాశ్వత సత్యాలు" అనే అందవికారమైన అస్థిపంజరంపై తొడిగిన ఈ తాత్విక దుస్తులు, జుగుప్సాకర భావలోలత్వ తుషారతృప్తమైన వాక్చాతుర్యాలనే పూలతో అల్లినట్టి తత్వశాస్త్రంతో తయారైన సాలెపట్టుదుస్తులు, తమసరుకులు ఈరకం ప్రజల మధ్య ఆశ్చర్యాన్ని కలిగించేటట్టుగా అమ్మకం హెచ్చించేందుకు ఉపయోగపడ్డాయి.

కాగా, పెట్టీబూర్జువా ఫిలిస్టైన్‌ల నిరర్థకపు శబ్దపుష్టిగల ప్రతినిధిలుగా ఉండడమే తన స్వంత వృత్తి అని అంతకంతకు మరింత ఎక్కువగా, తనవంతు జర్మన్ సోషలిజం గుర్తించింది.

జర్మన్ జాతి అన్ని జాతులలోకీ ఆదర్శవంతమైన జాతి అనీ, జర్మన్ పెట్టీ ఫిలిస్టైను మానవజాతికే వర్గ పురుషుడనీ ఇది ప్రకటించింది. ఈ ఆదర్శమానవుడు చేసే ప్రతినైచ్యదుర్మార్గ కార్యానికీ అంతరార్థాలూ చెప్పి దాని నిజమైన స్వభావానికి కేవలం విరుద్ధంగా ఉన్నత సోషలిస్టు భావాలతో కూడిన వాఖ్యానాలు చేసింది. ఇది యిక ఎంత దూరం వరకు వెళ్లిందంటే కమ్యూనిజం ధోరణి "అమానుషంగా నాశన మొనర్చే" ధోరణి అనీ ఆ ధోరణిని తాను సూటిగా వ్యతిరేకిస్తాననీ, వర్గ పోరాటాలన్నిటినీ తాను ఎంతగా వీలౌతుందో అంతగానూ, నిష్పాక్షికంగానూ తృణీకరిస్తాననీ ప్రకటించుకుంది. ఈనాడు (1847) జర్మనీలో వ్యాప్తిలో వున్న సోషలిస్టు, కమ్యూనిస్టు అని చెప్పబడుతూన్న ప్రచురణలన్నీ, ఏకొద్ది మినహాయింపులతోనో తప్ప, యీ అసహ్యమైనట్టీ, దుర్బలత్వాన్ని కలుగచేసేటట్టీ సాహిత్యానికి చెందినవే*.

## 2. సంప్రదాయరక్షక, లేక బూర్జువా సోషలిజం

బూర్జువా సమాజం శాశ్వతంగా ఉండేటట్టు కట్టుదిట్టం చేసేందుకని బూర్జువా వర్గంలోని ఒక భాగం వారు సమాజంలోని కష్టాలను నివారణ చేయాలనే ఉద్దేశంతో వున్నారు.

ఆర్థిక వేత్తలూ, లోకోపకారులూ, జనప్రియులూ, కార్మిక వర్గస్థితిని మెరుగు పరచు

* 1848 నాటి విప్లవ తుపాను యీ అసహ్యమైన ధోరణిని తుడిచిపెట్టేసి, దీని యోధులకు ఇకమీదట సోషలిజంలో నిమగ్నమవ్వాలనే వాంఛా వ్యాధిని కుదిర్చేసింది. ఈ ధోరణియొక్క సాంప్రదాయక వర్గపురుషుడు ప్రధాన ప్రతినిధి హెర్ కారల్ గ్రూన్. [1890 జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

వారూ, జీవకారుణ్య సంఘాల సభ్యులూ, మితమద్యపానోద్యమ ఉన్మాదులూ, ఊహకందే ప్రతి విషయంలోనూ రహస్యంగా పనిచేసే సంస్కర్తలూ, వీళ్లంతా కూడా పైనతెలిపిన భాగానికి చెందినవారే. ఇంతేకాకుండా సోషలిజంయొక్క ఈ రూపం సమగ్ర వ్యవస్థలుగా తయారుచేయబడింది.

ఈ రూపానికి ఉదాహరణగా ప్రూడన్ రాసిన "Philosophie de la Misère"* అనే గ్రంథాన్ని పేర్కొనవచ్చు.

సోషలిస్టు బూర్జువాలు ఆధునిక సమాజిక పరిస్థితులవల్ల కలిగే లాభాలన్నిటినీ ఆ పరిస్థితుల ఫలితంగా తప్పనిసరిగా వచ్చే పోరాటాలూ, ప్రమాదాలూ, లేకుండా మాత్రం ఆకాంక్షిస్తారు. ఈ సమయంలో విప్లవ శక్తులు, వినాశకరమైన శక్తులు మినహా, వీరు ప్రస్తుత సమాజస్థితినే వాంఛిస్తారు. శ్రామికవర్గంలేకుండావున్న బూర్జువావర్గాన్నే వీరు కోరుకుంటారు. బూర్జువావర్గం సహజంగా తన ఆధిపత్యం చలామణీ అయ్యే ప్రపం చమే ఉత్తమోత్తమమైందని వూహిస్తుంది; బూర్జువా సోషలిజం యీ సుఖప్రదమైన భావాన్ని ఇంచుమించు సమగ్రంగా వున్న వివిధ వ్యవస్థలుగా అభివృద్ధి చేసింది. అలాంటి వ్యవస్థలను ఆచరణలో పెట్టమని శ్రామికవర్గాన్నడిగినట్లైతే ఆ వర్గం తిన్నగా నూతన సామాజిక జరూసెలంలోకి పురోగమిస్తుందని ఇది అంటుందే గాని, వాస్తవంగా, శ్రామిక వర్గం నేటి సమాజిక పరిమితులలోనే వుండాలనీ, కాని, బూర్జువాల యెడల శ్రామిక వర్గానికి వున్న ద్వేషపూరితమైన భావాలన్నిటినీ అది తొలిగించుకోవాలనీ ఇది కోరుతుంది.

ఈ బూర్జువా సోషలిజంకంటే ఎక్కువ ఆచరణయుక్తమైనప్పటికీ తక్కువ క్రమ బద్ధమైనట్టి, కార్మికవర్గం దృష్టిలోని ప్రతి విప్లవోద్యమాన్నీ చులకనగా ఎంచుతూ కార్మి కులకు కేవలం రాజకీయ సంస్కరణలవల్ల మాత్రమే ఏమీ ప్రయోజనముండదనీ, వారి భౌతిక పరిస్థితులలో, ఆర్థిక సంబంధాలలో మార్పువస్తేనేగాని వారికేమీ ప్రయోజనముండ దనీ చెప్పే సోషలిజంయొక్క రెండవ రూపం ఒకటుంది. కాని, యీ తరగతి సోషలిజం భౌతిక పరిస్థితులలో మార్పు రావడం అంటే, కేవలం విప్లవంద్వారా సాధ్యపడే బూర్జువా ఉత్పత్తి సంబంధాలను అంతరింపజేయడమనీ ఈ అంతరింపజేయడం కేవలం విప్లవం వల్లనే సాధ్యమౌతుందనీ అసలే అర్థం చేసుకోక, ప్రస్తుతం కొనసాగుతూ వున్న ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదికపై ఏర్పడిన పరిపాలనా విధానంలో ప్రవేశపెట్టే సంస్కరణలేననీ

---

* "దారిద్ర్యంయొక్క తత్వశాస్త్రం". — సం.

భావిస్తుంది; అనగా యీ సంస్కరణలు పెట్టుబడికీ శ్రమకూ మధ్యనున్న సంబంధాలను ఏవిధంగానూ మార్పు చేయవు, గాని మహా చేస్తే, బూర్జువా ప్రభుత్వం ఖర్చును తగ్గించి పరిపాలన పనిని సరళం చేస్తాయన్నమాట.

బూర్జువా సోషలిజం కేవలం ఒక శబ్దాలంకారంగా మారినప్పుడు మాత్రమే, కేవలం అప్పుడే, అది ఉచితమైన అర్థాన్ని సంపాదించుకుంటుంది.

కార్మికుల ప్రయోజనం కొరకే స్వేచ్ఛా వ్యాపారం! కార్మికుల లాభంకొరకే రక్షణ సుంకాలు! కార్మికుల మేలుకొరకే జైళ్ల సంస్కరణ — ఇవే బూర్జువా సోషలిజంయొక్క చివరి మాటలు; ఇవే అది మనఃస్ఫూర్తిగా పలికిన మాటలు.

ఈ మాటలనే క్రోడీకరించి ఒక్క వాక్యభాగంగా చెప్పాలంటే, కార్మికవర్గ ప్రయోజనం కొరకే బూర్జువా బూర్జువాగా వున్నాడు.

## 3. విమర్శనాత్మక-ఊహాజనితమైన సోషలిజం, కమ్యూనిజం

ప్రతి గొప్ప ఆధునిక విప్లవంలోనూ ఎల్లప్పుడూ శ్రామికుల కోర్కెలను సమర్థించిన సారస్వతాన్ని, ఉదాహరణకు బాబెఫ్ మొదలైన వారి రచనలను గురించి మేం యిక్కడ చెప్పడంలేదు.

ఫ్యూడల్ సమాజం కూలద్రోయబడుతున్న కాలంలో, సార్వజనికమైన ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన రోజుల్లో శ్రామిక వర్గం తన కోర్కెల సాఫల్యానికి మొట్టమొదటి సారిగా చేసిన సూటి ప్రయత్నాలు, ఆనాటికి శ్రామిక వర్గం అంతగా అభివృద్ధి చెందని స్థితిలో ఉండడంవల్లనూ, అందుకుతోడు, తన విముక్తికి అవసరమైనట్టి ఆర్థిక పరిస్థితులు అప్పట్లో యింకా ఏర్పడలేకపోయిన కారణానా, బూర్జువావర్గ శకంలో మాత్రమే ఏర్పడడానికి సాధ్యమయ్యేటటువంటి పరిస్థితులవల్లా అవశ్యంగా విఫలమయ్యాయి. శ్రామిక వర్గ ఉద్యమాలలో మొట్టమొదటివి తలయెత్తుతూన్న ఆరంభ దినాలలో వాటిని అనుగమించిన విప్లవ సారస్వతమంతా అవశ్యంగా అభివృద్ధి నిరోధక స్వభావాన్ని కలిగివుండినదే. అది అతి సార్వజనీన సర్వసంగపరిత్యాగాన్నీ అతిమొరటు రూపాన్ని కలిగిన సాంఘిక సమానత్వాన్నీ ఉపదేశించింది.

ఇదివరలో వివరించినట్టు శ్రామిక వర్గానికీ బూర్జువావర్గానికీమధ్య జరిగే పోరాటాలు యింకా అభివృద్ధి చెందక ఆరంభ దశలోనే వున్న కాలంలో ("బూర్జువాలు — శ్రామి

కులు'' అన్న శీర్షికగల భాగాన్ని చూడండి) సెయింట్ సైమన్, ఫోరియర్, ఓవెన్ మొదలైన వారి సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు అని ఉచితరీతిని అనబడదగినట్టివి ఉద్భవించాయి.

ఈ సిద్ధాంతాల స్థాపకులు నిజంగానే వర్గ వైషమ్యాలనూ, ఆనాటి సమాజ రూపంలో వుండినట్టి విచ్ఛేదనమౌతూన్న ఉత్పత్తులనూ ప్రక్రియలనూ నిజంగానే గమనించారు. ఇంకా శైశవ దశలోనే వున్న శ్రామిక వర్గం స్వయంగా ఎటువంటి చారిత్రకమైన చొరవా లేని వర్గంగానూ, స్వతంత్రంగా ఎటువంటి రాజకీయ చలనమూ లేని వర్గంగానూ ఉన్న దృశ్యాన్ని వీరికి ప్రదర్శించింది.

వర్గ వైషమ్యాలు పారిశ్రామికాభివృద్ధితో సమానగతితోనే అభివృద్ధి చెందుతాయి గనక ఆర్థిక పరిస్థితులు శ్రామిక వర్గంయొక్క విముక్తికి అవసరమైన భౌతిక పరిస్థితులను యింకా సృష్టించనట్టుగా వారికి అగపడింది. అందువల్ల వీరు అలాంటి భౌతిక పరిస్థితులను సృష్టించేటట్టి నూతన సామాజిక శాస్త్రాన్నీ, నూతన సామాజిక నియమాలనీ అన్వేషించడం ఆరంభించారు.

వీరి వ్యక్తిగత ఆవిష్కరణప్రక్రియ ముందు చారిత్రక ప్రక్రియ లొంగిపోవలసి వుంది, చారిత్రకంగా సృష్టి అయిన విముక్తి పరిస్థితులు ఊహాకల్పితచోద్యాలైన వాటికి తలవంచాలి, క్రమక్రమమైన అయత్నకృతమైన శ్రామిక వర్గ సంఘటితము, ఈ ఆవిష్కరణుల ప్రత్యేక కల్పితమైన సమాజనిర్మాణానికి లొంగిపోవాలి, అంటారు. వీరి దృష్టిలో భవిష్యత్తు చరిత్ర వీరు ఏర్పరచిన సాంఘిక ప్రణాళిక ప్రచారంగానూ, ఆ ప్రణాళికలను ఆచరణ రీత్యా అమలు జరపడంగానూ రూపొందుతుంది.

తమ ప్రణాళికలను ఏర్పాటు చేసుకొనేప్పుడు, అన్ని వర్గాలలోనూ కార్మిక వర్గమే ఎక్కువ బాధలకు లోనౌతున్నదనీ, ఆ కార్మికవర్గ ప్రయోజనాలనే తాము లక్ష్యంగా పెట్టుతున్నామనీ వీరు ప్రధానంగా జ్ఞాపకం ఉంచుకుంటారు. శ్రామిక వర్గం అన్నివర్గాలకంటే ఎక్కువ బాధపడేవర్గం అవడంచేతనే అది వారి దృష్టిలో కేవలం ఉనికికలిగి ఉంటూంది.

తమ పరిసరాల కారణంగానూ, వర్గపోరాటం యింకా వృద్ధి చెందని స్థితిలో వుండడంవల్లనూ తామే అన్నివర్గ వైషమ్యాలకూ అతీతులమని ఈ రకం సోషలిస్టులు పరిగణించుకుంటారు. సమాజంలోని ప్రతి సభ్యుని స్థితినీ, ఆఖరికి మంచి సంపన్నస్థితిలోవున్న సభ్యుని పరిస్థితిని కూడా బాగుపరచాలని వాంఛిస్తారు. అందువల్లనే వర్గభేదాలను పాటించక మొత్తం సమాజం అంతటికీ నిరంతరమూ విజ్ఞప్తి చేస్తూనేవుంటారు; అంతేకాదు, పాలకవర్గానికి విజ్ఞప్తి చేయడానికే వీరు ఎక్కువగా మొగ్గుతారు. తమ సిద్ధాంతాలను ప్రజలు గనక ఒక సారి అర్థంచేసుకున్నట్లైతే అత్యుత్తమమైన సమాజంయొక్క అత్యుత్తమంగా సాధ్యమయ్యే ప్రణాళిక ఇందులోనే ఉందని ప్రజలు ఏవిధంగా గుర్తించకుండా ఉండగలరు?

అందుకనే వీరు రాజకీయ కార్యాచరణనంతటినీ, ముఖ్యంగా విప్లవకార్యాచరణ నంతటినీ తిరస్కరిస్తారు; తమ ఆశయాలను శాంతి సమ్మతమైన మార్గాలలో సాధించుకోవాలనుకుంటారు. తాము ఉపదేశించే నూతన సమాజనిర్మాణయత్నంకొరకు తప్పనిసరిగా విఫలమైతీరే చిన్నచిన్న ప్రయోగాలద్వారా, తాము స్వయంగా మార్గదర్శకులుగా ఉండడంద్వారా ఈ నూతన సువార్తకు మార్గం సుకరం చేయాలని ఆశిస్తారు.

శ్రామిక వర్గం యింకా ఏమాత్రమూ అభివృద్ధిచెందని దశలోనే ఉన్నసమయంలోనూ, ఆ వర్గం సమాజంలో తన స్థానాన్ని గురించి ఊహాజనితమైన భావాలను కలిగి వున్న సమయంలోనూ చిత్రింపబడిన భవిష్యత్ సమాజంయొక్క ఊహాజనితమైన చిత్రాలు, సమాజం సాధారణంగా పునర్నిర్మాణమవ్వాలనే ఆ వర్గంయొక్క సహజజ్ఞాన ప్రేరేపితమైన ఆశలకు అనుగుణ్యంగానే వుంటాయి.

ఐనా యీ సోషలిస్టు, కమ్యూనిస్టు ప్రచురణల్లో విమర్శయొక్క మూలపదార్థం కూడా ఉంటుంది. ఈప్రచురణలు నేటి సమాజంయొక్క ప్రతి సూత్రాన్నీ ఎదుర్కొంటాయి. కాబట్టి యీ రచనలనిండా కార్మిక వర్గంకు విజ్ఞానాన్ని కలిగించే అత్యంత అమూల్యమైన విషయాలు ఉంటాయి. వీటిలో ప్రతిపాదించబడిన ఆచరణయుక్తమైన చర్యలు నగరానికీ గ్రామానికీ మధ్యవున్న వ్యత్యాసాలూ కుటుంబమూ పరిశ్రమలను వ్యక్తిగత ప్రయోజలకొరకు నడపడమూ కూలిపద్ధతీ అంతరింపజేయడమూ సామాజిక సామరస్యం ప్రకటించడమూ, ప్రభుత్వవిధులను కేవలం ఉత్పత్తిపై అజమాయిషీ చేసే విధులుగా మాత్రమే మార్పుచేయడమూ, ఈ ప్రతిపాదనలన్నీ, ఆ రోజుల్లో అప్పుడే మొలకెత్తుతూన్నట్టీ, అవ్యక్తమూ, అస్పష్టమూ అయిన అత్యతిప్రాథమికమైన రూపాలలో మాత్రమే గుర్తించబడినట్టీ వర్గవైషమ్యాలు అదృశ్యం కావలసిన అవసరాన్ని ఒక్కటిని మాత్రమే పేర్కొంటున్నాయి. కాబట్టి యీ ప్రతిపాదనలు పూర్తిగా ఊహాజనిత స్వభావాన్ని కలిగినటువంటివి.

విమర్శనాత్మక-ఊహాజనితమైన సోషలిజమూ కమ్యునిజమూ చారిత్రకాభివృద్ధితో విలోమ సంబంధాన్ని కలిగి వుంటూంది. ఆధునిక వర్గపోరాటం అభివృద్ధి చెందుతూ నిర్దిష్ట రూపాన్ని పొందుతున్నకొద్దీ అదే నిష్పత్తిలో యీ పోరాటానికి చోద్యంగా దూరంగా నిలబడడమూ, చోద్యంగా ఎదుర్కోవడమూ ఆచరణరీత్యా విలువనూ సిద్ధాంతరీత్యా సమర్థనీయతనూ పోగుట్టుకుంటుంది. కాబట్టి యీ సిద్ధాంతాల స్థాపకులు అనేక విషయాలలో విప్లవాత్మకులే అయినప్పటికీ, ప్రతి విషయంలోనూ వారి శిష్యులు కేవలం అభివృద్ధినిరోధక కూటములనే ఏర్పరచారు. వీరు అభ్యుదయకరమైన చారిత్రకాభివృద్ధి పొందుతూన్న శ్రామిక

వర్గానికి వ్యతిరేకంగా తమ గురువర్యుల మూలాభిప్రాయాలను గట్టిగా పట్టుకొని కూర్చుం టారు. ఈవిధంగా వీరు వర్గపోరాటాన్ని నిర్జీవంచేయడానికీ, వర్గ వైషమ్యాలను దూరం చేసి సఖ్యత నెలకొల్పడానికీ ప్రయత్నం చేశారు. అది కూడా సుసంగతముగా ప్రయత్నంచేస్తారు. తమ ఊహాజనిత సమాజాన్ని కలిగిన ప్రపంచాన్ని ప్రయోగాత్మకంగా సాధించడానికీ, ఏకాంత వాసములైన "phalanstères" ఏర్పరచీ, "Home Colonies" స్థాపించీ "చిన్న ఇకేరియాను" నెలకొల్పీ* — నూతన జరూసలెమ్‌యొక్క బుచ్చిబుచ్చి కూర్పులను నెలకొల్పీ, యిప్పటికీ కలలు కంటూ, ఈ గాలిమేడలను నిర్మించడానికని బూర్జువాల దయాధర్మాలకోసం, డబ్బుకోసం నిర్బంధంగా విజ్ఞప్తులు చేసుకుంటారు. క్రమక్రమంగా పైన తెలిపిన అభివృద్ధి నిరోధకమైన, సనాతన సోషలిస్టులుగా దిగజారిపోతారు. పోతే ఇక వారికీ వీరికీ తేడా ఏమిటంటే వారికంటే వీరు ఎక్కువ క్రమ పద్ధతిలో పాండిత్యభేషజాన్ని ప్రకటించుకుంటూ, తమ సామాజిక శాస్త్రంయొక్క అద్భుతమైన ఫలితాలను మూఢభక్తితో మూఢవిశ్వాసాలతో నమ్ముతారు.

కాబట్టి వీరు కార్మికవర్గంయొక్క రాజకీయ కార్యాచరణనంతటినీ వ్యతిరేకిస్తారు; అలాంటి కార్యాచరణ తమ కొత్త సువార్తలో గుడ్డి నమ్మకం కుదరని కారణానే వెలువడు తుందని వీరు భావించుతారు.

ఇంగ్లండులో ఓవెన్ అనుచరులు చార్టిస్టులనూ, ఫ్రాన్సులోని ఫోరియర్ అనుచరులు "Réformiste"**[8] అనుయాయులనూ ప్రతిఘటిస్తారు.

---

* Phalanstères (ఫెలాన్‌స్టేరెలనేవి) చార్లెస్ ఫోరియర్ పథకంపై నిర్మితమైన సోషలిస్టు నివాసక్షేత్రాలు; Icaria (ఇకేరియా) ఇది కాబెట్ తన ఊహాజనిత జగత్తుకు పెట్టిన పేరు. ఆతర్వాత అతడు ఆ పేరును తన అమెరికన్ కమ్యూనిస్టు నివాసక్షేత్రానికి పెట్టాడు. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

ఓవెన్ తన ఆదర్శవంతమైన కమ్యూనిస్టు సంఘాలను "Home Colonies" సమిష్టి నివాసక్షేత్రాలు అని పిలిచేవాడు. ఫోరియర్ పథకం ప్రకారం తయారైన ప్రభుత్వభవ నాలకు ఫెలాన్‌స్టేరెలనేవారు. 'ఇకేరియా' అంటే తాను వర్ణించిన కమ్యూనిస్టు సంస్థలుగల ఊహాజగత్తుకు కాబెట్ పెట్టిన పేరు. [1890 జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

** రెఫార్మిస్టు. — సం.

# IV. వివిధ ప్రతికూల పక్షాలపట్ల కమ్యూనిస్టుల స్థానం

కమ్యూనిస్టులకూ, ఇంగ్లండులోని చార్టిస్టులూ అమెరికాలోని వ్యవసాయ సంస్కరణ వాదులువంటి యీనాటి కార్మికవర్గ పార్టీలకూగల సంబంధాలను రెండవ అధ్యాయం స్పష్టంగా తెలుపుతూంది.

కమ్యూనిస్టులు కార్మికవర్గంయొక్క తక్షణ కోర్కెలకోసమూ, కార్మికవర్గంయొక్క తాత్కాలిక ప్రయోజనాలు అమలులోకి వచ్చేందుకూ పోరాడుతారు; కాని ప్రస్తుత ఉద్యమంలో, భవిష్యత్ ఉద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆ వుద్యమాన్ని పరిరక్షింప పూనుకుంటారు. ఫ్రాన్సులో కమ్యూనిస్టులు సోషల్-డెమోక్రాట్లకి* సహాయపడుతూ సనాతన రక్షక బూర్జువాలనూ రాడికల్ (అతివాద) బూర్జువాలనూ ప్రతిఘటిస్తూ, ఫ్రెంచి విప్లవం సాంప్రదాయకంగా అందిస్తూ వచ్చిన కొన్ని వాక్యభాగాలనీ, భ్రమలనీ విమర్శించే హక్కును మాత్రం అట్టేపెట్టుకుంటారు.

---

* ఆ కాలంలో సోషల్-డెమోక్రాట్ల పార్టీకి పార్లమెంటులో లెద్రూ-రోలిన్, సాహిత్యరంగంలో లూయీ బ్లాంక్, దైనిక పత్రికా ప్రపంచంలో "Réforme" పత్రిక ప్రతినిధులు. సోషల్ డెమోక్రసీ అనే పేరును ఆవిష్కరించింది వీరిరువురే. డెమోక్రాటిక్ పార్టీలోగానీ లేదా రిపబ్లికన్ పార్టీలోగానీ ఒక విభాగంగా వుంటూ ఏ కొద్దో గొప్పో సోషలిస్టు ఛాయను కలిగి వుండేడి ఈ పార్టీ. [1888 ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

ఆ రోజుల్లో ఫ్రాన్సులో వున్న సోషలిస్టు డెమోక్రాటిక్ అని పిలవబడే పార్టీకి

స్విట్జర్‌లండ్‌లో కమ్యూనిస్టులు రాడికల్ పార్టీని, ఆ పార్టీలో పరస్పర విరుద్ధమైన దృక్పథాలకు చెందినవారు, అంటే కొంతవరకు డెమోక్రాటిక్ సోషలిస్టులూ ఫ్రెంచి అర్థంలో కొంతవరకు రాడికల్ బూర్జువాలూ ఉన్నారనే సంగతిని విస్మరించకుండానే, బలపరచుతారు.

పోలెండ్‌లో కమ్యూనిస్టులు జాతీయ విముక్తికి వ్యవసాయవిప్లవమే ప్రధానమైన షరతు అని పట్టుపట్టే పార్టీని, 1846లో క్రాకొవ్ తిరుగుబాటును లేవదీసిన పార్టీనే బలపరచుతారు.

జర్మనీలో నిరంకుశ రాచరికం యెడలా ఫ్యూడల్ భూస్వామ్య వర్గం యెడలా పెట్టీ బూర్జువావర్గం* యెడలా బూర్జువావర్గం విప్లవకరంగా వ్యవహరించిన పక్షంలో కమ్యూనిస్టులు యీ బూర్జువావర్గంతో చేతులుకలిపి పోరాడుతారు.

ఐనా, బూర్జువావర్గానికీ శ్రామిక వర్గానికీ శత్రుత్వం వున్న విషయాన్ని, తద్వారా బూర్జువావర్గం తన అధికారంతోపాటు తప్పనిసరిగా ప్రవేశపెట్టవలసిన కొత్త రాజకీయ సాంఘిక పరిస్థితులనే జర్మన్ కార్మికులు తక్షణం తమ వివిధరకాల ఆయుధాలుగా బూర్జువా వర్గంపై ఉపయోగించుకునేందుకూ, జర్మనీలోని అభివృద్ధి నిరోధక వర్గాలు పతనమైపోయిన తరువాత, బూర్జువావర్గంపై పోరాటం తక్షణమే ఆరంభమయేందుకూ కార్మిక వర్గం మనసులో నాటేటట్టు ఒక్కక్షణమైనా విరామంలేకుండా సుస్పష్టంగా గుర్తించేటట్టూ కమ్యూనిస్టులు చెపుతూంటారు.

యూరోపియన్ నాగరికతయొక్క ప్రగతిచెందిన పరిస్థితులక్రింద విధిగా జరిగితీరవలసిన బూర్జువా విప్లవం మొదలు కాబోయే పరిస్థితులు ఆ దేశంలో యీ నాడు వున్నాయనే కారణంచేతనూ, జర్మనీలో నాగరికత యితర దేశాల్లోకంటే ఎక్కువ పురోగమించి వుండడం కారణం చేతనూ, శ్రామిక వర్గం కూడా 17వ శతాబ్దపు ఇంగ్లండులోని శ్రామిక వర్గం కంటేనూ 18వ శతాబ్దపు ఫ్రాన్సులోని శ్రామిక వర్గం కంటేనూ ఎంతో ఎక్కువగా

---

లెద్రూ-రోలిన్ రాజకీయ రంగంలోనూ, లూయీ బ్లాంక్ సాహిత్యరంగంలోనూ ప్రతినిధులుగా వుండేవారు; ఈవిధంగా ఆ పార్టీకీ, యీనాడు జర్మనీలో వున్న సోషల్-డెమోక్రసీకీ అపరిమితమైన వ్యత్యాసం వుంది. [1890 జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.]

* జర్మన్ అసలు ప్రతిలో "Kleinbürgerei" (క్లైన్‌బూర్గరై) అనే పదాన్ని పట్టణ పెట్టీబూర్జువావర్గంలోని అభివృద్ధి నిరోధక శక్తులను వర్ణించేందుకని మార్క్స్, ఎంగెల్స్‌లు ఉపయోగించారు.—సం.

అభివృద్ధి చెంది వుండడంచేతనూ, కాగా జర్మనీలో బూర్జువా విప్లవం వస్తే అది ఆ వెను వెంటనే వచ్చే శ్రామిక విప్లవానికి నాందిగానే పరిణమించుతుందనే కారణంచేతనూ కమ్యూనిస్టులు తమ ధ్యానాన్ని ప్రధానంగా జర్మనీపైకే మళ్లించుతారు.

క్లుప్తంగా చెప్పాలంటే కమ్యూనిస్టులు ప్రతిచోటా కూడా యీనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థకు ప్రతికూలంగా జరిపే ప్రతి విప్లవోద్యమాన్నీ బలపరచుతారు.

ఈ ఉద్యమాలన్నిటిలోనూ ప్రతిదానిలోనూ కమ్యూనిస్టులు ఆస్తి సమస్యను, ఆ సమయంలో దాని అభివృద్ధి స్థాయి ఏమెట్టులో వున్నప్పటికైనా కూడా నిమిత్తంలేకుండా, అన్నిటికంటే ప్రధానమైన సమస్యగా ప్రజల ముందుకు తీసుకువస్తారు.

చివరి విషయం ఏమిటంటే కమ్యూనిస్టులు ప్రతిచోటా కూడా అన్ని దేశాలలోని ప్రజాస్వామ్య పార్టీల మధ్యా ఐక్యత నెలకొనేందుకూ పొందిక కుదిరేందుకూ పాటుపడతారు.

కమ్యూనిస్టులు తమ దృక్పథాలనూ, ఆశయాలనూ దాచడానికి తిరస్కరిస్తారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులను బలప్రయోగంతో కూలద్రోస్తేనేగాని తమ ఆశయాలు సిద్ధించవని బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటే పాలకవర్గాలు గజ గజా వణకనివ్వండి. శ్రామిక వర్గం తన సంకెళ్లను మినహా పోగొట్టుకొనేది ఏమీ లేదు. వారు ప్రపంచాన్నే జయించవలసి వుంది.

ప్రపంచ కార్మికులారా, ఏకముకండి!

1847 డిసెంబరునుండి,
1848 జనవరివరకూ కె.మార్క్స్
ఎఫ్.ఎంగెల్స్‌చే లిఖింపబడింది.

మొట్టమొదట లండన్‌లో
1848 ఫిబ్రవరిలో పాంప్లెట్‌గా
ప్రచురింపబడింది.

# వివరణలు

[1] కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక – ఇది శాస్త్రీయ కమ్యూనిజంయొక్క మహత్తరమైన కార్యక్రమ పత్రం. "ఈ చిన్న పుస్తకం ఎన్నో గ్రంథాలకు సరిసమానమైనది: మొత్తం నాగరికతా ప్రపంచ మంతటా సంఘటితమై పోరాడుతూవున్న శ్రామిక వర్గానికి ఇది ప్రాణమై, యీనాటికీ ఉత్సాహదాయకమై, బోధక హేతువౌతూంది." (లెనిన్). కె. మార్క్స్, ఎఫ్. ఎంగెల్స్‌లు దీనిని కమ్యూనిస్టు లీగ్‌యొక్క కార్యక్రమంగా రాశారు. ఇది 23 పేజీలుగల ఒక ప్రత్యేకమైన పాంఫ్లెట్‌గా మొట్టమొదట లండన్‌లో 1848 ఫిబ్రవరినెలలో వెలువడింది. వలసవెళ్ళిన జర్మన్ రాజకీయ వాదులయొక్క ప్రజాతంత్ర పత్రిక అయిన "Deutsche Londoner Zeitung"లో ("జర్మన్ లండన్ వార్తాపత్రిక") యీ "ప్రణాళిక" 1848 మార్చి జులైలమధ్యలో దఫాలవారిగా ప్రచురింపబడింది. అదే సంవత్సరంలో జర్మన్ వాచకం లండన్‌లో 30 పేజీల పాంఫ్లెట్‌గా మొదటిప్రతిలో సంభవించిన అచ్చు తప్పులను సరిదిద్ది, వ్రాతలో విరామస్థానాలందు గుర్తులుపెట్టడం సరిచేసి పునర్ముద్రింపబడింది. ఈ వాచకమే మార్క్స్ ఎంగెల్స్‌లకు దరిమిలా వచ్చిన అధికారయుతమైన కూర్పులకు ప్రాతిపదికగా ఆతర్వాత ఉపయోగపడింది. 1848లో యీ "ప్రణాళిక" అనేక యూరోపియన్ భాషలలోకి కూడా (ఫ్రెంచి, పోలిష్, ఇటాలియన్, డేనిష్, ఫ్లెమిష్, స్వీడిష్ భాషలలోకి) అనువదింపబడింది. 1848 కూర్పులలో గ్రంథకర్తలపేర్లు లేవు. ఈ "ప్రణాళిక"యొక్క మొదటి యింగ్లీషు అనువాదం చార్టిస్టు "Red Republican" అను పత్రికలో ప్రచురింపబడినప్పుడు, యీ పత్రికా సంపాదకుడైన జార్జి జూలియన్ హార్నీ యీ పేర్లను తన పీఠికలో పేర్కొనడంతో యివి మొట్టమొదటి సారిగా అచ్చులో బయటికి వచ్చాయి.

1872లో ఒక కొత్త జర్మన్ కూర్పు కొద్ది పాటి సవరణలతోనూ, మార్క్స్ ఎంగెల్స్‌ల పీఠికతోనూ ప్రచురింపబడింది. ఈ కూర్పూ, ఆతర్వాత 1883లోనూ, 1890

లోనూ అచ్చు అయిన జర్మన్ కూర్పులూ "కమ్యూనిస్టు ప్రణాళిక" అను శీర్షికతో వెలువడ్డాయి.

ఈ "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" యొక్క మొట్టమొదటి రష్యన్ కూర్పు 1869లో వెలువడింది. దీనిని బకూనిన్ అనువాదం చేశాడు. అతడు కొన్ని చోట్ల మాతృకకు అపార్థం కల్పించాడు. 1882లో జినీవాలో ప్రచురింపబడిన ప్లెహనోవ్ అనువాదంలో మొదటి రష్యన్ అనువాదంలోని లోపాలు తొలిగింపబడ్డాయి. "ప్రణాళిక"లోని భావాలను రష్యాలో వ్యాపింపచేయడంలో ప్లెహనోవ్ చేసిన అనువాదం ఎంతో ఉపయోగపడింది. రష్యాలో మార్క్సిజం ప్రచారానికి మార్క్స్ ఎంగెల్స్‌లు ఎక్కువ ప్రాధాన్యత నొసగారు. 1882లోని కూర్పుకు ప్రత్యేకంగా పీఠికను రాశారు.

మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ యీ "ప్రణాళిక"యొక్క అనేక కూర్పులను సమీక్షించాడు — 1883లోని జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ ఉపోద్ఘాతం రాశాడు; సామ్యూల్ మూర్ అనువదించి ఎంగెల్స్ సరిచూచిన చేసిన 1888 యింగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ ఒక ఉపోద్ఘాతాన్నీ వివరణలనూ కూడా రాశాడు; 1890 జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ ఒక కొత్త ఉపోద్ఘాతాన్ని రాశాడు. ఈ చిట్టచివరి కూర్పుకు ఎంగెల్స్ కొన్ని వ్యాఖ్యానాలను కూడా పొందుపరచాడు. మార్క్స్ కుమార్తె లారా లఫార్గ్ అనువదించి ఎంగెల్స్ సమీక్ష చేసిన యీ "ప్రణాళిక" ఫ్రెంచి అనువాదం 1885లో "Socialiste" ("సోస్యలిస్ట్")లో వెలువడింది. 1892 పోలిష్ కూర్పుకూ, 1893లోని ఇటాలియన్ కూర్పుకూ ఎంగెల్స్ ఉపోద్ఘాతం రాశాడు. పుట 3.

[2] కమ్యూనిస్టు లీగ్ — శ్రామిక వర్గంయొక్క మొట్టమొదటి అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ. దీని స్థాపనకు పూర్వం మార్క్స్ ఎంగెల్స్‌లు వివిధ దేశాలలోని సోషలిస్టులనూ అగ్రగణ్యులైన కార్మికులనూ సైద్ధాంతికంగానూ నిరాణాత్మకంగానూ సమీకరించడంలో విస్తారమైన ప్రాథమిక ప్రారంభ చర్యలను కావించారు. ఈ ఉద్దేశాన్ని మనస్సులో పెట్టుకొనే 1846 ఆరంభంలో బ్రస్సెల్స్‌లో కమ్యూనిస్టు కరెస్‌పాన్‌డెన్స్ కమిటీని స్థాపించారు. విల్‌హెల్మ్ వైట్లింగ్ వాదించే సామాన్యపు సరిసమానత్వపు కమ్యూనిజం (equalitarian Communism) తోనూ, "యథార్థమైన సోషలిజం" (true socialism)తోనూ, మార్క్స్ ఎంగెల్స్‌లు తీవ్రమైన వాగ్వివాదాలు సాగించి శాస్త్రీయ కమ్యూనిజం భావాలను పరిరక్షించారు. ప్రూడన్ ప్రచారంచేసిన పెట్టీబూర్జువా ఊహాజనిత కమ్యూనిజంకు యితర సంస్థలలోనూ, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్‌లండ్, బ్రిటన్‌లలో శాఖలను తక్షణాలనుగల కార్మికుల, రహస్య సంఘమైన "లీగ్ ఆఫ్ ది జస్ట్" (ధర్మసమితి)లోని సభ్యులలోనూ

పలుకుబడి వుండేది. "లీగ్ ఆఫ్ ది జస్ట్"యొక్క లండన్ నాయకులకు మార్క్స్ ఎంగెల్స్‌ల భావాలలోని న్యాయం నచ్చింది. అందువల్లనే వారు మార్క్స్ ఎంగెల్స్‌లు 1847 జనవరి ఆఖరి రోజుల్లో తమ సంస్థలో చేరి ఆ సంస్థ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలనీ, మార్క్స్ ఎంగెల్స్‌లు వివరించిన సిద్ధాంతాల ప్రాతిపదికపై తమ లీగ్ కార్యక్రమాన్ని తయారుచేయడంలో కూడా పాల్గొనాలనీ ఆహ్వానం పంపారు. మార్క్స్ ఎంగెల్స్‌లు ఆ ఆహ్వానాన్ని అంగీకరించారు.

1847 జూన్ ఆరంభంలో లండన్‌లో జరిగిన "లీగ్ ఆఫ్ ది జస్ట్" సమావేశం కమ్యూనిస్ట్ లీగ్‌యొక్క ప్రథమ కాంగ్రెస్‌గా చరిత్రలోకి ఎక్కింది. ఎంగెల్స్, విల్‌హెల్మ్ వొల్ఫ్‌లు యీ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. ఈ కాంగ్రెస్‌లో "లీగ్ ఆఫ్ ది జస్ట్" పేరు మార్చి "కమ్యూనిస్టు లీగ్" అని మళ్లీ నామకరణం చేశారు. "మనుష్యులందరూ అన్నదమ్ములు" అనే అస్పష్టంగా వున్న పాత నినాదం స్థానే "ప్రపంచ కార్మికులారా, ఏకముకండి!" అనే శ్రామిక వర్గ పార్టీయొక్క సమరశీలమైన అంతర్జాతీయ నినాదాన్ని ప్రవేశపెట్టారు. ఎంగెల్స్ చరుగ్గా నకలు వ్రాసి తయారుచేసిన "కమ్యూనిస్టు లీగ్" నియమావళిని కూడా యీ కాంగ్రెస్ పరిశీలించింది. ఈ కొత్త నియమావళి కమ్యూనిస్టు ఉద్యమంయొక్క అంతిమ ఆదర్శాలను సుస్పష్టంగా నిర్వచించింది. అంతేకాదు యీ సంస్థకు రహస్య సంఘపు లక్షణాలను తెచ్చిపెట్టిన క్లాజులను తీసివేసింది. లీగ్‌యొక్క నిర్మాణం ప్రజాతంత్ర సూత్రాలపై ఆధారపడినట్టు చేసింది. ఈ నియమావళి "కమ్యూనిస్టు లీగ్" రెండవ కాంగ్రెస్‌లో అంతిమ ఆమోదం పొందింది. లండన్‌లో 1847 నవంబరు 29నుండి డిసెంబరు 8వరకు జరిగిన రెండవ కాంగ్రెస్‌లో మార్క్స్ ఎంగెల్స్‌లు యిద్దరూ పాల్గొన్నారు. వారు సుదీర్ఘమైన చర్చలలో శాస్త్రీయ కమ్యూనిజం సూత్రాలని సమర్థించారు. చివరికి ఆ సూత్రాలు కాంగ్రెస్‌చే ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి. ఈ కాంగ్రెస్ కోరికపైనే మార్క్స్ ఎంగెల్స్‌లు "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"ను రాశారు. కార్యక్రమ సహితమైన యీ పత్రం 1848లో బయటికి వచ్చింది.

ఫ్రాన్సులో విప్లవం మొదలైన సమయంలో లండన్‌లో కార్యాలయం వున్న లీగ్‌యొక్క కేంద్ర సమితి, మార్క్స్ నాయకుడుగా వున్న బ్రస్సెల్స్ జిల్లాసమితికి 1848 ఫిబ్రవరి ఆఖరులో నాయకత్వాన్ని అప్పగించింది. ఈ బ్రస్సెల్స్ జిల్లాసమితి బ్రస్సెల్స్‌నుండి వెళ్లగొట్టబడి పారిస్‌కు కదలినప్పుడు కొత్త కేంద్రసమితి మార్చి నెల ఆరంభంలో తన పీఠాన్ని ఫ్రెంచి రాజధానీ నగరానికి మార్చుకుంది. ఎంగెల్స్ కూడా కేంద్ర సమితికి ఎన్నికయ్యాడు. 1848 మార్చి ఆఖరులోనూ, ఏప్రిల్ ఆరంభంలోనూ కేంద్ర సమితి అప్పటికే ఆరంభ

మైన జర్మన్ విప్లవంలో పాల్గొనేందుకని కొన్ని వందల జర్మన్ కార్యకర్తలను, ఎక్కువగా "కమ్యూనిస్టు లీగ్" సభ్యులను స్వదేశానికి వెళ్ళగలిగే ఏర్పాట్లను చేసి పంపించింది. మార్చి ఆఖరు రోజుల్లో మార్క్స్ ఎంగెల్స్‌లు సూత్రీకరించిన "జర్మనీలోని కమ్యూనిస్టు పార్టీ కోర్కెలు" అనే ప్రచురణలో పై విప్లవంలోని "కమ్యూనిస్టు లీగ్" యొక్క రాజకీయ వేదికను గురించి వివరించబడింది.

1848 ఏప్రిల్ ఆరంభంలో మార్క్స్, ఎంగెల్స్, వారి అనుచరులు జర్మనీకి వచ్చిన తర్వాత జర్మనీ వెనకబడి వుందనీ అక్కడ కార్మికులు అనైక్యతతో వున్నారనీ, వారిలో తగినంత రాజకీయ చైతన్యం లేదనీ, దేశమంతటా చెల్లాచెదరుగా వున్న "కమ్యూనిస్టు లీగ్" యొక్క రెండు మూడు వందల సభ్యులూ విస్తారంగా వున్న విస్తృత జనబాహుళ్యంలో ఏ మాత్రము అధికమైన పలుకుబడినీ సంపాదించుకోలేకపోయారనీ తెలుసుకున్నారు. తత్ఫలితంగా మార్క్స్ ఎంగెల్స్‌లు, డెమోక్రాటిక్ ఉద్యమంను నడిపిస్తూన్న తీవ్రవామపక్షంలో — కార్యరూపేణా శ్రామిక వర్గ పక్షాన్ని అన్నమాటే — చేరడం ఉచితమని భావించారు. "కొలోన్ డెమోక్రాటిక్ సొసైటీలో" చేరారు. తమ అనుచరులను, డెమోక్రాటిక్ గ్రూపులలో విప్లకరమైన శ్రామిక వర్గం అనే లాక్ష్యాన్ని నిలబెట్టేందుకనీ, పెట్టీబూర్జువా డెమోక్రాట్ల అసంగతమునూ ఊగిసలాటనూ విమర్శించేందుకనీ, వాళ్లని స్థిరమైన కార్యాచరణకు పురికొల్పేందుకనీ, డెమోక్రాటిక్ గ్రూపులలో చేరమని సలహాయిచ్చారు. అదే సమయంలో మార్క్స్ ఎంగెల్స్‌లు తమ అనుచరులను, కార్మిక సంఘాలను సంఘటిత పరచాలనీ, శ్రామిక వర్గానికి రాజకీయాలు బోధించే విషయంలో దృష్టిని ఎక్కువగా కేంద్రీకరించాలనీ, ప్రజాశ్రామిక వర్గ పార్టీ కొరకు పునాదులను వేయాలనీ ప్రేరేపించారు. మార్క్స్ సంపాదకత్వాన నడుస్తూన్న "Neue Rheinische Zeitung" ("నవరైనిష్ వార్తాపత్రిక") పత్రిక "కమ్యూనిస్టు లీగ్" సభ్యులకు మార్గదర్శకమైన కేంద్రంగా ఉండేది. 1848 ఆఖరు రోజుల్లో లండన్‌లోని లీగ్ కేంద్రకమిటీ మళ్లీ సంబంధాలను పూర్వస్థితికి తేవాలని చూసింది. లీగ్‌ను పునర్నిర్మాణం చేయాలనే ఉద్దేశంతో జోసెఫ్ మోల్‌ను జర్మనీకి ఆంతరంగిక ప్రతినిధిగా పంపించారు. లండన్ సంస్థవారు 1847 నియమావళిలోని రాజకీయ ఒత్తుని తగ్గిస్తూ ఆ నియమావళిని మార్పుచేశారు. దాంతో బూరువా వర్గాన్ని పడగొట్టడం, శ్రామిక వర్గ పాలనను నెలకొల్పడం, వర్గరహితమైన కమ్యూనిస్టు సమాజాన్ని నెలకొల్పడం "కమ్యూనిస్టు లీగ్" ప్రధాన ఆశయాలని నిర్వచించిన వెనకటి నియమావళి కాకుండా పోయింది. వారు సోషల్ రిపబ్లిక్‌ను గురించి మాట్లాడ్డం మొదలుపెట్టారు. 1848–1849 మధ్య శీతకాలంలో జర్మనీకి వెళ్లిన మోల్ దౌత్యం విఫలమైపోయింది.

1849 ఏప్రిల్‌లో మార్క్స్, ఎంగెల్స్, వారి అనుచరులు "డెమోక్రాటిక్ సొసైటీ" నుండి బైటికి వచ్చేశారు. అప్పుడు కార్మిక అశేషప్రజానీకం రాజకీయ అనుభవాన్ని గడించుకుంది కాబట్టీ, పెట్టీబూర్జువా డెమోక్రాట్లంటే వారు బాగా నిరుత్సాహపడిపోయారు కాబట్టీ, ఒక స్వతంత్ర శ్రామిక వర్గ పార్టీని నెలకొల్పడం గురించి ఆలోచించవలసిన సమయం ఆసన్నమైంది. కాని మార్క్స్ ఎంగెల్స్‌లు తమ పథకాన్ని కొనసాగించ లేకపోయారు. జర్మనీ నైరుతి ప్రాంతంలో ఒక తిరుగుబాటు లేచింది. అది ఓడిపోవడంతోటే జర్మన్ విప్లవం అంతమైపోయింది.

విప్లవం జరుగుతున్న కాలంలో "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"లో వివరించినట్లు "కమ్యూనిస్టు లీగ్"యొక్క దృక్పథాలు పూర్తిగా సరియైనవని స్పష్టమైపోయింది. విప్లవ కళను బోధించేందుకు లీగ్ అత్యంత ఉత్తమమైన పాఠశాల అని కూడా స్పష్టమైపోయింది. లీగ్ సభ్యులు శ్రామిక వర్గ దృక్పథాన్ని అత్యంత విప్లవకరమైన వర్గదృక్పథాన్ని పరిరక్షించుతూ పత్రికలలోనూ, క్రొటగడలపైనా, యుద్ధరంగాలలోనూ శక్తివంతంగా ఉద్యమంలో పాల్గొన్నారు.

విప్లవం ఓడిపోవడం "కమ్యూనిస్టు లీగ్"కు ఒక బాధాకరమైనదెబ్బే. అందులో చాలామంది సభ్యులను ఖైదుచేశారు. దేశంనుండి బహిష్కరించి వెళ్లగొట్టారు. వారివారి చిరునామాలూ, సంబంధాలు పోయాయి. స్థానిక శాఖలు పనిచేయడం మానివేశాయి. జర్మనీ వెలుపల కూడా లీగ్ అధికంగా నష్టపోయింది.

1849 శరత్తులో లీగ్‌లో చాలామంది నాయకులు లండన్‌లో సమావేశమయ్యారు. మార్క్స్, ఎంగెల్స్‌ల నాయకత్వంకింద పునర్నిర్మాణమైన కొత్త కేంద్ర సమితియొక్క ప్రయత్నాల ఫలితమా అంటూ, పూర్వపు సంస్థ యథాస్థితికి వచ్చింది. లీగ్‌యొక్క కార్యకలాపాలు 1850 వసంతంలో పూర్వస్థితికి వచ్చాయి. 1850 మార్చి నెలలో మార్క్స్ ఎంగెల్స్‌లు రాసిన "కమ్యూనిస్టు లీగ్ కేంద్ర సమితి ఉపన్యాసం" 1848 – 49 విప్లవ ఫలితాలను క్రోడీకరించి, పెట్టీబూర్జువాలతో సంబంధం లేని శ్రామికవర్గ పార్టీని నెలకొల్ప వలసిన పనిని పురమాయించింది. ఈ "ఉపన్యాసమే" శాశ్వత విప్లవం అనే భావాన్ని మొట్టమొదటిసారిగా వివరించింది. 1850లో ఒక కొత్త కమ్యూనిస్టు పత్రిక వెలువడింది. అదే "Neue Rheinische Zeitung." Politisch-ökonomische Revue. ("నవరైనిష్ వార్తాపత్రిక". రాజకీయ-ఆర్థిక సమీక్షా పత్రిక).

ఎత్తుగడలు ప్రశ్నపై 1850 వేసవిలో "కమ్యూనిస్టు లీగ్" కేంద్ర సమితిలో వాగ్వివాదం బయల్దేరింది. మార్క్స్ ఎంగెల్స్‌ల నాయకత్వంకింద అధిక సంఖ్యాకులు, యూరప్

లోని బాహ్య రాజకీయ పరిస్థితులనూ వాస్తవిక పరిణామాలనూ పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఒంటెత్తుపోకడ కలిగినట్టి ఆలోచనా పాలోచనాలేనట్టి ఆలస్యంలేకుండా విప్లవం ప్రారంభించాలన్న ఎత్తుగడలను ప్రతిపాదించినట్టి ఆగస్ట్ విల్లిచ్, కారల్ షాపర్‌ల ముఠాను, గట్టిగా ఎదుర్కొన్నారు. ఈలోగా మార్క్స్ ఎంగెల్స్‌లు శాస్త్రీయ కమ్యూనిజంను ప్రచారం చెయ్యాలనీ, రాబోయే విప్లవ సంఘర్షణల కోసమై శ్రామిక విప్లవకారులకు శిక్షణ నివ్వాలనీ నొక్కి చెప్పారు. అభివృద్ధి నిరోధకులు దాడులు పూనుకున్నప్పుడు "కమ్యూనిస్టు లీగ్"యొక్క ప్రధాన కర్తవ్యం యిదేనని చెప్పారు. 1850 సెప్టెంబరుమధ్యలో విల్లిచ్-షాపర్‌ల ముఠాయొక్క అంతఃకలహ కార్యకలాపాలు చీలకలను తీసుకువచ్చాయి. సెప్టెంబరు 15వ తేదీన జరిగిన సమావేశంలో మార్క్స్ సలహాపై కేంద్ర సమితియొక్క అధికారాలు కొలోన్ జిల్లా కమీటీకి దఖలు చేయబడ్డాయి. జర్మనీలోని "కమ్యూనిస్టు లీగ్" శాఖలు, లండన్ కేంద్ర సమితియొక్క యీ అధిక సంఖ్యాకుల నిర్ణయాన్ని అంగీకరించాయి. మార్క్స్, ఎంగెల్స్‌ల ఆదేశంపై కొలోన్‌లోని యీ కొత్త కేంద్ర సమితి 1850 డిసెంబర్‌లో ఒక కొత్త లీగ్ నియమావళిని తయారుచేసింది. 1851 మేలో పోలీసుల నిర్బంధాలు, అరెస్టుల కారణంగా జర్మనీలోని "కమ్యూనిస్టు లీగ్" కార్యకలాపాలు స్తంభించిపోయాయి. కొలోన్ కమ్యూనిస్టు విచారణ ముగిసిన వెంటనే "కమ్యూనిస్టు లీగ్" రద్దుచేయబడిందని ప్రకటించమని మార్క్స్ లీగ్‌కు సలహాచెప్పాడు. ఆవిధంగానే "కమ్యూనిస్టు లీగ్" 1852 నవంబరు 17వ తేదీన రద్దయిపోయింది.

శ్రామిక వర్గ విప్లవకారుల పాఠశాలగానూ, శ్రామిక వర్గ పార్టీ కేంద్రకముగానూ, మొదటి అంతర్జాతీయ సంస్థ (First International) అయిన అంతర్జాతీయ కార్మికుల సంఘంయొక్క తొలి సంస్థగానూ యీ "కమ్యూనిస్టు లీగ్" తన చారిత్రక పాత్రను నిర్వహించింది. పుట 7.

3 "కోలొకొల్" — "సజీవులకు పిలుపు!" ("Vivos voco!") అనే దీక్షా వాక్యంతో ప్రకటింపబడిన రష్యన్ భాషా రాజకీయ పత్రిక. దీని ప్రచురణకర్తలు ఎ. ఐ. గేత్సెన్, ఎన్. పి. ఒగర్యోవ్‌లు. ఇది లండన్‌లో 1857నుండి 1865 ఏప్రిల్ మధ్య కాలంలోనూ జినీవాలో 1865నుండి 1868 డిసెంబరు మధ్య కాలంలోనూ గేత్సెన్ స్థాపించినట్టి ఫ్రీ రష్యన్ ప్రెస్‌లో ముద్రింపబడేది. 1868లో యీ పత్రిక రష్యన్ అనుబంధాలతో ఫ్రెంచి భాషలో వెలువడింది.

'కోలొకొల్' పత్రికను "గేత్సెన్ జ్ఞాపకార్థం" అనే తన వ్యాసంలో లెనిన్ వర్ణించాడు. పుట 10.

[4] ఎంగెల్స్ యీ పాదవివరణను "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"యొక్క 1890లోని జర్మన్ కూర్పులో కూడా చేర్చాడు. కాని ఆఖరి వాక్యభాగాన్ని తీసివేశాడు. పుట 35.

[5] మార్క్స్, ఎంగెల్స్‌లు తమ తర్వాతి గ్రంథాలలో, మార్క్స్ ప్రవేశపెట్టినట్టి ఇంకా నిశితమైన భావనలను ఉపయోగించారు. ఉదాహరణకు "శ్రమ విలువ," బదులు "శ్రమ శక్తి విలువ" అనీ "శ్రమఖరీదు" బదులు "శ్రమశక్తి ఖరీదు" అనీ ఉపయోగించారు. పుట 43.

[6] ఫ్రెంచి లెజిటిమిస్టులు – French Legitimists – 1830లో కూలద్రోయబడిన బోర్బన్ వంశానికి అంటిపెట్టుకొన్నవారు. ఈ వంశం, భూస్వాములైన ప్రభువంశీకుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ధనిక ఫ్యూడల్ భూస్వామ్యవర్గం వత్తాసునూ, బడాబూర్జువావర్గం వత్తాసునుగల పాలకులైన ఆర్లియన్ కుటుంబంను వ్యతిరేకిస్తూ కొంతమంది లెజిటిమిస్టులు కార్మిక ప్రజలను బూర్జువా పీడననుండి రక్షిస్తామని నటించుతూ సామాజిక ప్రజా నాయకత్వానికై ప్రయత్నించారు. పుట 64.

[7] "యువ ఇంగ్లండ్" –Young England – ఇది టోరీ రాజకీయవేత్తలు, విద్వాంసులుగల ఒక గ్రూపు. ఈ గ్రూపు 1840 దశాబ్ది ఆరంభంలో ఏర్పాటయింది. నానాటికి పెరిగిపోతూన్న బూర్జువావర్గ ఆర్థిక శక్తిపట్ల రాజకీయ ఫ్యూడల్ భూస్వామ్య వర్గంయొక్క అసంతృప్తిని వీరు వ్యక్తపరచారు. కార్మిక వర్గంపై పలుకుబడి సంపాదించేందుకూ, ఆ వర్గాన్ని బూర్జువావర్గంతో పోరాడేందుకు ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతోనూ వీరు ప్రజను రెచ్చగొట్టడమే శరణ్యమనుకున్నారు.

వీరి మతం ఫ్యూడల్ సోషలిజమని మార్క్స్ ఎంగెల్స్‌లు "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"లో వర్ణించారు. పుట 64.

[8] రిపబ్లికన్ విధానమునూ, ప్రజాతంత్ర సామాజిక సంస్కరణలనూ ప్రచారంచేస్తూ "Réforme" ("సంస్కరణ") పత్రికకు అంటిపెట్టుకొన్నవారి విషయమై యిక్కడ ఉదాహరింపబడింది. "La Réforme" – ఇది ఒక ఫ్రెంచి దినపత్రిక. ఇది పెట్టీబూర్జువా డెమొక్రాటిక్ రిపబ్లికన్‌ల పత్రిక. 1843నుండి 1850వరకు పారిస్‌లో ప్రచురింపబడింది. 1847 అక్టోబర్‌నుండి 1848 జనవరిలోగా ఎంగెల్స్ తన వ్యాసాలలో చాలావాటిని యీ పత్రికలో ప్రచురించాడు. పుట 75.

## పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదం విషయంలోనూ అట్ట మీది డిజైన్ విషయంలోనూ పాఠకుల అభిప్రాయాల్ని పంపగలిగితే విదేశభాషా ప్రచురణాలయంవారు హర్షింపగలరు.

మీ అభిప్రాయాలను యీ క్రింది చిరునామాకు పంపగలరు:

Foreign Languages Publishing House.
21, Zubovsky Boulevard,
Moscow. USSR.

Редактор *С. Дзенит*
Корректоры *Л. Смирнова, В. Козленко, Т. Малинина*
Художественный редактор *В. Колганов*
Технический редактор *А. Фирсова*

Подписано к печати 19/VI-1962 г. Формат $84 \times 108^1/_{32}$.
Бум. л $1^3/_8$. Печ. л. 4,51+3 вклейки. Уч.-изд. л. 4,66.
Заказ 3288. Цена 20 коп. Тираж 6000.

Московская типография № 3 Мосгорсовнархоза

К. МАРКС, Ф. ЭНГЕЛЬС

# МАНИФЕСТ КОММУНИСТИЧЕСКОЙ ПАРТИИ

*На языке телугу*